
ఆంధ్రసచిత్రవారపత్రిక



-5-72

50 పైసలు


నువ్వు చేస్తే డిఫెక్షన్
నేను చేస్తే సిద్ధాంతాన్ని బలపరచడం కోసం
నీ ఒప్పందాలన్నీ మన సిద్ధాంతాలకి వ్యతిరేకం
నా ఒప్పందాలన్నీ మన అంతిమ విజయానికి సాధనాలు
నువ్వు అర్హతలు చూడకుండా మీవాళ్ళనే వేసుకుంటావు
అర్హతంటూ ఉంటే మావాళ్ళనైనా సరే వేసుకోవటానికి సందేహించను
నువ్వు పట్టిన కుందేటికి మూడే కాళ్ళంటావు
నా సిద్ధాంతాల కోసం తెగేదాకా బిగిస్తాను


రామన్న సమర్పించు
R.R.PICTURES
ఆర్.ఆర్. పిక్చర్స్ వారి
మాయింటికోడలు
దర్శకత్వం: శ్రీకాంత్ నిర్మాత: బి.యస్.మూర్తి
మాటలు: డి.వి.నరసరాజు సంగీతం: గోవర్ధన్
ఆంధ్ర, సీడెడ్
విజయా
నేషనల్ ఆర్ట్స్ పిక్చర్స్
మైసూరు
శ్రీ విజయా పిక్చర్ సర్క్యూట్
VIJAYA

ఉత్తరాలు

సినిమా

వారపత్రికలన్నింటిలోకి సినిమా వార్తలన్నీ ముందుగా తెల్పేది పత్రికేననుటలో సందేహమ్ము లేదు. కాని సినిమాల గురించి పొగడ్త లేకాని విమర్శ అనేది కనుపించుటలేదు. వీరు బ్రహ్మాండంగా ఉన్నాయని పొగిడిన చాల చిత్రములు కనీసపు వసూళ్ళు నయినా పొందలేక పోయాయన్న విషయం పాఠకు లందరికీ తెలిసిందే. కాబట్టి ఇకనుంచి విమర్శకు కూడ ప్రాధాన్యత యివ్వగోర్తాను.

యస్. చిట్టిబాబు (బాపట్ల)

ఆంధ్రపత్రిక వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం : 5–5–72

(శ్రీ పరీధావినామ సం॥ అధికవైశాఖ వాస॥ బ॥ సప్తమి)

సంపుటము : 65 సంచిక : 37

స్థాపితము :
1908

సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్

ఆంధ్రపత్రిక కార్యాలయము
1, తంబుచెట్టి వీథి, మద్రాసు - 1

విడి ప్రతి వెల 50 పైసలు

పోస్టుద్వారా

సంవత్సరం చందా	31·20
6 మాసముల చందా	15·60
3 మాసముల చందా	7·80

విషయానుక్రమణిక

ముఖచిత్రం :
నటి కాంచన.


క్రమశిక్షణా చర్యా భయం
ఆంధ్ర కాంగ్రెస్ వారితో తిరుగుబాటుదారులు
పడిపోయిన మరొక ఏనుగు
పాత కాంగ్రెస్
లొంగిపోవడానికి నిరాకరించిన బందిపోట్లు
పలుకుబడిని దుర్వినియోగం చేసేవారు
చాలామంది బందిపోట్లు లొంగుబాటు
నల్లబజారు నడిపే వారు
లంచం తీసుకునే వారు
ఉత్తర వియత్నాం
దక్షిణ వియత్నాం

కొత్త శీర్షిక ప్రారంభం!

మోషె దయాన్‌తో నా ప్రణయ జీవితం

ఎలిషెవా జిసిన్



మోషెదయాన్ మాజీ ప్రేయసి, ఈ వ్యాస రచయిత్రి ఎలిషెవా జిసిన్

బ్రిటనుదేశాన్నే ఒక్క వూపూపిన 'సెక్స్—దేశరక్షణ' బాపతు క్రిస్టీన్ కీలర్ కథాకాలక్షేపాన్ని గుర్తుకు తెచ్చే సంఘటనొకటి ఇజ్రేలును భగుమనిపించింది.

ఆ జిప్పుతో ఒక్క ఆరురోజుల యుద్ధంలో విజయలక్ష్మిని చేపట్టిన 'ఒంటికన్ను' రక్షణమంత్రి జనరల్ మోషె దయాన్ యీ కథకు నాయకుడు.

పత్రికా రచయిత, పార్లమెంటు మెంబరూ అయిన యూరి అవ్నేరి అనే ఆయన మోషె దయాన్ మీద తనకున్న అనుమానాలని నాలుగుముక్కలలో ప్రశ్నలుగా తయారుచేసి, 'మిస్టర్ మోషె దయాన్ దేశాభ్యుదయానికి సంబంధించిన పనులు చక్కగా చేయడానికి అందుక్కావలసినంత కాలం వినియోగించగలుగుతున్నారా? రక్షణనిధులను ఆ పనులకే వినియోగిస్తున్నారా? 'తప్పులను పట్టుకుని బెదిరించేవారి'కి దొరికిపోడంవల్ల ఆ విపత్తులలో ఆయన గట్టిగా యిరుక్కోడం లేదుకదా! తన ప్రవర్తనవల్ల ఆయన దేశశాంతి భద్రతలకు సంబంధించిన రహస్యాల కొంపలు ముంచడం లేదనుకోవచ్చా!' అని పార్లమెంటులో అడిగేశారు.

ఆయనడిగిన ప్రశ్నలు 57 ఏళ్ళ రక్షణమంత్రి మోషెదయాన్‌కూ, ఆయనకన్నా 20 ఏళ్ళు చిన్నదయిన ఓ అందాలరాసికీ వున్న రహస్య ప్రేమాయణసంబంధాలని బయటపెట్టాయి. 36 ఏళ్ళ తరువాత జనరల్ దయాన్ తన భార్య రత్‌కు మొన్న డిశంబరునెలలో విడాకులిచ్చారు.

విలాసపురుషుడన్న పేరాయన అష్టకష్టాలూపడి, సంపాదించి సొంతానికి అట్టేపెట్టుకున్నారు. కాని యిదేరీ 'ఇజ్రేలు హీరో'గా ఆయనకున్న పేరును, పలుకుబడిని రవ్వంతకూడా తగ్గించలేకపోయాయి.

బ్రిటన్ యుద్ధమంత్రికి క్రిస్టీన్ కీలర్‌కూ వున్న సంబంధాలలాగ జనరల్ దయాన్‌కూ ఎలిషెవా జిసిన్‌కూ వున్న సంబంధంవల్ల దేశభద్రతకేమైనా కీడేమోనని యావాదూ ఇజ్రేలంతా అనుమానించి, చూస్తోంది. దీనికితోడు ఆయన ప్రేయసి ఎలిషెవా తండ్రి ఇరాక్‌కు చెందినవాడు.

అనగా అరబ్ దేశస్థుడనమాట.

ఈ విషయం మరింత కలవరం పుట్టించింది.

యుద్ధమంత్రి తన సైన్యాన్ని ఈజిప్టు మీదకు నడుపుతూ తానుమాత్రం ఓ అరబ్ చక్కనిచుక్కతో సరాగాలాడుతున్నాడన్నమాట.

వీరి సరాగాలో మూడేళ్లు ముచ్చటగా సాగాయి.

'ఆయన్ని మొదటిసారిగా కలిసినపుడు నేను కన్యను. తన భార్య రత్‌కు విడాకులిచ్చి



తన స్వంత ట్రా. నహాలాల్‌లో 19ఏళ్ల రత్‌తో ప్రేమకలాపాలు సాగిస్తున్న దయాన్. ఈ చిత్రం 1935లో తీసింది. తర్వాత కొన్ని నెలలకి వారిద్దరూ భార్యాభర్తలైనారు. ఆతర్వాత ఇద్దరు కొడుకులకీ ఒక కుమార్తెకీ తల్లిదండ్రులైనారు.

నన్ను వివాహం చేసుకుంటానని ఆయన హామీ యిచ్చాక, నా సర్వస్వాన్నీ ఆయన కర్పించాను' అంటుంది ఎలిషెవా.

'మాయిజ్ ఫంట్'ను వదలి ఆయన ఎన్నో రాత్రులు నాకోసం వచ్చేవారు. అంతే గాదు, పద్నాలుగుమంది ఇజ్రేలీసిపాయిలు ఘోరంగా చంపబడ్డ నాటి రాత్రి కూడా ఆయన నాతో గడిపారు' అందిటామె.

కానీ ఆ రోజుల్లో దయాన్ తన భార్యకు విడాకులివ్వలేదు. తనను వదిలేశాక చాలా కాలానికి దయాన్ తన భార్యకు విడాకులు డిశంబరునెలలో ఇచ్చాడన్నసంగతి ఎలిషెవా పేపరుతో చదివి తెలుసుకుందట.

తనను ఇహాయన వివాహం చేసుకుంటాడన్న ఆశ లేనేలేదనీ, కానీ తన స్నేహితురాండ్రలో ఒకరినాయన వివాహం చేసుకోబోతున్నాడన్న వార్త మాత్రం తనకు చాలా బాధ కలిగించిందని ఎలిషెవా బాధపడ్డదట.

ఆ స్నేహితురాలు రాషెల్ రాబినోవిట్స్‌కూ దయాన్‌కూ గత పదిహేడేళ్ళుగా సంబంధం వున్నట్టు ప్రజానీకానికి తెలుసు. ఈ పద్ధతి కేవలం ద్రోహమని, ప్రేమ ద్రోహమని ఎలిషెవా మథనపడ్డది.

మూడు దఫాల్లో పదివేల ఇజ్రేలీ పౌనులు పరిహారం చెల్లించి, దయాన్ ఆమెనుంచి యిూలోగానే విముక్తిపొందాడు. 'ఈ విషయంలో ఇంకా ముందుకు వెళితే రాజకీయాలలో నానా గొడవలూ వస్తా యని ఆయన నాకీ ఎరపెట్టి, నా నోరు మూయించారు. కానీ, ఆ డబ్బంతా యిప్పు డాయనకు తిరిగిచ్చేసి, యిూ విషయాన్ని ప్రపంచానికి ఎలుగెత్తి చాటడానికే నేను నిర్ణయించుకున్నాను' అని ఎలిషెవా చెప్పింది.

117, డైజంగోఫ్ వీధి, టెల్ ఎవివ్‌లో వున్న తన తల్లి అంగడిలో వో గదిలో కూర్చుని ఎలిషెవా యిూ విషయాలన్నీ, 'స్టెర్న్' అనే వో యూరప్ ప్రముఖ పత్రిక విలేఖరులకు వివరించింది.

ఒక చెక్కు మార్పిడి విషయంలో తన సోదరుడు కష్టాల్లో చిక్కుకునే సరికి, ఆ విషయంలో సహాయం కోరడానికి తాను మొట్టమొదటిసారిగా దయాన్‌తో ఫోనులో మాట్లాడిందట.

'ఈ విషయంలో మీకు సహాయం చేయ గలిగినవారు ఆయనొక్కరే; అని నాకు కొందరు సలహాయిచ్చారు' అన్నదామె.

తనతో జనరల్ దయాన్ స్వయంగా మాట్లాడారనీ, అసలు తనాయనకు బాగా చనువయ్యాక, 'ఆహా! ఆనాడు ఫోనులో నీ గొంతెంత మధురంగా వుంది' అని తన

ఏర్పాటయ్యిందనీ, చెప్పి' తీరా నేను వెళ్ళే సరికి ఆయన ఏదో తొందర పనుల్లో వున్నట్టు కనిపించారు. నా టెలిఫోను నెంబరు తీసుకుని, నా సోదరునికి తప్పక సహాయం చేస్తానని మాటిచ్చి, వో కోకా కోలా తెప్పించి మరీ వెళ్ళారు' అందామె.



1941లో సిరియాలో ఫ్రెంచి తుపాకి గుండు తగిలి దయాన్ కన్నుపోయింది. భార్య రత్‌తో నృత్యం చేస్తున్న దయాన్. 36 సంవత్సరాలు కలసి ఉన్నవీరు 1971 డిశంబరులో విడాకులు తీసుకున్నారు.

నాయన పొగిడారనికూడా ఆమె చెప్పింది.

ఆ చెక్కు విషయం ఫోనులో ఆనాడు చెప్పాక 'మా యింటికి రండి. మాట్లాడు దాం' అని దయాన్ అన్నారని, అంతేగాక, మీ కూడా ఎవరూ లేరుకదా' అనికూడా అడిగారనీ జార్డిన్ కేఫ్‌లో కలుసుకోడానికి

'కానీ, హోటల్నుంచి వచ్చి, ఇంటి గుమ్మం ఎక్కేలోగానే ఫోను మ్రోగింది. తీరా హలో అందును గదా ఆయనే! జార్డిన్ కేఫ్ 319వ రూములో ఒక పార్టీ జరుగుతోందని, మీరు వెంటనే రావాల్సిందని వస్తున్నారు. నేను మళ్ళీ

మోషె దయాన్...

ఆ హోటలుకు వెళ్లేసరికి ఏ పార్టీలేదు. ఆయనొక్కరే వున్నారు. నన్ను చూసి ఆవేశంగా లేచి నామీదకు రాబోయేసరికి నేను తప్పించుకు వచ్చేశాను...'

'...మర్నాడాయన ఫోనుచేసి, తన ప్రవర్తనకు క్షమాపణలు చెప్తూ మళ్లీ అదే హోటలుకు నన్ను రమ్మని చెప్పారు. అంతేగాక, 'ఈ సారి నేను మిమ్మల్ని వేలేసికూడా ముట్టుకోను' అని హామీ కూడా యిచ్చారు. కానీ నేను రూము వద్దనీ, హాల్లోనైతేనే కలుసుకుంటానని చెప్పాను. దానికాయన వొప్పలేదు. హాల్లో అయితే పత్రికా విలేఖరులు, ఫోటోలు తీసేవారూ వుంటారు అని చెప్పారు. కనుక నేనాయన్ని రూములోనే కలిశాను...

...ఆనక వరసగా నో నాలుగు వారాల పాటు రోజూ కలుస్తూనే వున్నాము. డాన్ హోటలు రూములోగానీ, జార్టిన్ కేఫ్‌లో చక్కని చిన్న ప్రత్యేకమైన రూముల్లోగానీ కలుసుకునే వాళ్ళం...

...దయాన్ చాలా సరసుడు. చాలా హుషారైనవాడు. డాన్ హోటల్లో ఒకనాడు నాకు బాగా దగ్గరగా జరిగి కూర్చొని, 'నీకో రహస్యం చెప్పనా,' అని, 'నేను నిన్ను పెళ్లి చేసుకోబోతున్నాను' అన్నారు.

'అదెలా సాధ్యం? మీరింకా మీభార్య రత్‌కు భర్తే కదా!' అన్నాను నేను. తాను రత్‌ను విడాకులకోసం అడిగినట్టు నాతో చెప్పి, 'ఇస్తే సరేసరి లేకపోయినా ఆవిణ్ణి వొదిలి, నేనీతోనే వుండిపోతాను తెలుసా' అన్నారు.

నేనంటే ఆయనకు ఎనలేని యిష్టం. తాను చాలామందిని చూశానని, కానీ తాను చూసిన అందరిలోనూ నేనే తియ్యటి, చక్కటి చినదాన్నని ఎప్పుడూ అనేవారు. నా అంత చక్కని శరీరపు వొంపులు వేరెవరికి తాను చూడలేదని అనేవారు...

...ననూ, రాఖెల్ రాబినోవిట్స్‌కూ వున్న సంబంధం తీరిపోయిందనికూడా నాతో ఆయన చెప్పారు' అంటూ ఎలిషెవా జిసిన్ నిట్టూర్చింది.

(ముగింపు పైవారం)

గాలికి తోడు తేలిక!

ర్యాలిఫాన్, మీరు కొనగలిగే అతి తేలికైన టేబుల్ ఫాను.

కనుక దానిని ఒక గదినుండి వేరొక గదిలోనికి తీసుకొని వెళ్లుట సులభము!

ర్యాలిఫాన్ దిట్టమైన, తక్కువ బరువు గైన అల్యూమినియంతో తయారుచేయబడినది. అది 7 కిలోలు మాత్రమే బరువుంటుంది—ఏ యితర టేబుల్ ఫాను కంటె బరువు 2 కిలోలు తక్కువ. కనుక మీరు దానిని కావాలన్న చోటుకు సులభముగా తీసుకువెళ్లవచ్చును.



మీ వంటింటిని చల్లగా, ఆవిరి మరియు పొగలేకుండా చేస్తుంది.

ర్యాలిఫాను ఏ యితర టేబుల్ ఫాను కంటె 20% ఎక్కువ చల్లగా చేసే శక్తి యున్నదని పరీక్షలలో తేలింది. కనుక మీ వంటింట్లో వేడిని పోగొట్టుటకు, ఆవిరిని మరియు పొగను తరిమి వేయుటకు ర్యాలిఫాన్‌కు సాటి ఏదీ లేదు. కనుక మీరు చల్లగా, సౌఖ్యముగా పనిచేసుకోగలరు.

ఈగలను మరియు దోమలను చేరనీయదు.



ర్యాలిఫాను నిశ్శబ్దముగా తిరుగుతూ, మీ పడకగదిని చల్లగా ఉంచడమే కాకుండా దానిలోనికి ఈగలు, దోమలు రాకుండా చేస్తుంది. మీరు రాత్రి సుఖముగా నిద్రపోవచ్చును.

మీరు పనిచేసుకొనునపుడు నిశ్శబ్దముగా ఉంటుంది.




ర్యాలిఫాను మీరు కొనగలిగే అతి నిశ్శబ్దమైన టేబుల్ ఫాను. దాని బ్లేడ్లు మరియు మోటారు చప్పుడు లేకుండా పనిచేసేలా ప్రత్యేకముగా డిజైను చేయబడినవి.

ర్యాలిఫాను ఏళ్ల తరబడి మన్నుతుంది.

ర్యాలిఫాను ఏళ్లతరబడి మన్నేలా తయారుచేయబడినది. దాని ప్రతి భాగము ఎన్నో ఏళ్లు ఎడతెగని ఉపయోగమునకు తట్టుకొనేలా పరీక్షింపబడినది. దానిని ఒక గది నుండి యింకొక గది లోనికి ఎన్నిసార్లు మార్చినా పాడవదు. అందుకనే దానికి మేము పూర్తిగా 2 ఏళ్ల గ్యారంటీ యిస్తాము. నేడే ఒక ర్యాలిఫాన్‌ను కొనుక్కోండి.

2-YEAR GUARANTEE



చల్లని, మంచి గాలికి

ర్యాలిఫాన్

ర్యాలిఫాన్లు వివిధ రకములవి, టేబుల్, సీలింగ్, వాల్, పెడెస్టల్, ఎక్స్‌హాస్ట్, మిని మల్టి-పర్పస్ మరియు కాబిన్ ఫాన్లు లభిస్తున్నాయి!

[illegible]

డిస్ట్రిబ్యూటర్లు: జెల్‌డి ఎంటర్‌ప్రైజెస్, 141, దుర్గా భవన్, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్.

ఒక వారం విపరీతం

ఫాలాక్షుడు

చెవి కొరకటం?

బెంగుళూరు నీలమంగళకు చెందిన అగసరహళ్ళి అనే ఊరిలో ఒకాయన పొలంలో వో నలుగురు దౌర్జన్యంగా జొరబడి భీభత్సం చేస్తుండగా ఆపొలం సొంతదారు వారిని ఎదుర్కోబోయే సరికి అందులో ఒకాయన టక్కున ఆతని చెవి కొరికి పట్టుకు చక్కాపోయాడట. చెవికి చెవి లాక్కుపోయాడటా దురాత్ముడు.

మూర్ఛకి చికిత్స చిత్రవధా!

జలంధర్‌కు చెందిన ప్రతాప్‌భాగ్‌లో 16 ఏళ్ళ పార్వతికుమారి అనే ఆమెకు ఫిట్సు (మూర్ఛ) వస్తుంటే ఆమెను సాధూరామ్‌దాస్ అనే ఆయన వద్దకు తీసుకు వెళ్ళారట. ఆమెకది మూర్ఛకాదని, వో దెయ్యం ఆమెను ఆవహించిందని, దెబ్బకు తానా దెయ్యాన్ని వదలకొట్టగలననీ చెప్పి వో రెండురోజులపాటు తన ఆశ్రమంలో పెట్టుకొని, సాయంకాలాలు ఆమెను చితకతన్నాడట. మూడోనాడిక భరోసాయిచ్చి, ఆమెను యింటికి తీసుకువెళ్ళమన్నాడట. కానీ, 10వ తేదీ సాయంత్రం మళ్ళీ ఆమెకు ఫిట్ వచ్చేసరికి, ఆమె అన్నగారామెను సాధుగారి వద్దకు తీసుకువెళ్ళాడట. సాధుగారామెను తనపాకలోకి తీసుకునివెళ్ళి, ఇనుపఆయుధం (సావణం)తోనూ, మండే కొరకంచులతోనూ నానాహింసలూ పెట్టి, 'ఇక తెల్లవారి యీమెను మీరు తీసుకుపోవచ్చు' అని ఆమె అన్నగారికి చెప్పాడట. సాధుగారికి యీ హింసాకాండలో ఆయన శిష్యుడు ప్రతాప్‌కుమార్ కూడా యథాశక్తి సాయపడ్డాడట.



తెల్లారి, తన చెల్లెలును యింటికి తీసుకు వెళ్దామని చూస్తే ఆమె చనిపోయివుందట. ఆమె శరీరం మీద వాతలూ, బొబ్బలూ, దెబ్బలూ మొత్తం పన్నెండున్నాయట. ఆమె అన్న ఇందర్‌పాల్ యీ విషయం పోలీసులకు తెలియజేస్తే వారొచ్చి గురుశిష్యులను అరెస్టు చేశారట.

ఆర్థిక బాధలు — ఆత్మహత్య— పిల్లలకి విషం

ఆర్థిక యిబ్బందులు కారణంగా వో 35 ఏళ్ళ వై. నారాయణ అనే ఆయన తన 5 ఏళ్ళ కొడుకు శ్రీనివాసులుకూ, 3 ఏళ్ళ కూతురుపద్మావతికీ విషం యిచ్చి, తానూ త్రాగాడట. ఫలితంగా ముగ్గురూ చనిపోయారట. ఇది కడపజిల్లా ఉప్పరపల్లి లో జరిగింది.

వాషింగ్‌టన్‌లో కారు ప్రమాదంలో మరణించిన భారతీయ విద్యార్థి

వాషింగ్టన్ విశ్వవిద్యాలయంలో మెకానికల్ ఇంజనీరింగు చదువుతున్న 29 ఏళ్ళ విద్యార్థి ఆర్. ప్రద్యుమ్న సిన్హా అనే అతను కారులో పోతుండగా అతనికారు వో ట్రక్కు గుద్దిందట. ఫలితంగా ఆతను చనిపోయాడట. ఈతను బెంగుళూరు విశ్వవిద్యాలయంలో డిగ్రీతీసుకున్నాడట.

'ఏ' విటమిన్ లోపంవల్ల అంధత్వం!

భూమండలం మీదున్న గుడ్డి వారిలో ప్రతి ముగ్గురిలో ఒకడు భారతీయుడట. మనదేశంలో ప్రతీయేటా 12 వేలమంది పిల్లలు గుడ్డివారవుతున్నారట. దీనికి కేవలం విటమిన్ ఏ ఆహారంలో తగినంత లేక పోవడమే కారణమని ఉపరాష్ట్రపతి జి. యస్. పథక్ అన్నారట. అయ్యా; ఏవిటమిను కావాలన్నా ముందు కావాల్సిన విటమిన్ మరొకటున్నది కదా!

బాధలనుంచి విముక్తికోసం

క్షయవ్యాధితోనూ, అంతకు తీసిపోని పేదరికంతోనూ బాధపడుతున్న 35 సంవత్సరాల వ్యక్తి తాను విషం త్రాగడమే గాక, 9 సంవత్సరాలనుంచి 17 రోజుల వయస్సులో వున్న నలుగురు పిల్లలకు భార్యకూ కూడా విషం పెట్టాడట. వీరి శవాలు ఆత్మూరు వశిష్ట నదివద్ద పోలీసులు చూశారట.

ఉత్తరప్రదేశ్ పోలీసు వ్యవహారాలని పరిశీలించడానికి వచ్చిన వ్యక్తి అరెస్టు!


మీరట్ పోలీసు సూపరింటెండెంటును కృష్ణచంద్ అనే ఆయన కలుసుకుని, యు.పి.లోని పోలీసు వ్యవహారాలను పరిశీలించమని తనను ఇందిరాగాంధీ నియోగించినట్లు చెప్పాడట. ఆ సూపరింటెండెంటు గారికి అతని మీద అనుమానంవచ్చి యీ విషయాన్ని రహస్యంగా ప్రధాని సెక్రటేరియట్‌కు తెలియజేసి అడిగితే అలాటిదేమీ లేదని బదులొచ్చిందట. దాంతో ఐ.పి.సి.170 సెక్షను ప్రకారం ఆ కృష్ణచంద్‌ను శ్రీకృష్ణ జన్మస్థానంలో భద్రపరిచారట.

పార్లమెంటుకి దిగంబరస్వామి ఆగమనం!

జైనమత స్థాపకుడైన వర్ధమానుని జయంతి ఉత్సవాల సందర్భంగా పార్లమెంటులో మొన్న 12వ తేదీన జరిగిన మీటింగుకు 60 ఏళ్ళ ఆచార్య దేశ్ భూషణ్ జీ దిగంబరుడై విజయం చేశారట. కనీసం ఆకులతోనైనా అవసరమైన చోట కప్పుకోమని అంతకుముందే ఆయనకు చెప్పినా, అవేమీ వినక, దిగంబరుడిగానే రావడం సభికులకు ఆశ్చర్యం కలుగజేసిందట. శ్రీమతిగాంధీ అధ్యక్షత వహించిన యీ సమావేశానికి వచ్చిన ఆచార్య దేశభూషణ్ జీ తిన్నగా వెళ్ళి కేంద్రమంత్రులు నూరుల్‌హసన్‌కూ, రామ్ నివాస్‌మీర్ధాకు మధ్యకూర్చున్నారట—హాట్రిక్!

దేశంలో లైసెన్సు కట్టిన రేడియోల సంఖ్య!

భారతదేశంలో పోయిన ఏటికి రేడియో లైసెన్సులు కట్టినవారిసంఖ్య 1,27,72,225 అట. వీరివల్ల ఆదాయం 17.27 కోట్లట. దేశంలో ఎక్కువ రేడియోలున్న రాష్ట్రం మహారాష్ట్ర అనీ, ఆనక పంజాబనీ, ఆ తరువాత యు. పి. అనీ కూడా లెక్కలు తేల్చాయట. వేరిజాంధ్రా




టాప్
రహస్యము!




క్రొత్త బినాకా టాప్‌లో మాత్రమే ఒక రహస్యమైన పదార్థము ఉంది కనుక యీ టూత్ పేస్టు మీ నోటిలో అన్ని మూలలకు, పళ్ల మధ్య చిన్న చిన్న సందులలోనికి చొచ్చుకొని పోయి, ఆ చోట్లలో ఉన్న సూక్ష్మ క్రిములను నాశనము చేస్తుంది. అందుకనే మీ నోరు రోజంతా సంపూర్ణముగా శుభ్రముగా, పూర్తిగా తాజాగా ఉంటుంది. అలా మీ నోటి ఆరోగ్యమునకు సంపూర్ణ రక్షణ కలుగుతుంది.


ఈ నిదర్శనమును మీరు చూడగలరు! పరిశోధనాగారములో జరిగే యీ పరీక్షను నేడే మీ యింట్లో చేసి చూడండి!



ఒక గాజు గిన్నెను తీసుకొని దానిలో నీరు పోయండి. బొగ్గు గుండను లేక రంగు పొడరును నీటి మీద చల్లండి.




బినాకా టాప్‌ను కొంచెము నీళ్లలో కలపండి. ఆ ద్రావకము ఒక చుక్కను గాజు గిన్నె మధ్యలో వేయండి.



బినాకా టాప్ ఎంత త్వరగా అన్ని వైపులకు చేరి మలినమును పోగొట్టి, ఉపరితలమును స్వచ్ఛముగా, తేటగా చేస్తుందో మీరే చూడండి.

బినాకా టాప్
... సంపూర్ణ నోటి రక్షణ యొక్క రహస్యము



ఒకవారం విపరీతం

సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు


ఫిబ్రవరి 1972 నెలాఖరుకు గత యీ మూడేళ్లలోనూ 47,21,146 సంతాననిరోధక శస్త్ర చర్యలు దేశంలో జరిగాయట. తత్ఫలితంగా 129 మంది మాత్రమే మృతిచెందారట. ఈ విషయం ఆరోగ్యశాఖామంత్రి డి. పి. చటోపాధ్యాయ తెలియజేశారట.

12 ఏళ్ళ బాలికపై పోలీసు ఉద్యోగి అత్యాచారం!

రాయ్‌పూరు పోలీసుస్టేషనుకు చెందిన డి. యస్. గిల్ అనే పోలీసు వుద్యోగి, తోటి వుద్యోగితో కలసి ఓ యింటిమీద దాడిచేసి, ఆ యింట్లోని 12 ఏళ్ళ అమ్మాయిని, ఆమె తలిదండ్రులనూ జీపులో ఎక్కించుకు బయలుదేరి, మధ్యేమార్గంలో జీపాపి, ఆమె తలిదండ్రులనిద్దర్నీ వదిలేసి, మరికొంతదూరం వెళ్ళి జీపునాపి, ఆమెను కోర్కె తీరా చెరచి, ఆమెను ఆనక్క అక్కడే వదిలేసి, టింగురంగా అని వెళ్ళిపోయాడట. ఆమె రాయ్‌పూర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వున్నదట. ఈ విషయం మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి పి.సి. సేథి తెలియజేశారుట. ఆ యిద్దరు పోలీసు ఉద్యోగుల మీదా ప్రభుత్వం చర్య తీసుకుంటుందట. —వాట్ చర్య!!

విదేశీ అమ్మాయిని పెళ్లాడితే విదేశీ కారు!

విదేశీకారు కావాలంటే ఏ విదేశీయ అమ్మాయిని కూడా పెళ్ళాడాలి. ఇటీవల మారిన రూల్సు ప్రకారం ఏ విదేశీ అమ్మాయిని వివాహం చేసుకుంటే ఏ ఫారిన్‌కారు వస్తుందని తేలిందట.



ఆత్మహత్యకి పాల్పడ్డ అక్కా- చెల్లెళ్ళు

బెంగళూరు జర్నలిస్టు కాలనీలో ఇద్దరక్కాచెల్లెళ్ళు విషంత్రాగి, తమ జీవితాల నంతం చేసుకున్నారట. అక్క 24 ఏళ్ళ నాగరత్నమ్మ బెంగళూరు వైద్యకళాశాలలో చదువుతున్నదట. చెల్లెలు 16 ఏళ్ల శ్రీదేవి మవుంట్‌కార్మెల్ కళాశాలలో చదువుతోందట. వీరిద్దరూ ఆత్మహత్య చేకునున్నారని పోలీసు అనుమానపడి, తత్‌కారణాలు వెతుకుతోంది. ●

అవీ — ఇవీ . . .

దక్షిణభారత నటీనట సమాఖ్య(న్యూఢిల్లీ)వారు 27వ తేదీన అశోకారోడ్డు కాన్‌స్టాంటియాహాలులో ప్రపంచ రంగస్థల దినోత్సవ సందర్భంగా జనరంజకమైన సంగీత నృత్య, నాటక, కార్యక్రమాన్ని నిర్వహించింది. వందలాది ఆంధ్రులు, ఆంధ్రేతరులతో హాలు క్రిక్కిరిసి పోయింది.


సమాఖ్య ఉపాధ్యక్షులలో ఒకరైన శ్రీ ఎస్. బి. ప్రసాద్ సభకు అధ్యక్షత వహించారు. ఆయన సదస్యులకు స్వాగతం చెబుతూ, గత 15 ఏళ్ళలో సమాఖ్య సాధించిన ప్రగతిని వివరించారు.

ప్రముఖ పత్రికా రచయిత, నాటిక విమర్శకుడూ అయిన శ్రీ వి. వి. ప్రసాద్ ప్రసంగిస్తూ, సమాఖ్య భారత రాజధానిలో చేస్తున్న కళాసేవను ప్రశంసించారు. తరచు తెలుగు కార్యక్రమాలను నిర్వహిస్తూ స్థానిక ఆంధ్రప్రజల మన్ననలను పొందడమేగాక, ఢిల్లీ సాంస్కృతిక వర్గాలలో మంచిపేరు, పలుకుబడి పొందినందుకు ఆయన సమాఖ్యను అభినందించారు.


సభానంతరం సాంస్కృతిక కార్యక్రమం ప్రారంభమైంది. మొదట కుమారి జయలక్ష్మీ రామన్ భరత నాట్య ప్రదర్శన జరిగింది. ఆమె ప్రదర్శించిన నృత్య కౌశలం హావ భావాలు, యూవ న్మంది ప్రేక్షకుల మెప్పు పొందాయి. తదనంతరం చిన్నబాలిక లిద్దరు— బేబి స. సరస్వతి, బేబి. ఎం. విజయలక్ష్మి రెండు నృత్యాలు ప్రదర్శించారు. ఆపైన శ్రీ ఎస్. సుబ్రహ్మణ్యం వయొలిన్‌పై కొన్ని మధురమైన బాణీలు వినిపించారు.

చివర్న 'ప్రేమలేఖ' అనే నాటికను సమాఖ్య సభ్యులు అతి మనోరంజకంగా ప్రదర్శించారు. శ్రీ కె. సుదర్శనం వ్రాసిన యీ ఏకాంకికకు శ్రీ కె. వి. ఆర్. మూర్తి దర్శకత్వం వహించారు. ఇందులో శ్రీయుతులు ఎస్. ఎ. ఎక్. నరసింహం, జి. వి. సుబ్రహ్మణ్యం, ఎం. ఎస్. ప్రసాదరావు కె. వి. ఎస్. శివరావు, ఎస్. లక్ష్మీజీరావు నటించారు.

సమాఖ్య సంయుక్త కార్యదర్శి శ్రీ ఎం.వి. రమణారావు వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. (ఒ. వి.)



కృష్ణవేణి



లెఫ్టినెంట్ కుమారి పి. వకుళ

జడ్జి పరంధామయ్యగారు కోర్టుకెళ్ళటానికి తయారై, 'ఈ రోజు కూరలేమిటి కృష్ణా' అంటూ డైనింగ్ హాలులోకి ప్రవేశించారు. అప్పటికే, వేణు, శశి, శంకర్ 'డైనింగ్ టేబుల్' దగ్గర తండ్రి కోసం ఎదురుచూస్తూ కూర్చున్నారు.

శశి తన ప్లేటులో కూరలు చూసి, 'ఆ, ఈ రోజు నేను చిక్కుడుకాయ వేపుడు చెయ్యమన్నాను గదక్కా. ఈ కూరలు నాకే మఖ్ఖరలేదు' అని అలిగి కూర్చుంది.

'వెంకన్నను మార్కెట్టుకు పంపానమ్మా. చిక్కుడుకాయలు ఇంకా రాలేదన్నాడట. ఇంకొక వారం రోజులలో మన పెరట్లో కాయలు వస్తాయి — వండుకుందాములే, ఈ రోజుకు తినమ్మా' అని నెమ్మదిగా చెప్పటానికి ప్రయత్నిస్తోంది కృష్ణవేణి.

'ఇదిగో, కృష్ణా పిల్లలను నువ్వే చెడుపుతున్నావు. లేకపోతే, పదిహేడు సంవత్సరాల పిల్లను నువు అలా బతిమాలటం ఏమిటి?' అంటూ కసురుకున్నారు తండ్రి

'ఏదో, చిన్న పిల్లలెండి బాబుగారూ. నేను చూసుకుంటానుగా, మీకెందుకు మీరు భోంచెయ్యండి' అని బతిమాలి ఆ పిల్ల చేతగూడా భోజనం చేయించగలిగింది.

పరంధామయ్యగారిని కోర్టుకు, పిల్లలను కాలేజీలకు పంపి కృష్ణవేణి ఇంట్లోకి వచ్చింది.

* * *

పదిహేను సంవత్సరాల క్రితం, ఆ ఇంటి ఇల్లాలు అన్నపూర్ణకు నాలుగవ పురుడు కష్టమై కాలధర్మం చెందినపుడు, ఆమె తల్లి, పరంధామయ్యగారి మేనత్త అయిన కామేశ్వరమ్మగారు కృష్ణవేణిని ఆ ఇంటికి తీసుకురావటం జరిగింది. మంచి సాంప్రదాయం కలిగి తక్కువస్థితిలో ఉన్న కృష్ణవేణి తల్లిదండ్రులకు ఆమెను అల్లుడికిచ్చి పెళ్ళిచేస్తానని హామీ ఇవ్వటం జరిగింది. ఎదిగిన పిల్లకు పెళ్ళి ఎలా చెయ్యాలా, అని బెంగతో ఉన్న కృష్ణవేణి తల్లిదండ్రులు, వివాహం చేస్తానన్న, కామేశ్వరమ్మగారి మాటలకు ఒగ్గక తప్పిందికాదు

ఎలిమెంటరీ స్కూలుతోనే చదువుకు స్వస్తిచెప్పి సహజ సిగ్గరి అయిన కృష్ణవేణి

ఆ ఇంట్లో బెరుకు బెరుకుగా తిరగసాగింది. ఇది గమనించిన కామేశ్వరమ్మగారు, 'చూడమ్మా కృష్ణా, ఈ ఇంటిబాధ్యత నీకప్పగిద్దామని నిన్నిక్కడకు తీసుకొచ్చాను. నువ్విలా వేరువేరుగా తిరిగితే కుదరదు. పిల్లలను మాలిమిచేసుకొని, ఇంటిపరిస్థితులు అర్థంచేసుకుంటే, నేను అబ్బాయితో మాట్లాడి ఆ పని కాస్త కానిచ్చి నాదారిన నేను పోతాను' అన్నారు.

ఏడు సంవత్సరాల రఘు, ఐదు సంవత్సరాల వేణు, మూడు సంవత్సరాల శశిగూడా, 'అమ్మమ్మా ఈ అమ్మాయి ఎవరు?' అని అడుగుతున్న ప్రశ్నలకు ఆవిడ 'పిన్నిబాబూ' అని సమాధాన మివ్వటం, అందుకు వాళ్ళు, 'కాదు అక్క' అనటం ప్రక్కగదిలోనుండి వింటున్న పరంధామయ్యగారు నిట్టూర్చారు.

'అక్కా, అక్కా' అంటూ పిల్లలు ముగ్గురూ కృష్ణవేణిచుట్టూ తిరుగుతూ, అన్నీ ఆమే చెయ్యాలని పంతంపట్టి కూర్చోవటంతో, కృష్ణగూడా వాళ్లలో ఒకపిల్లలాగా కలసిపోయి, వాళ్ళ పనులన్నీ తనే చెయ్యసాగింది. ఉయ్యాలలో ఉన్న ఏడాది బాబును హృదయానికి హత్తుకొని ముద్దులతో నింపేసేది. ఇదంతా 'శశి' ఆశ్చర్యంగా చూస్తుంటే సిగ్గుపడిపోయేది కృష్ణవేణి.

కృష్ణలో వచ్చిన మార్పు చూసి కామేశ్వరమ్మగారు సంతృప్తిపడి, అల్లుడితో పెళ్లి విషయం కదిపారు. అప్పటికి ఇంకా అన్నపూర్ణ జ్ఞాపకాలు వదలని పరంధామయ్యగారు 'ఇపుడు నాకు చేసుకోవాలని లేదు' అని దాటవేశారు.

కామేశ్వరమ్మగారు అల్లుడు తనముందు మొఖమాట పడుతున్నాడని, కృష్ణవేణిని ఇంట్లో అట్టేపెట్టి, ఇంటిదగ్గర పని ఉంది, త్వరలోనే వస్తానన్న నెపంతో ఆవిడ ఇంటికి వెళ్లిపోయారు.

ఎన్నాళ్ళయినా కామేశ్వరమ్మగారు తమ కుమార్తె పెళ్లి విషయం చెప్పలేకపోవటం, ఆవిడ అల్లుడి ఇంటికి వెళ్ళకపోవటము గమనించి, కృష్ణవేణి తల్లిదండ్రులు కుమార్తెను చూడాలన్న కోర్కెతో, కామేశ్వరమ్మగారినిగూడా ప్రయాణం చేయించి పట్నంలో ఉన్న పరంధామయ్యగారి ఇంటికి చేరుకున్నారు.

వాళ్ళొచ్చేసరికి ఎలాంటి పరిస్థితి ఎదుర్కోవలసి వస్తుందోనని భయపడుతున్న కామేశ్వరమ్మగారు అక్కడి వాతావరణం చూసి గుండెలనిండుగా ఊపిరి తీసుకున్నారు. రఘుకు, వేణుకు తలదువ్వి స్కూలుకు పంపటానికి తయారుచేస్తున్న కృష్ణను, చీర కుచ్చిళ్ళు పట్టిలాగుతూ, 'అక్కా, నాకు' అంటోంది శశి. ప్రక్కనే ఉయ్యాలలో స్నానం చేయించి పడుకోబెట్టిన బాబు, తన బోసినోటితో నవ్వులు చిందిస్తూ కేరింతలు కొడుతున్నాడు.

తల్లిదండ్రులను చూసిన కృష్ణవేణి, నవ్వుతూ వారిని ఆహ్వానించింది. 'పిల్లలకు టైమైపోతోంది, వాళ్లను స్కూలుకు పంపిస్తాను. ఈ లోపల మీరు పనులు కానివ్వండి' అని సమాధానంకోసంగూడా చూడకుండా వంట ఇంట్లోకి వెళ్లింది. అన్నీ తయారుగాపెట్టి, 'రఘూ, నాన్నగారిని భోజనానికి పిలువు' అని ఖబురు పెట్టింది. ఆ పిలుపుకోసమే ఎదురు చూస్తున్న పరంధామయ్యగారు తన గదిలో నుండి బయటకువచ్చి అత్తగారిని పలుకరించి, భోంచెయ్యటానికి వెళ్ళిపోయారు.

నలుగురి పిల్లల తండ్రి ఎలా ఉంటాడోనని అనుకుంటున్న కృష్ణవేణి తల్లిదండ్రులకు ముప్పై సంవత్సరాల వయస్సులో మంచి ఆరోగ్యంతో పచ్చగా ఉన్న పరంధామయ్యగారిని చూసి సంతృప్తిగా నిట్టూర్చారు.

పరంధామయ్యగారు కోర్టుకు, మగపిల్లలిద్దరూ స్కూలుకు వెళ్లాక, శశికి భోజనం కలిపి పెట్టి తింటుంటే, బాబుకు పాలు పడుతూ కూర్చుంది కృష్ణవేణి. ఆమెను చూస్తున్న తల్లిదండ్రులకు రెండు నెలల క్రితంవరకు తమ దగ్గర అతి అమాయకంగా పెరిగి వచ్చిన 'కృష్ణ' కాదనుకున్నారు.

ఆ రాత్రి కామేశ్వరమ్మగారు అల్లుడిని పెళ్లి విషయం కదిపితే, కొద్ది రోజులలో తను అమెరికా వెళ్లబోతున్నట్లు చెప్పాడు.

అందుకామె నివ్వెరపోతూ, 'అదేమిటి బాబూ, ఇన్నాళ్ళూ లేని అమెరికా ఇపుడే మొచ్చింది? ఈ పిల్లలను ఏంచేద్దామనుకుంటున్నావు. ఇన్ని రోజులనుండి పెళ్లి మిషతో ఈ ఇంట్లో అట్టిపెట్టిన కృష్ణవేణిని ఏంచేద్దామనుకుంటున్నావు?' అన్నారు.

'ఈ మధ్యనే నాకు ఈ ఆలోచన వచ్చింది. ఆ అమ్మాయి ఇష్టమైయితే ఇక్కడే ఉంటుంది. లేకపోతే, పిల్లలను కాన్వెంటులో చేరుస్తాను' అని అంతకన్నా తను చెప్పవలసినది ఏమీలేదని ఆయన అక్కడినుండి లేచి వెళ్ళిపోయారు.

వీరి సంభాషణ ప్రక్కగదిలోనుండి కృష్ణవేణి, హాలులోనుండి ఆమె తల్లిదండ్రులుగూడా విన్నారు.

మరునాటి దినం వారు ప్రయాణమవుతూ కృష్ణవేణినిగూడా ప్రయాణం కమ్మన్నారు కాని, అందుకామె సుతరామూ ఒప్పుకోలేదు. ఎంత చెప్పినా వినకపోయేసరికి వాళ్ళు విసిగిపోయి 'నువు మాపిల్లవే కాదనుకుంటా'మని కోపంగా వెళ్లిపోయారు.

ఆ తరువాత నెల రోజులకు ఇంటి బాధ్యత, పిల్లలబాధ్యత నిస్సంకోచంగా కృష్ణవేణిపై వదలి పరంధామయ్యగారు విదేశాలకు ప్రయాణమై వెళ్లారు.

ఆయన విదేశాలలో ఉన్న మూడు సంవత్సరాలలోను, ప్రతి సోమవారం ఆయన దగ్గరినుండి వచ్చే లెటరుకోసం ఆతృతతో ఎదురుచూస్తుండేది. ఆయన రాసే ఆ లెటరులో కృష్ణపై ఎలాంటిభావం చూపెట్టేవాడు కాదు. తన నలుగురు పిల్లలతోపాటు ఆమెగూడా ఒకపిల్ల అన్న భావం వెలువడేది. కాని, ఒక్క తల్లిదండ్రుల ప్రేమ తప్పించి అన్యమెరుగని కృష్ణవేణికి, ఆయన లెటరులో తన పేరు కనిపిస్తేనే చాలన్న ఉద్దేశ్యంతో కొండెక్కినంత సంతోషపడి ఊహాలోకాల్లో తేలిపోయేది.

పరంధామయ్యగారు ఇంకొక నెల రోజులలో తను వస్తున్నానని రాసిన లెటరు చూసి సంతోషం పట్టలేక, నాలుగు సంవత్సరాల 'శంకర్'ను ఎత్తుకొని ముద్దులతో నింపేసింది కృష్ణవేణి.

పిల్లలను తీసికొని విమానాశ్రయానికి వచ్చిన కృష్ణవేణినిచూసి పరంధామయ్యగారు ఆశ్చర్యపోయారు. ఆయన ఇన్నిరోజులు తన పెద్దకుమార్తెగా భావించుకుంటున్న కృష్ణవేణి ఇంత బంగారు బొమ్మలా ఉంటుందని ఊహించలేదు


తరువాత ఓరోజు పరంధామయ్యగారు కోర్టుకువెళుతూ, దగ్గరిలో ఉన్న కృష్ణవేణితో, 'ఈ రోజు నా స్నేహితుడు వస్తాడు, తయారై ఉండు' అని చెప్పి వెళ్లారు.

సాయంకాలం పిల్లలందరిని తయారు

చేసి, తనుకూడా సాధారణంగా అలంక రించుకొని వాళ్ళకోసం ఎదురుచూస్తూ కూర్చుంది కృష్ణ.

ఐదు గంటల ప్రాంతంలో పరంధామయ్యగారు ఒక పాతిక సంవత్సరాల యువకుడివి, ఒక ముసలాయనను వెంట బెట్టుకొచ్చారు. వారినిచూసి కృష్ణవేణి లోపలకు తప్పుకుంది.

లోపలగదిలో ఉన్న కృష్ణవేణికి వారి మాటలలో తనపేరు వినిపించేసరికి ఏమిటో నని చెవి ఒగ్గింది. ముసలాయన తన పుట్టుపూర్వోత్తరాల సంగతి అడుగుతుంటే ఆశ్చర్యపోయింది. తరువాత మాటలనుబట్టి వాళ్ళు తన పెళ్ళిచూపుల కొరకు వచ్చారని తెలుసుకొని నివ్వెర పోయింది. ఆమె మనసు పరిపరివిధాల ఆలోచించసాగింది 'ఇన్ని రోజులు పరాయి ఇంట్లో ఉన్నదంటే. లోకం తనసుచూసి ఏమనుకుంటుంది? తను పవిత్రురాలననే అనుకుంటుందా? ఇన్నాళ్ళు వేరు ఆలోచనలతో గడిపిన తన మనస్సు రేపు అతనిపై లగ్నం కాగలదా? ఇపుడు కాకపోయినా కొన్నాళ్ళ తరువాతనయినా అతనికి తనపై అనుమానం రాదా? అపుడేమిటి తనకుదారి?



కృష్ణవేణి

ఆ తరువాత తనకు ఈమాత్రం ఆలంబన గూడా దొరకదే?' ఇలా ఆలోచిస్తున్న కృష్ణవేణికి కన్నీళ్ళాగలేదు. కృష్ణకన్నీళ్ళు చూసిన శశి తండ్రిదగ్గరకు వెళ్ళి, 'నాన్నారూ, అక్క ఏడుస్తోంది' అని ఫిర్యాదు చేస్తుంది.

ఏం జరిగిందోనని ఖంగారుగా గదిలోకి వచ్చిన ఆయన కృష్ణవేణినిచూసి ఏం చెయ్యాలో తెలియక తికమకపడ్డారు. పరంధామయ్యగారిని చూసిన కృష్ణ ఆయన పాదాలపైవాలి, 'బాబూగారూ, నన్ను ఈ ఇంట్లోనుండి పంపివెయ్యకండి' అంది బెక్కుతూ.

'అదేమిటమ్మా, నువు నాకు పెద్ద కూతురు లాంటిదానివి. నువు ఈ కుటుంబానికి చేసినమేలు నేను ఈ జన్మలో మరిచిపోలేను. ఇపుడు నీ పెళ్ళిబాధ్యత నామీద ఉంది. అది కాస్తా అయిందంటే, నాకు సగంబాధ్యత తీరినట్లే. నువు అభ్యంతరం చెబుతావని ముందుగా నీకు తెలియజెయ్యలేదు' అన్నారు.

'నాకసలు పెళ్ళి చేసుకొనే ఉద్దేశ్యం లేదు. బాబుగారూ, నన్నిక్కడనుండి పంపి వెయ్యకండి. అలా జరిగితే మీరు నాశవాన్నే చూడవలసి వస్తుంది.' అని గట్టిగా చెప్పటంతో ఆశ్చర్యపోయిన పరంధామయ్యగారు, ఇంకేమీ చెయ్యలేక, కొన్నాళ్ళు వాయిదావేసి చూద్దామని, అప్పటికి వచ్చినవారికి క్షమాపణలు చెప్పుకొన్నారు.

ఆ తరువాతగూడా ఆయన ఆ ప్రస్తావన తెచ్చినపుడల్లా కృష్ణవేణి విముఖత చూపటం జరిగింది. కాలగర్భంలో పన్నెండు సంవత్సరాలు కలసిపోయాయి. ఈకాలంలో పరంధామయ్యగారికి జిల్లా జడ్జీగా ప్రమోషన్ రావటము, పిల్లలు పెరిగి కృష్ణవేణిని 'అక్కా' అని పిలుస్తున్నా, ఆమె తల్లికి మించిన మమకారం వారిపై పెంచుకోవటం జరిగింది. కాని, పరంధామయ్యగారి ఆలోచనలు, ప్రవర్తనలో ఏమాత్రం మార్పురాలేదు.

ఇపుడు రఘు డాక్టరుకోర్సు పూర్తి చేసి గవర్నమెంటు హాస్పిటల్లో 'హౌసర్జన్సీ' చేస్తున్నాడు. రెండవవాడు వేణు ఇంజినీరింగు నాలుగవ సంవత్సరము, శశి బి.ఎ. రెండవ సంవత్సరము, శంకర్ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు.

రఘుకు, శశికి ఒకేసారి పెళ్ళిచేద్దామన్న ఉద్దేశ్యంతో పిల్లను చూసివచ్చారు. అన్నీ నచ్చటం, ఖాయం చేసుకోవటంగూడా జరిగిపోయింది. ఆ అమ్మాయి 'మల్లిక' గూడా అక్కడే డాక్టరు ఆఖరు సంవత్సరంలో ఉంది, ఇంకా శశికి సంబంధాలు వెతుకుతున్నారు. మొదట పరంధామయ్యగారు ఇపుడే పెళ్ళిళ్ళు చెయ్యటానికి ఇష్టపడకపోయినా కృష్ణవేణి బలవంతంవల్ల కార్యోన్ముఖులు కావటం జరిగింది.

'అక్కా' అన్న రఘు పిలుపుకు. షర్ట్‌కు ఊడిపోయిన గుండీలు కుడుతున్న కృష్ణవేణి హాలులోకి వచ్చింది.

'అక్కా ఈ రోజు డ్యూటీ ఉంది. త్వరగా భోజనం పెట్టు నేను వెళ్ళాలి' అని కాళ్ళు కడుక్కోవటానికి దొడ్లోకి వెళ్ళాడు.

'అదేం, బాబూ మొన్ననేగదా డ్యూటీ చేశావు. అపుడే ఏమిటి?'

'మా అసిస్టెంట్‌కు కొంచెం పనదో ఉందట. అందుకని ఈ రోజు ఆయన బదులు నన్ను చూసుకోమన్నారక్కా.'

రఘు భోంచేసి వెళ్ళిన కొంచెం సేపటికి శశి కాలేజినుండి వచ్చి, కృష్ణ మెడచుట్టూ చేతులువేసి, 'అక్కా రేపు ఆదివారంగదా, మావాళ్ళంతా 'పిక్నిక్'కు వెళ్తున్నారు నన్నుగూడా పంపవా' అంది గారాంగా.

'ఎలాగమ్మా, రేపు బందరునుండి నిన్ను చూడటానికి వాళ్ళు వస్తామన్నారు గదా, ఎలా వెళ్తావమరి' అంది మొఖాన పడ్డ వెంట్రుకలు సరిచేస్తూ.

'ఫో అక్కా, నువు ఎపుడూ ఇంతే. ఆరోగ్యం పాడవుతుందని ఏదో ఒక వంక చెప్తావు. నే నసలు పెళ్ళి చేసుకోను. నువు చేసుకోలేదుగదా. నేనూ ఇక్కడే ఉండిపోతాను' అంది బుంగమూతి పెడుతూ.

'ఛ. తప్పుతల్లీ, పెళ్ళిచేసుకొని పిల్లాపాపలతో నీ కాపురం కలకలలాడుతుంటే చూసి సంతోషించవలసిన వాళ్ళం మేము. అలా అనగూడదమ్మా. రా, నీకు టిఫిన్ పెడతాను' అని పమిట చెంగుతో కళ్ళొత్తుకుంటూ వంటింట్లోకి దారితీసింది కృష్ణవేణి. ●

పెద్దకథ:



(గత సంచిక తరువాయి)

✴ ఇది జరిగిన మరో వారం రోజుల్లో కల్లా ఒకటో తారీఖు రానే వచ్చింది. అన్నమాట ప్రకారం రాఘవయ్యగారు ఇంటి అద్దె నాకిచ్చి మిధ్యాసుందరికి ఇవ్వమన్నారు. ఎలాగూ ఇదివరకు 'కమిట్' అయిపోయాను కనక, చేసేదిలేక—ఆ అద్దె పుచ్చుకుని నన్ను నేను తిట్టుకుంటూ మిధ్యాసుందరి వాటాలోకి వెళ్ళాను. సాధారణంగా మేడ మీదకు ఎక్కేసరికి మొదటి గదిలోనే మిధ్యాసుందరి కనబడేది. కాని—ఆ వేళ ఆ గదిలో మనుషుల అలికిడే లేదు — అండాళమ్మ ఉన్న జాడ కూడా కనబడలేదు—మెల్లిగా పిలిచాను—ఎవరేనా పలుకుతారేమోనని. ప్రక్క గదిలోంచి నీరసంగా మిధ్యాసుందరి గొంతు వినిపించింది — 'లోపలికి రా మూర్తీ—' అని.

ఆశ్చర్యంతో నేను లోపలికి వెళ్ళేసరికి మిధ్యాసుందరి ఆ గదిలో మంచం మీద పడుకుని వుంది. వళ్ళంతా రగ్గు కప్పుకుంది. ముఖం బాగా పాలిపోయినట్టుగా వుంది—అది చూచి తడబడే గొంతుకతో అన్నాను నేను—'ఏమిటిది?—' అని—

'నిన్ననే కొంచెం జ్వరం తగిలింది మూర్తీ!—'ఫ్లూ' అనుకుంటాను. ఇవాళ కొంచెం టెంపరేచర్ ఎక్కువయింది. ఎందుకయినా మంచిదని డాక్టర్‌కు కబురంపించాను—' అంది.

నేను ఎరిగున్నంతలో మిధ్యాసుందరికెప్పుడూ జ్వరం రాలేదు—అయినా ఆవిడకు ఒంట్లో బాగులేకపోతే చెయ్యడానికి ఎవరున్నారు కనుక ఆ అండాళమ్మ తప్పితే?—నాకు మిధ్యాసుందరిమీద ఎప్పుడూ లేనంత జాలి, అభిమానమూ, పుట్టుకొచ్చాయి. నా మనసు ఆర్ద్రతతో నిండిపోయింది—'నావల్ల కొద్దిగ సహాయం ఏదయినా వుంటే

చెప్పండి— తప్పకుండా చేస్తాను—' అన్నాను.

నా మాటలు విని మిధ్యాసుందరి నవ్వింది —'అంత అవసరం రాదనుకుంటాను, ఆ పరిస్థితి అంటూ వస్తే నిన్ను పిలిచి నీచే సహాయం చేయించుకోగల చనువు నాకుంది— కాదంటావా?—' అంది—

'ఔను—' అన్నాను తల వూపుతూ—

ఇంతలో ఆండాళమ్మ గదిలోకి వచ్చింది, 'మరో అయిదు నిమిషాలలో డాక్టరుబాబు వస్తానన్నారు—' అంటూ. ఆ రోజున ముఖ్యమైన పని వుండటంతో డాక్టరు వచ్చేంతవరకూ కూర్చోలేక — రాఘవయ్య గారిచ్చిన డబ్బును టేబిల్ మీద పెడతూ అన్నాను—'ఇంటి అద్దె ఆయన ఇచ్చారు—' అని. అంతకన్నా ఆ పరిస్థితిలో ఏం మాట్లాడాలో తోచలేదు నాకు. మిధ్యాసుందరి అద్దె విని ఆదొక సాధారణమైన విషయమైనట్టుగా 'ఊఁ!—' అని వూరుకుంది. నేను మాత్రం మరి మాట్లాడకుండా గదిలోంచి వచ్చేశాను.

ఆ తర్వాత సాధ్యమైనంతవరకూ ప్రతీ రోజూ యూనివర్సిటీనించి వచ్చిన తర్వాత మిధ్యాసుందరి ఇంటికి వెళ్ళి ఆమె యోగక్షేమాలు కనుక్కుంటూ వుండేవాడిని. ఆవిడ జ్వరం మొదట్లో 'ఫ్లూ'గా వచ్చి, ఆ తర్వాత టైఫాయిడ్‌గా మారిపోయింది. వొళ్ళు తెలియని టెంపరేచర్‌తో ఒంటరిగా బాధపడుతున్న మిధ్యాసుందరిని చూస్తుంటే నా మనసు బాధతో తరుక్కుపోయేది. యూనివర్సిటీకి వెళ్ళడం మానేసి ఆవిడ దగ్గరే వుండిపోతే బాగుండుననిపించేది. అయితే—ఆండాళ్ళమ్మ వున్నది కదా అనే ఆలోచన నాకు కొంత వూరట కలిగిస్తూ వుండేది. ఇది ఇలా వుండగా ఆండాళ్ళమ్మ తండ్రి చావుబతుకుల మధ్య వున్నాడని కబురొచ్చింది. గుండెలు బాదుకుంటూ ఆండాళ్ళమ్మ వర్ణీభట్నం పరిగెట్టింది. ఆండాళమ్మను ఇంటికి వెళ్ళొద్దని చెప్పే అధికారం మిధ్యాసుందరిలోనూ, నాలోనూ లేకపోయింది. ఒకవేళ మేం అలా చెప్పినా, ఆండాళమ్మ మా మాట వినదని కూడా మాకు తెలుసు. మూడు నాలుగు రోజులలో వస్తానని ఆండాళమ్మ వెళ్ళిపోయింది. ఆండాళ్ళమ్మ వెళ్ళిపోయినప్పుడు మిధ్యాసుందరి కళ్ళల్లో తిరిగిన కన్నీరు నా గుండెల్ని పిండేసింది.

ఆ బాధతోనే నేను—'ఆండాళ్ళమ్మ వచ్చే దాకా మీకు అభ్యంతరం లేకపోతే నేను మీ ఇంట్లోనే వుంటాను— మూడు రోజులు యూనివర్సిటీ మానేసినంతలో మునిగిపోయేదేమీ లేదు—' అన్నాను. నా అంతట నేను ముందుకురావటం మిధ్యాసుందరికి ఎంతో ఆనందాన్ని కలిగించింది. ఆమె ఆనందాన్ని పాడు చేయడం నాకిష్టంలేదు.

అయితే— ఈ ఆనందం ఎంతోకాలం నిలవలేదు. మా వూళ్ళో మా పొలాలకు సంబంధించిన గొడవలేవో ఉన్నాయనీ, వాటిని అర్జెంటుగా పరిష్కరించుకోవల్సి వుంది కనుక, తక్షణం బయలుదేరి రావాల్సిందని ఒంటిదగ్గిర్నించి అన్నయ్య రాసిన ఉత్తరం వచ్చింది. నాకసలు ఆ పల్లెటూరి వ్యవహారాలంటేనే తలనొప్పి. అందులోనూ మిధ్యాసుందరి కిలా వుండ, వెళ్ళడం నాకసలు నచ్చలేదు— అందుకే ఇక్కడ యూనివర్సిటీలో రిసెర్చికి సంబంధించిన అత్యవసర కార్యక్రమాలున్నాయనీ, నేను కొద్దిరోజుల తర్వాత గాని రాలేనని సమాధానం రాశాను. నా సమాధానం అన్నయ్యకు బోలెడు కోపాన్ని తెప్పించింది. 'వెరీ అర్జెంట్ వర్క్ — స్టార్ట్ ఇమ్మిడియేట్లీ—' అని ఎక్స్‌ప్రెస్ టెలిగ్రామ్ కొట్టాడు. అన్నయ్య వరస ఎప్పుడూ ఇంతే — అతగాడికి చదువు సంధ్యాలేదు—దానికి సంబంధించిన విషయాలపై గౌరవం అంతకన్నా లేదు—'నువ్వు డాక్టరేట్ డిగ్రీ తెచ్చుకుని చేసేదేముందోయ్—చక్కెంత పొలం వుంది. ఉన్న భూమిని పండించక ఎవళ్ళ దగ్గరో కూలిపని చేసే ఖర్మ నీకేంపట్టిందని?—' అని కేకలేస్తుంటాడు. అన్నయ్య తత్వము, అతగాడి కోపము, నాకు బాగా తెలిసినవే కనుక చేసేదేమీ లేదనుకొని మా ఊరు బయలుదేరి వెళ్ళడానికే నిశ్చయించుకున్నాను. అయితే అప్పటికింకా ఆండాళ్ళమ్మ వూరినించి రాలేదు. నా పరిస్థితిని గమనించి తేలివంగా నవ్వుతూ అంది మిధ్యాసుందరి—

'సందేహించకుండా మీరెళ్ళు మూర్తీ!— డాక్టర్‌గారితో చెప్పి నేను నర్సింగ్‌హోమ్‌లో చేరుతాను — నిశ్చింతగా వుంటుంది— ఆండాళ్ళమ్మ రావటం కొంచెం ఆలస్యమయినా భయం వుండదు—'

మిధ్యాసుందరి చెప్పిన మాటలు నిజమే అనిపించాయి. అందువల్లనే ఆ పూటే వైజాగ్ నించి బయలుదేరి మా వూరు వెళ్ళాను.

* * *

రెండురోజులనుకుని బయలుదేరిన వాడిని వల్లాతువిలో దగ్గిర దగ్గిర పదిహేనురోజుల దాకా వుండిపోవాల్సి వచ్చింది. మా భూముల తాలుకు వివాదాలు 'క్లయిమాక్స్'కు చేరుకున్నందున — నేను అంత వెంటనే బయలుదేరి వెళ్ళడానికి వీల్లేదన్నాడు అన్నయ్య. ఈ మధ్య కాలంలో మిధ్యాసుందరికి ఆవిడ యోగక్షేమాలు కనుక్కుంటూ ఉత్తరం రద్దామనుకున్నాను గాని — మొహమాటం కొంత, బద్ధకం కొంత అడ్డొచ్చి ఆ కార్యక్రమం కాస్తా నిలచిపోయింది. వ్యవహారాలు పూర్తయిన వెంటనే హడావిడిగ వైజాగ్ రావడానికి బయలుదేరుతూ ఉంటే— వదినమ్మ సరసమాడింది కూడాను— 'మరిదిగారు వూరెళ్ళడానికి 'ఇప్పుడూ లేనంత ఇంటరెస్టుగా వున్నారు. అక్కడ నాకో తోటికోడల్ని చూసే వుంటారు —' అని. ఎవరేమనుకుంటేనేం—నాకు పట్టు పట్టుగా ఆమరునాటి రోజునే ఫస్టు బస్‌లో బయలుదేరి వచ్చేశాను.

అర గడియ్కో ఆగిపోయే ఆ కోటా బస్సులో ప్రయాణం చేసి వైజాగ్ చేరుకునేటప్పటికి తొమ్మిదయింది. చలికాలమేమో బారెడు ప్రొద్దెక్కినా ఇంకా చలిగా వుంది. సామాను నా గదిలో పడేసి, స్నానం గీనం పూర్తి చేసుకుని ఊటీ హోటల్‌లో టిఫిన్ బాగా వేసుకుని ఆ రోజునే మిధ్యాసుందరి ఇంటికి బయలుదేరాను. ఆవేళప్పుడు సాధారణంగా రాఘవయ్యగారి ఇంట్లో వుండడం మామూలు. అలా కాకుండా గది తాళం వేసి వుండేసరికి ఎక్కడికో షికార్లకు వెళ్ళారనుకున్నాను. ఇంతలో మేడమెట్లు నుంచి దిగుతూ ఆండాళ్ళమ్మ కనబడింది. పైకి వెళ్ళేదాకా కుతూహలాన్ని చంపుకోలేక— 'అమ్మగారు ఉన్నారా?—' అని అడిగాను. దానికి సమాధానంగా— 'ఉన్నారు బాబూ. అమ్మగారు, అయ్యగారు ఇద్దరూ మేడమీదే


మీ కుటుంబము కొరకు ప్రాచీన
వైభోగమును పునరుద్ధరించిన దెవరు?
Binaca
Talc
బినాకా యే!
క్రొత్త బినాకా శాండల్ వుడ్ టాల్క్ తో
చందనవనములోని మృదుల పరిమళమును బినాకా
పట్టియి గట్టినారు. చర్మమును లాలించు
పవిత్రమైన మేలిదనం దానికి జోడించినారు. ఉల్లముల
ఊగించే చక్కదనాల క్రొంగ్రొత్త ప్యాక్‌లో
దానిని నింపినారు. మీ ఇంటిల్లిపాదినీ ప్రాచీన వైభోగములో
ఓలలాడించండి. అర్వాచీన పద్ధతిలో వారికి చందన
చర్చ జరిపించండి. నేడే ఒక బినాకా టాల్కు
తెచ్చి వారికి కానుక ఇవ్వండి!
మీ కుటుంబమునకు శాండల్‌వుడ్
ఇష్టం లేక పోతే, వారికి బినాకా బోక్
టాల్కు తెచ్చి ఇవ్వండి.
బినాకా
ఇంటిల్లిపాదికి ఇష్టమైన టాల్కు.
CIBA Cosmetics

ఉన్నారు—' అని సమాధానం చెప్పేది. ఆండాళ్ళమ్మ సమాధానం ఒక్కసారి నా బుర్రలో 'గుంయ్'మనిపించింది. 'అయ్యగారెవరు?—' అనే ప్రశ్న నోటిదాకా వచ్చి అలా అడగడం సభ్యతకాదు కనుక, నా భావాన్ని అదుపులోకి తెచ్చుకుంటూ గబగబా మేడమీదకు వెళ్ళేను. మేడమీద గదిలోకి అడుగు పెడుదును కదా — నాకో పెద్ద సైజు 'షాక్' తగిలినట్టయింది. గదిలో రాఘవయ్యగారు పేపరు చదువు కుంటున్నారు. అడుగులు చప్పుడు విని ప్రక్కకు తిరిగి నన్ను చూడగానే నవ్వుతూ అన్నారు రాఘవయ్యగారు— 'రావోయ్ — మూర్తీ రా—'

నాకు కాళ్ళక్రింద వున్న భూమంతా గిరగిరా తిరుగుతున్నట్టనిపించింది. రష్యాలో కేపిటలిజమ్ ప్రబలినా— అమెరికా కమ్యూనిజమ్‌ను చేపట్టినా నేనంత ఆశ్చర్యపడక పోదునుగాని—మిధ్యాసుందరి ఇంట్లో రాఘవయ్యగారు తీరుబడిగా పేపరు చదువుతూండడాన్ని మాత్రం నిజమని నమ్మడానికి నా మనసొప్పడం లేదు నా కళ్ళను నేనే నమ్మలేక పోతున్నాను. ఆండాళమ్మ చెప్పిన అయ్యగారు ఈయనే అన్నమాట— డామిట్?. బుర్ర తిరిగి పోతోంది. నేను మా వూళ్ళో పడుకుని నిద్రపోవడం లేదు కదా!— .

నా అవస్థ గమనించి కాబోలు నవ్వుతూ అన్నారు రాఘవయ్యగారు — 'ఏమిటలా గుమ్మం దగ్గరే నిలబడి పోయావు? — మా యింట్లోకి రాకూడదనుకున్నావా ఏమిటి?' మరోషాక్— 'మా యిల్లు' అంటాడేమిటీయన? — ఏమిటీ ఘోరం? — రాఘవయ్యగారికి మతిపోలేదు కద— వెళ్ళేటప్పుడు నిక్షేపంలా వున్నారు— ఇంతట్లోనే ఏమొచ్చిందని — మెల్లగా నా మదురును చేత్తో తడుముకున్నాను. అతి ప్రయత్నంమీద నా మనోభావాన్ని తమాయించుకుంటూ — 'మిధ్యాసుందరికి ఎలా వుంది?—' అని మాత్రం అనగలిగాను.

'నాలుగు రోజుల క్రితమే పత్యం పుచ్చుకుంది. పాడు జ్వరం చాలా ఇబ్బంది పెట్టేసింది. అన్నట్టు మీ వ్యవహారాలేమయినట్టు?—' అన్నారు రాఘవయ్యగారు పేపరు మడుస్తూ. నేనేదో సమాధానం చెప్పేలోపుగానే — మిధ్యాసుందరి ట్రేలో

వింధ్య

కాఫీ కప్పుతో గదిలోకి వచ్చింది.

మిధ్యాసుందరిని చూస్తూ, రాఘవయ్యగారు 'నువ్వు ఒక కప్పు కాదు—రెండు కప్పులు తేవాల్సింది—నీకోసం ఎవరొచ్చారో చూడు—' అన్నారు.

రాఘవయ్యగారు రోజుకు అయిదారు సార్లు కాఫీ త్రాగుతారన్న సంగతి నాకు క్రొత్తేమీ కాదు కాని—ఇలా మిధ్యాసుందరి ఆప్యాయంగా రాఘవయ్యగారికి కాఫీ తేవడమూ, ఆయన ఆవిడకు మరో కప్పు తెమ్మని పురమాయించడమూ, మధ్య నేను నిశ్శబ్ద ప్రేక్షకుడిలా వుండిపోవడమూ, చూస్తోంటే, నాకు తల తిరిగిపోతోంది. నేను వచ్చింది వైజాగుకేనా! —నేను చూస్తున్నది రాఘవయ్యా, మిధ్యాసుందరి అసబడే, ఉత్తర దక్షిణ ధృవాలనేనా!—అని మరోసారి అనుమానం వచ్చింది. నాకు భగవంతుడంటే ఇన్నాళ్ళుగా చెప్పుకోదగ్గ భక్తి లేదు గాని—ఒక్కసారిగా భక్తి పుట్టుకొచ్చింది— 'భగవాన్!—నాకు పిచ్చి ఎక్కలేదు కదా—' అని మొదటిసారిగా భగవంతుణ్ణి స్మరిస్తూ గొణుక్కున్నాను.

నన్ను చూడగానే మిధ్యాసుందరి బోలెడు సరదా పడిపోయింది—'రెండు రోజులని ఎన్నాళుండిపోయావు మూర్తీ!—నీ గురించి అనుకోని రోజు లేదు—' అంది. మిధ్యాసుందరి ఇదివరకటికన్నా బాగా చిక్కినట్లనిపించింది. కొంచెం నీరసంగా కనబడుతున్నమాట నిజమే కాని—దానికన్నా నాజూకుతనమే నాకు ఎక్కువ కనబడింది. ఆవిడ కట్టుకున్న నారింజరంగు ప్లెయిన్ కలర్ చీరలో ఇంత నాజూగ్గా మిధ్యాసుందరిని ఎప్పుడు చూడలేదు నేను.

నానుంచి సమాధానం వచ్చేలోపున కాఫీ కప్పును నా ముందు వుంచుతూ అంది మిధ్యాసుందరి— 'కాఫీ తీసుకో—రాఘవయ్యగారికి ఇప్పుడే తీసుకొస్తాను—' అంటూ లోపలికెళ్ళి మరో నిముషంలో ఇంకో రెండు కప్పులతో వచ్చింది. ముగ్గురం తీరిగ్గా కాఫీ త్రాగుతూండగా చాలా విషయాలు బయటపడ్డాయి.

'నువ్వు వూళ్ళో లేని ఇరవై రోజుల్లో నీకు తెలియకుండా చాలా విషయాలు జరిగిపోయాయి మూర్తీ—' అంటూ ప్రారంభించింది మిధ్యాసుందరి.

అది విని తల పంకించుతూ, 'అవును ఇప్పుడిప్పుడే అర్థం అవుతోంది—' అన్నాను కొద్దిగా చిరునవ్వును చిందిస్తూ—నా నవ్వుకు జతచేరుస్తూ అన్నారు రాఘవయ్యగారు— 'అయితే—నువ్వు అర్థం చేసుకోవాల్సింది ఇంకా చాలా వుంది—' అన్నారు.

'నిజమే—' అన్నాను—

మళ్ళీ మిధ్యాసుందరే మొదలెట్టింది— 'నువ్వు మీ వూరకు వెళ్ళడానికి సందేహిస్తూవుంటే నేనే బలవంతం పెట్టి పంపించాను—అవ్వాళో, లేకపోతే ఆ తర్వాతరోజో ఆండాళమ్మ తప్పకుండా వస్తుందన్న ధైర్యంతో — అంతగా అవసరం అయితే నర్సింగ్ హోమ్‌లో చేరుదామనుకున్నాను. అనుకున్నట్టుగా ఆండాళ్ళమ్మా రాలేదు. నర్సింగ్ హోమ్‌లో చేరడమూ జరగలేదు— అనుకోనట్టుగా ఓ చిన్న కథ జరిగిపోయింది—' అంటూ చిన్నగా నవ్వి తల దించుకుంది. యాభై ఏళ్ళు పైబడ్డ మిధ్యాసుందరి అలా అందంగా సిగ్గు పడుతూంటే చూడ్డం నాకు మహా ముచ్చటేసింది. హఠాత్తుగా మిధ్యాసుందరి వయస్సు ఓ ముప్ఫయ్ ఏళ్ళు తగ్గించేస్తే ఎలా వుంటుందో అనిపించింది.

మధ్యలో రాఘవయ్యగారు అందుకున్నారు —'జీవితంలో ఇద్దరమూ ఆనందాన్ని పోగొట్టుకున్నాము. పోయిన ఆనందాన్ని ఇంత సులువుగా తిరిగి పొందగలమని—ఒకవేళ పొందినా అందులో మళ్ళీ అంత మాధుర్యం వుంటుందనీ అనుకోలేదు మేము.'

రాఘవయ్యగారు ఇంకా ఏం చెప్పినా, చెప్పకపోయినా జరిగిన కథ వూహించుకోగలను. వాళ్ళు పోగొట్టుకున్న ఆనందమేదో నాకు తెలుసు—మళ్ళీ వాళ్ళు పొందిన ఆనందాన్ని అర్థం చేసుకోగలను. అయితే—అర్థం కాని విషయాలు, అర్థానికి అందని విషయాలు నాకు చాలా కనబడ్డాయి. అందుకనే బుద్ధిమంతుడయిన విద్యార్థిలా బుర్ర వూపుతూ కూర్చున్నాను. రాఘవయ్యగారే మాట్లాడుతున్నారు— 'మూర్తీ! — నువ్వు పసిపిల్లవాడివేమీ కావు—నీ తెలివి తేటల్ని నేనెరుగుదును. మా గురించి ఈపాటికి నువ్వు కొంత అర్థం చేసుకుని వుండొచ్చు. కాని—వర్తమానాన్ని అర్థం చేసుకునేముందు కొంత గతాన్ని గురించి కూడా తెలుసు

కోవాలి నువ్వు. నేను రాయగఢలో అసిస్టెంటు స్టేషన్ మాష్టర్‌గా పనిచేస్తుండగా నా భార్య చచ్చిపోయింది. అప్పటికి నాకు ముప్పయి అయిదు సంవత్సరాలు. మాది ఓ విధంగా చెప్పాలంటే లవ్ మేరేజ్ అని చెప్పుకోవాలి — అనుకూలవతియైన భార్య—జిలిబిలి పలుకులు పలుకుతూండే మూడేళ్ళ కొడుకు—ఆ రోజు వరకూ సంసార జీవితం స్వర్గంలా వుండేది. కాని, ఒక ఏక్సిడెంట్‌లో వాళ్ళిద్దరినీ ఒకేసారి కోల్పోయాను నేను. ఈ జీవితంలో ఒక్కణ్ణీ మిగిలిపోయాను. ఒంటరితనం భరించలేక కొన్నాళ్ళు సెలవుపెట్టి దేశమంతా తిరిగాను. ప్రతిచోట ఒంటరితనమే మిగిలేది. జ్ఞాపకాలు నా గుండెల్ని పీల్చి పిప్పి చేసేవి. ఒక్కణ్ణీ కూర్చుని ఏడిచేవాడిని చచ్చిపోదామనుకువాణ్ణి— ఇంత మానసిక దుర్బలత్వం మొగాడికి పనికిరాదన్నారు కొందరు. మొగాడివి నీకేం భయం? హాయిగా మళ్ళీ పెళ్ళిచేసుకో అని సలహా ఇచ్చారు మరి కొందరు మొగతనం ఇచ్చే అవకాశాలమీద నా కెప్పుడూ వ్యామోహంలేదు. మళ్లీ పెళ్ళిచేసుకోలేదు. కాని—ఒంటరితనం పీడించినప్పుడల్లా నాకు నా భార్య జ్ఞాపకంవచ్చేది నాకు కావాల్సింది ఒక ఆడదికాదు. నన్ను ప్రేమించి—నా అభిమానాన్ని అందుకునేందుకు పాత్రతగల స్త్రీ కావాలి నాకు. అలాంటి స్త్రీమూర్తికోసమే నేను ఎంతో కాలం వెదికి నే పోగొట్టుకున్న ఆనందం మరి దొరికేదికాదని తెలుసుకుని నా ప్రయత్నం విరమించుకున్నాను. కాని...' మధ్యలో రాఘవయ్యగారు ఆగి ఆరిపోయిన చుట్టను వెలిగించే ప్రయత్నంలో మునిగిపోయారు.

రాఘవయ్యగారు మరేదో చెప్పేలోపుగానే మిథ్యాసుందరి అందుకుంది. 'రాఘవయ్య ఆదర్శవాది. ఆయన మాటలు చాలా చిత్రంగావుంటాయి. ఆయన్ని కాస్సేపు అలా ఆదర్శాల లోకంలోనే వుండనిచ్చి నేను చెప్పేది విను.'


రాఘవయ్యగారి కథను మధ్యలో మిథ్యాసుందరి అలా ఆపేయడం నాకు బొత్తిగా నచ్చలేదు— కాని, ఆవిడ రాఘవయ్యగారికి చాలా సన్నిహితురాలు కనుకా, ఆవిడ కథనుకూడా వినాలని చాలా కుతూహలంవున్నది కనుకా, మాట్లాడక వూరుకున్నాను. సరే చెప్పమన్నట్టుగా రాఘవయ్యగారు చుట్టనుసి రాలుస్తూ వుండిపోయారు.

'రాఘవయ్యగారిలా నాకు గతాన్ని తవ్వుకునే ఓపికలేదు. కాని, నా గురించి కూడా కొంత తెలుసుకోవాలి నువ్వు. మా ఆయన సంగతి నీకిదివరకే కొద్దిగా చెప్పాను. నేను, నా భర్త అన్యోన్యంగా వుండేవాళ్ళం అన్నమాట ఒకవిధంగా నిజమే — అయితే ఆయన లేనిలోటు నన్నెప్పుడు ఒంటరితనంతో బాధ పెట్టలేదు—ఎందుకంటే నేను పెళ్ళికి ముందు, ఆ తర్వాతకూడా వుద్యోగ రీత్యా ఒక్కతినే వుండేదాన్ని—పెళ్ళి అయిన తర్వాత హనీమూన్ రోజుల్లోనూ, ఆ పైన సెలవుల్లోనూ మాత్రమే మేమిద్దరం కలిసివుండేవాళ్ళం. ఆ కొద్దిరోజుల్లోనూ మా మధ్య చాలాసార్లు పోట్లాటలువస్తుండేవి. నా రుచులు ఆయనకు నచ్చేవిగావు. ఆయన అభిరుచులు నాకు సుతారామూ పడేవికావు. ఇలా పోట్లాడి లాభంలేదు.ఎవళ్లో ఒకళ్ళం సర్దుకోవాలి అని నిర్ణయం తీసుకునే లోపుగానే సెలవులు కాస్తా పూర్తయ్యేవి. ఇలా మొత్తంమీద ఒక చిత్రమైన రీతిలో మేమిద్దరం కాపరంచేశాం. అయితే కడుతూ వున్న బిడ్జికూలి ఆయన చచ్చిపోయినప్పుడు ఇన్సూరెన్సరూపంలో అయితేనేమి, జీతం బేలన్సురూపంలో అయితేనేమి నాకు దగ్గర దగ్గర లక్షరూపాయలు చేతి కొచ్చినప్పుడు మాత్రం నా గుండెలు ఆర్ద్రతతో నిండిపోయాయి. ఈ యింటిలోవున్న ప్రతిఇటుకా ఆయన స్మృతిని జ్ఞాపకం చేస్తుంటే—కృతజ్ఞతతో నిండిన గుండెల్తో ఆయన్ని ఎన్నిసార్లు తలుచుకుంటానో లెక్కలేదు. పొడుగ్గా పొడుచుకొచ్చినట్టు వుండే ముక్కును మినహాయిస్తే ఆయన చాలా అందంగా వుండేవారు. తోడెవరూ లేకుండా ఒక్కతెనే వున్నప్పుడు ఆయనరూపం ఎన్నిసార్లు కళ్ళల్లో మెదలేదో లెక్కపెట్టలేను...' డగ్గుత్తిక అడ్డుపడితే మౌనంగా కళ్ళనీళ్ళు తుడుచుకుంది మిథ్యాసుందరి.

వీళ్ళిద్దరి మాటలూ నాకు తలా తోకా లేని మాటల్లా కనబడ్డాయి. నేను అడిగేది ఒకటి—వీళ్ళు చెప్పేది ఒకటి. నాక్కావల్సిన సమాధానానికీ, వీళ్లు చెప్పే గతకాలం జ్ఞాపకాలకీ సంబంధంలేదు. వీళ్ల పాతజ్ఞాపకాలు ఎవడిక్కావాలి? గతంతో తనకు సంబంధం లేదంటూనే దాన్ని ఓపిగ్గా తవ్వుతోంది మిథ్యాసుందరి. విసుగ్గా భృకుటి ముడుచుకున్నాను. అయితే— అంత సులువుగా నా భావాలను బయటపెట్టడం నాకు ఇష్టంలేదు.

గట్టిగా దమ్ములాగిన పొగను పైకి వదలుతూ అన్నారు రాఘవయ్యగారు— 'ఆడవాళ్ళకు సెంటిమెంటాలిటీ బొత్తిగా ఎక్కువోయ్!—ఒకవిధంగా చెప్పాలంటే నేను, మిథ్యాసుందరీ, గతాన్ని మరచిపోలేకపోతున్నాం—మా యిద్దరిలోనూ ఒకేవిధంగా వున్న ఈ భావం మమ్మల్ని కలిపిందనుకుంటాను—కాకపోతే—నేను మిథ్యాసుందరిలాగా నా సెంటిమెంట్లను బయటకు చెప్పలేననుకో...'

అటు రాఘవయ్యగారు, ఇటు మిథ్యాసుందరీ, ఒకళ్ళకొకళ్లు పోటీపడుతూ కథను మరింత డొంక తిరుగుడుగా తిప్పుతున్నారు. ఇక, సహనం నిల్పుకోలేని నేను — 'అసలు



కథ చెప్పండి' అంటూ నిజం చెప్పద్దూ— కొంచెం మొరటుగానే అడిగాను. అయితే— ఆ అసలు కథ వాళ్ళు చెప్పినంత యాదా లావంగా నాకు అనిపించలేదు— నమ్మబుద్ధి పుట్టలేదు.

ఆడవాళ్ళమ్మలేని సమయంలో మిథ్యా సుందరి జ్వరతీవ్రత ఎక్కువయితే — మొదటిలో రాఘవయ్యగారు ఆమెకి తగిన శాస్తి జరిగిందిలే అని సంతోషించారట—

కానీ, ఓపూట పోయింతర్వాత ఆయనలో దాగివున్న జాలి అనేపదార్థం ఆయన గుండె తలుపులు తట్టి— మేడమీదకు వెళ్ళమని తొందరపెట్టిందట—వద్దనుకుంటూనే ఆయనపైకి వెళ్ళి మిథ్యాసుందరి గదిలో అడుగుపెట్టారట—

'నువ్వు నమ్మవుగానీ మూర్తీ! — ఆ రోజున ఒక్కర్తినీ పడుకుని ఏంతి ఏడ్చానో భగవంతుడికి తెలియాలి —జ్వరం కన్నా నన్ను నా ఒంటరితనమే బాధించింది. ఆ క్షణంలో నేను చచ్చిపోయినా అయ్యో అంటూ కన్నీళ్ళు కార్చేవారు కూడా వుండరనే భావం నా గుండెను పిండి వేసింది—కన్నీళ్ళను రెచ్చగొట్టింది. ఆక్షణంలోనే నా కళ్ళకు రాఘవయ్యగారు కనబడ్డారు. బెదురు చూపులు చూస్తూ గదిలోకి వస్తున్న రాఘవయ్యగారిని చూస్తూంటే నాకు ఏడుపు మరింత ముంచుకొచ్చింది. నాకీ ప్రపంచంలో వున్నది ఈ రాఘవయ్యగారొక్కరే అనిపించింది...' అంటుంది మిథ్యాసుందరి. ఆవిడ మాటలకు అడ్డుతగులుతూ రాఘవయ్యగారంటారు కదా—

'మూర్తీ! నీకు ఆడవాళ్ళతో పరిచయం తక్కువయినందున వాళ్ళ సైకాలజీ నీకంత బాగా తెలియదు. నాకు వాళ్ళ సంగతి బాగా తెలుసు. మనోధైర్యం కోసం ఆప్యాయత కోసం, ఆత్మీయత కోసం ఆడది మొగాడి గుండెల్లో తల దాచుకోవాలని కోరుకుంటుంది. తప్పని సరిగా ఒంటరితనం ముంచుకొస్తే భరించలేక భోరుమంటుంది. మిథ్యాసుందరి ఆవేళ ఏడుస్తూ వుంటుందని నాకు తెలుసు. అది శాస్త్రం. అనుకుంటాంగాని మూర్తీ — మొగాడు ఆడదాన్నెప్పటికీ ద్వేషించలేడేమో?— లేకపోతే నాకు మిథ్యాసుందరి మీద అంత జాలి ఎందుకు కలగాలి? — ఆవిడ ఒంటరితనం నాగుండెల్నెందుకు కరిగించాలి?—వొళ్ళు తెలియని జ్వరంతో మిథ్యాసుందరి అవస్థపడుతున్నప్పుడు ఆవిడకు నేను తప్ప మరెవ్వరూ లేరనీ, ఆపదలో వున్న ఆమెను ఆదుకోవల్సిన వ్యక్తి నేనొక్కడినేననీ, అనే భావన నాకు తెలియకుండానే నాచేత మిథ్యాసుందరికి ఎన్నో సేవల్ని చేయించింది ఆవిడకు నాకు మధ్య విరోధం సమసి పోయేటట్లు చేసింది—'

నాకు రాఘవయ్యగారి మాటల్లోనూ, మిథ్యాసుందరి మాటల్లోనూ, ఏదో తెలియని ఆవేశం కనబడింది. మిథ్యాసుందరి మటుకు మధ్యమధ్యలో క్రొత్త పెళ్ళికూతుర్లా సిగ్గుపడేది— 'నా కోసం రాఘవయ్యగారు చేసే చాకిరీ, నాపై ఆయన చూపిస్తున్న శ్రద్ధా చూస్తూంటే —నువ్వు నమ్మవుగనీ మూర్తీ— ఆయన అలా నా దగ్గర వుంటూండగానే చచ్చిపోవాలనిపించేది. ఆడవాళ్ళను అనవసరంగా

పిల్లలు—ఆరోగ్యము

ప్రమాదాలు - జాగ్రత్తలు

చిన్నపిల్లలని ప్రమాదాల నుంచి కాపాడటం అన్నది తల్లిదండ్రుల, వైద్యుల ముఖ్య కర్తవ్యం. ఒక సంవత్సరం లోపు వయసులో జరిగే ప్రమాదాల వల్ల మరణం సంభవించవచ్చు. లేదా నిరంతరమైన శారీరక లోపం ఏర్పడవచ్చు. ప్రమాదాలు ఎక్కువగా 3 సంవత్సరాలు, అంతకు లోపు పిల్లలకి సంభవిస్తూ ఉంటాయి. వీటిలో చాలా భాగం యిళ్ళలోనే సంభవిస్తుంటాయి. ఇలాంటి ప్రమాదాలు ఏర్పడకుండా ఈ కింద సూచించిన జాగ్రత్తలు తీసుకోడం చాలా అవసరం.

చిన్నపిల్లల మనస్తత్వం, అలవాట్లు పెద్దలు గమనించాలి. పిల్లలు వారి జాగ్రత్తలో వారు ఉండేలా అలవాటు చేయాలి. ప్రమాదాలకి కారణాలని పెద్దలు తెలుసుకుని అవి సంభవించకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలి.

మొదటి సంవత్సరంలో సంభవించే ప్రమదాలు

ఈ వయసులో పిల్లలు పాకటం, దొర్లటం చేస్తుంటారు. చేతికి అందిన వస్తువులని నోటిలో పెట్టుకోడం ద్వారా ప్రమాదాలు జరగవచ్చు. వేడిగా ఉండే వస్తువులని పట్టుకొనడం, మందులు, విషపదార్థాలు నోట్లో పెట్టుకోడం వంటివి చేసే అవకాశం ఉన్నది. నీళ్ళతొట్టెలు అందుబాటులో ఉండటం వల్ల వాటిలో మునిగిపోవడం జరగవచ్చు.

తీసికొనవలసిన జాగ్రత్తలు

పిల్లలని మంచాలు, బెంచీలు, కుర్చీలు మొదలైన వాటిమీద వదిలిపెట్టి వెళ్ళకూడదు. చిన్నచిన్న వస్తువులనీ, మందులని అందుబాటులో ఉంచకూడదు. నీళ్ల తొట్టెలు ఉంటే వాటిని మూసి ఉంచాలి.

రెండవ సంవత్సరంలో ప్రమాదాలు

ఈవయసులో పిల్లలకి నడక బాగా అలవాటు అవుతుంది. కాబట్టి మెట్లు ఎక్కడం, దిగటం చేస్తుంటారు. అన్ని విషయాల్లో ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. కాబట్టి మెట్ల మీద నుంచి పడటం, అందిన వస్తువులని నోట్లో పెట్టుకోడం వల్ల ప్రమాదాలు జరగవచ్చు.

జాగ్రత్తలు

మెట్లకి గేటు వేయాలి. కరెంటు తీగలు, మందులు, పదునైన వస్తువులు చేతికి అందకుండా పెట్టాలి. కిటికీలకి కూడా తెరలు వేసి ఉంచడం మంచిది.. కుంపట్లు, స్టవ్‌లు, గ్యాస్ పొయ్యిలు అందుబాటులో లేకుండా చూడాలి.

మూడు, నాలుగు సంవత్సరాల వయసులో

పిల్లలు వీధిలోకి పరిగెత్తడం, బంతులు విసరటం వంటి ఆటలు మొదలుపెడతారు. వీటి వల్ల కూడా ప్రమాదములు జరగటానికి అవకాశాలు ఉన్నాయి.

జాగ్రత్తలు

తలుపులు గట్టిగా వేసి ఉంచాలి. ప్రమాదాన్ని కల్గించే వస్తువులని దూరంగా ఉంచాలి.

అయిదు సంవత్సరాల నుంచి 9 సంవత్సరాల లోపు పిల్లలకి కొస్త ధైర్యం వస్తుంది. చుట్టుపక్కల ఉన్న పిల్లలతో ఆడుకోడం అలవాటవుతుంది. ఈ వయసులో ప్రమాదములకి అవకాశంలేని ఆటల పైకి పిల్లల దృష్టి మరల్చడానికి పెద్దలు ప్రయత్నించాలి.

ఈ వయసులో పిల్లలు స్కూళ్లకి, నర్సరీ బడులకి, కాన్వెంటు పాఠశాలలకి వెళ్తుంటారు. రోడ్డు ప్రమాదాల నించి వారిని రక్షించడానికి తోడుగా ఎవరైనా ఉండి రోడ్లపై జాగ్రత్తగా నడవటం, రోడ్లు దాటటం మొదలైన విషయాలని పిల్లలకి జాగ్రత్తగా నేర్పాలి. ఇలాంటి జాగ్రత్తలు తీసుకోడం ద్వారా పిల్లని ప్రమాదాలకి గురి కాకుండా చాలా వరకూ కాపాడవచ్చు.

—డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

అంటారగానీ, మూర్తి — ఈ మొగాళ్లే అసలు అర్థంకాని మనుషులు. పనిగట్టుకుని నా మీద జాలితో నేను జ్వరంతో వున్నన్నాళ్ళు సేవ చెయ్యడానికి వచ్చారా?— అంతటితో సరిపడితే పోలా?—టెంపరేచర్ చూస్తున్నప్పుడు నా వొళ్ళెందుకు నిమర లని?—మందుపట్టిస్తూ తుంటరి చేష్టలు ఎందుకు చెయ్యాలని?—'

రాఘవయ్యగారిదీ, మిథ్యాసుందరిదీ 'ప్లెటోనిక్' బాపతు ప్రేమ అని సరి పెట్టుకుందామనుకుంటే గింజుకు చచ్చినా నాకు ఆధారాలు దొరకలేదు— రిటైరయిపోయిన రాఘవయ్యగారు మిథ్యాసుందరి వైపు చూచే చూపులోను, మిథ్యాసుందరి రాఘవయ్యగారిపై విసిరే విసుర్లలోనూ, నాకు పురుషుడికి, స్త్రీకి మధ్యన వుండే ఆకర్షణ మాత్రమే కనబడింది. అయితే— ఆ ఆకర్షణలో కామం కన్నా ఆత్మీయత పాలే ఎక్కువగా కనిపించింది. ఇది నేను కాదంటా మనుకున్నా వాళ్ళ వయస్సులు అందుకు ఒప్పుకోవు—అందుకే మిథ్యాసుందరి అన్న మాటల్ని బేషరతుగా ఒప్పేసుకున్నాను.

'ఎంత వయస్సు వచ్చినా — తనకొక ఆసరా కల్పించే మొగాడు కావాలనీ ఆడది కోరుకుంటుంది. తనవల్ల ఆసరా పొందుతున్న ఆడది వుండాలని మొగాడు కోరుకుంటాడు. ఆధారపడటంలో ఆడదానికి సంతృప్తి వుంది—ఆధారం అవుతున్నారు కదా అనే అహంలో మొగాడికి తృప్తి వుంది. ప్రకృతిలో స్త్రీ పురుషుల మధ్య వున్న ఈ విభిన్న ప్రవృత్తే మా యిద్దరినీ కలిపిందనుకుంటాను. మాది అసాధారణమైన ప్రేమకథ కాదు—మాములు జీవిత కథ—'

నిజమే అనిపించింది. అయితే — నాకు చాలా సందేహాలున్నాయి. స్త్రీ పురుష ప్రవృత్తులలో వున్న స్వార్థమే భార్యాభర్తల కలయికకు కారణమైతే — అటు మిథ్యాసుందరి, ఇటు రాఘవయ్య, ఇన్నాళ్లుగా ఒంటరిగా ఎందుకు ఉండిపోయారు? — ఒక అతి చిన్న కారణం వారిద్దర్నీ అంత గట్టిగా ఎందుకు బంధించింది?—ఇన్నాళ్ళుగా రాఘవయ్యగారు వెదుకుతున్నదీ, మిథ్యాసుందరిలో ఆయనకు దొరికినదీ ఏమిటి? — నా సందేహాలన్నింటికీ మిథ్యా సుందరి సన్నగ చిరునవ్వు నవ్వుకుంది. రాఘవయ్యగారు మాత్రం కాపీగా చుట్టపీలుస్తూ— 'నువ్వు పెళ్లి గాని కుర్రాడివి. నీకేం చెప్పినా అర్థం కాదు—జీవితంలోని సత్యాలు అనుభవించి తెలుసుకోవాలి—' అన్నారు.

రాఘవయ్యగారి సమాధానం నాకు రుచించలేదు— గోడమీద అందంగా నవ్వుతున్న హేమమాలిని 'కేలండర్' బొమ్మకేసి చూస్తూ 'అంతా మిథ్య' అని గొణుక్కున్నాను.

రోడ్డుమీద పెళ్లివారి బాజాలు నా చెవుల్లో దిగురుతున్నాయి.

(అయిపోయింది) ●

(వైవాలో జరిగిన 'ఒక విపరీతం' వార్తల్లో చదివాక—రచయిత.)

పంచాక్షరి — ధర్మపథం



—బులుసు వెంకటరమణయ్య

శివకేశవు లిద్దరిలో శివుడె చాలా సులభుడనీ, నిర్నిబంధంగా కోరిన కోరిక లిస్తాడనీ ప్రసిద్ధి. 'నమశ్శివాయ' అనే పంచాక్షరీ మంత్రాన్ని జపించినట్లయితే సమస్త పాపాలూ నశిస్తాయని శివపురాణం చెపుతూ ఉన్నది.

'నమస్కారాది సంయుక్తం
శివాయేత్యక్షరత్రయమ్,
జిహ్వాగ్రే వర్తతే యస్య
సఫలం తస్య జీవితమ్,
పంచాక్షర జపే నిష్ఠో
ముచ్యతే పాప బంధనాత్.'

'నమఃశివాయ' అనే మంత్రాన్ని ఎవరు ఉచ్చరిస్తారో, వారి జీవితం ధన్యమైనదని, దాన్ని జపించినవారు పాపాలనుండి విముక్తులౌతారని దీని అభిప్రాయం.

కాశీ రాజపుత్రిక కళావతి గొప్ప శివభక్తురాలు. ఆమె పంచాక్షరీ జపం చేస్తూ నిష్ఠతో ఉండేది. ఆ మంత్ర ప్రభావం వల్ల ఆమె పాపాలన్నీ నశించాయి.

మథురాపుర రాజపుత్రుడు దాశార్హుడు ఆమెను వివాహం చేసుకున్నాడు. అతడు ఆమె శరీరాన్ని స్పృశించగా, అతని చెయ్యి చురికింది. అతడు ఆశ్చర్యపడి కారణం అడిగాడు—

'నేను పంచాక్షరీజపం చేస్తూ ఉంటాను. అందువల్ల నాలోని పాపాలు అన్నీ నశించి నా శరీరం పవిత్రంగా ఉంటుంది. అపవిత్రమైనవారు స్పృశిస్తే చురుకుతుంది. మీ శరీరం అపవిత్రమైనదై ఉండాలి' అన్నది.


రాజకుమారుడు తనకు ఆ మంత్రాన్ని ఉపదేశించాలని భార్యను కోరాడు. ఆమె, భర్తకు ఉపదేశంచేసే హక్కు భార్యకు లేదనీ, గర్గమహామునివద్దకుపోయి ఉపదేశం పొందాలనీ చెప్పింది. దాశార్హుడు ఆ మహాముని వద్దకుపోయి, ప్రార్థించి పంచాక్షరీ మంత్రోపదేశాన్ని పొందాడు.

దాశార్హుడు ఆ మంత్రాన్ని నిష్ఠతో జపించసాగినాడు. కొలదికాలానికే అతని శరీరంనుంచి వందలకొద్దీ కాకులు వెలువడి నేలపైబడి భస్మం కాసాగినవి. అతడు ఆశ్చర్యపడి 'ఇదేమిటి?' అని గురువును ప్రశ్నించాడు.

'నాయనా! నీ శరీరంలో ఉండే పాపాలు ఈ వాయున రూపంలో బయటికి వచ్చి నశిస్తున్నాయి. కొద్దికాలం యింకా జపం చేస్తే నీవు నిష్కల్మషుడవు కాగలవు' అని ఆయన జవాబిచ్చాడు.

కొలదికాలంలోనే దాశార్హుడు విగతకల్మషుడైనాడు.

తర్వాత అతడు తన భార్య శరీరాన్ని తాకితే వేడిగాకాక చల్లగానే ఉండినది. ●



జరిగిన కథ

ఒక వ్యక్తిమీద అనేక అభిప్రాయాలు వున్నట్టే—ఆ ఆస్పత్రిమీద కూడా అనేకానేక మంచీ—చెడూ అభిప్రాయాలున్నాయి. సూర్యానికి ఆ ఆసుపత్రి అంటే ఒకరకమైన భయం. తీరా అతనుకూడా అందులోనే చేరాల్సి వచ్చింది. ఆ వార్డులో ఇంకా శెట్టిగారు, శ్రీనివాసు వున్నారు. ఆసుపత్రిలో చేరాక సూర్యానికి గత మంతా కళ్లముందు కదలింది. అతను యువ్వనంలో ప్రవేశించగానే మొట్టమొదటిసారిగా విశాలాక్షి మీదకి మనసు పోయింది. సూర్యం చెల్లెలు గౌరి, ఆమె జ్ఞాపకం రాగానే అతని కళ్ళలో నీళ్ళు నిండాయి. గౌరి భర్త గోవిందరావు ముక్కు సూటిగా ప్రవర్తించేవాడు. అతనితో ఎప్పుడూ గొడవే. గోవిందరావు అకస్మాత్తుగా హాస్పిటల్లో మర ణించాడు. ఆఫీసరుగా ప్రమోషన్ రావడం అతని జీవితంలో ఒక పెద్ద మలుపు. అంతా అతన్ని ప్రశం సించిన వారే.

8

గౌరి గురించి తండ్రి యేమీ ఆలో చించలేదు. ఆలోచించడాని కేముం దన్నాడు. వాళ్ళ అత్తవారింటించి రావలసింది ఒక రూపాయి లేదు. ఏ ప్రక్కనించీ రావల సినదేమీ లేదు. ఆ కలిగిన సంతానం ఒక్క టైనా అది మగబిడ్డ కాకూడదా? గౌరికి అదృష్టం లేకపోబట్టే ఆ బిడ్డా కూతు రైపోయింది. అదొక భారం. ఆ భారం దించుకోడానికి ఆమె యెంత ఆరాటపడాలి. ఆ వచ్చే మొగుడు సరిగ్గా లేకపోతే అదొక విచారం. గౌరి విచారానికి ప్రతిరూప మౌతుంది. ఈ విచారంనించి బయటపడ టానికి విజ్ఞానం వుండాలి. విజ్ఞానం చదువువల్ల కానీ సంస్కారంవల్ల గానీ అబ్బుతుంది. ఆమె యింట్లో కూర్చుని యెవరితో పరిచయం యేర్పరచుకుంటుంది? సమస్యలు పరిష్కరించటం వలననైనా విజ్ఞానం అలవరచుకునే అవకాశం లేదు. ఇక మిగిలినది విద్య. ఆ విద్య విజ్ఞానాన్ని యివ్వటమేకాక అవసరమైతే ఆమె కాళ్ళపై ఆమె నిల్చే అవకాశం యిస్తుంది. ఆమె బిడ్డ కూడా తెలివి తేటలను మెరుగులు దిద్దుకునే అవకాశం వుంది. అందుకే తలి దండ్రులతో గౌరి చదువు గురించిన ప్రస్తా వన తెచ్చాడు.

'మన కుటుంబాలలో లేని పనెందుకు నాయనా?' అన్నాడు తండ్రి.

అమ్మ అందుకుంది 'నీలాంటి తోబు ట్టువులుండగా దానికేం కొదవ నాయనా? అంతకీ కాకపోతే ఆ పిల్లను ఒక తమ్ముడికి చేసుకుంటుంది. దాని తల యెలాగూ చెడింది. దానిమీద నిందలు మొయ్యగలదా?'

'మన కుటుంబం పెద్దది నాయనా! మనలో ఎవరేతప్పటడుగువేసినా కుటుంబం అంతటికీ కీడు ముట్టుకుంటుంది' తండ్రి వినయంగా అనగానే సూర్యం మనస్సొక్క సారి విశాలవేపు మళ్ళింది. జవాబు చెప్ప లేదు. ఊళ్లో వున్న నాలుగు రోజులూ యేటివేపు, పంటపొలాల్లోనికీ, సరుగుడు తోటల్లోనికి వెళ్లేవాడు. కిలకిల పరుగులు తీస్తున్న యేరు, పొలాల్లో కదులుతున్న లక్ష్మీదేవి గాజుల గలగలలు, సరాగాలాడు తున్న సరుగుడుచెట్లపై చిలకల గుంపుల కిలకిలలు క్రొత్త అర్థాలను సృష్టించాయ్. ఏం పెద్దమ్మా అని, ఏం అత్తయ్యా, ఏం వదినా అని యిలా వరసలు పెట్టి వూర్లో పెద్ద కుటుంబాలనించి పాటకజనం యిళ్ళకి వెళ్లేవాడు. వరసైన వాళ్ళు సరసం విరసం కాకండా మోటు పదాల నుపయోగించేవారు 'ఈ బెండకాయ యింకా ముదరలేదు వదినా'అని సమాధానం యిస్తే 'ఎవడబ్బ బొమ్మైవు' అని యింకో వయసుమళ్లిన ఆవిడ అందుకునేది. కొందరి యౌవనం అతనితో మాటాడకుండా చూపులతోనే బాసలాడేది. చిన్న నవ్వు ఆ చూపులకు సమాధానంగా యిచ్చేవాడు.

'సూర్యం యింత పెద్దవాడైనా—ఏం టమ్మా గర్వం అసలేలేదు.'

'వాళ్ళ తాత తిండికిలేకపోయినా నీతిగా పోయాడు. పెద్దలు చేసిన తపస్సు వూరికే పోతాదా? వంశాన్ని వుద్ధరించడానికి యిలా యెవడో పుట్టాడు' ఒక ముసలమ్మ అంది.

ఇలాంటి మాటలు సూర్యం విని యెన్నెన్నో వుత్సాహంగా తలచుకున్నాడు. ఆ ముసలమ్మ మాటలు మనసులో నాటి మాటికి మెసలసాగినయ్. తనలాంటి అధి కారంగల వుద్యోగులకు నీతిగాపోవటం ఒక తపస్సులాంటిది. ఆ తపస్సు తాము ఆచ రిస్తే వూరికేపోదు. దేశాన్ని వుద్ధరించే మహానాయకుడెవడో వుద్భవిస్తాడు అతని కృషివలన రామరాజ్యం ప్రతిష్టింపబడు తుంది. ప్రజలు సుఖపడ్తారు.

ఇదివరకు గుమస్తాగా తన పని పరిమితిగా వుండేది. ఇప్పుడు ఆ మనస్తత్వాన్నే తను వుపయోగిస్తే విఫలుడౌతాడు. సూర్యం విజయవంతమైన ఆఫీసరుకు వుండవలసిన లక్షణాలు అన్వేషించడమేగాక పదుగురు అలాంటి వాళ్ళు చెప్పినవి చదవసాగాడు. ఈ ప్రాంక్‌ను త్రిప్పే గొలుసులో తనొక పూసయైనప్పుడు తను నీరసంగా వుంటే యీ గవర్నమెంటు సైకిలు జోరుగా పరుగెత్తకపోవచ్చు. అతను చిన్న ఆఫీసరు అయినా ఒక్క స్కాచ్ సామెత అతనికి గుర్తుకువచ్చేది—'పెద్ద విషయాలకు గురిచూడు— కొంతలో కొంతైనా పొందుతావు'

తిరిగి పట్నం వచ్చేముందు తన గ్రామంలో యేటిలో యీదాడు, యెండలో తిరిగాడు; చెట్లెక్కాడు, దిగాడు; పొలాల పైరుల మధ్య మెసలాడు. గుడికివెళ్ళాడు, గుట్టలు యెక్కాడు. మళ్ళీ తన చిన్ననాటి చేష్టలన్నీ చేసి పట్నం వచ్చేసరికి బొంబాయినించి తన వుత్తరానికి జవాబు వచ్చింది. ఇదివరకు అతను యిక్కడే ఆఫీసరుగా ఒంటిగా వుండేవాడు. ఇప్పుడు పెళ్ళిచేసుకుని యిద్దరూ బిడ్డల తండ్రిగానున్నట్లు విన్నాడు.

'ప్రియమైన సూర్యం!

నీ వుత్తరం చేరింది. ఆఫీసరుగా మా మధ్యకు వస్తున్నందుకు సంతోషం. నీ నిజాయితీ, సమర్థతే నిన్ను పైకి తెచ్చింది. నివ్వు కోరినట్లు మాయింట్లో వుండటానికి మా యిద్దరికీ యేటి అభ్యంతరం లేదు. అప్పుడే నీ కోసం ఒక గది ఖాళీ చేసి కావలసిన సరంజామా అంతా మీ వదిన సమకూర్చింది. నివ్వు నాలా కోతిలా వుంటావా కొండముచ్చులా వుంటావా అని అడుగుతోంది. తొందర పడి నోరు జారవేసే తరవాత బాధ పడావని చెప్పాను. ఏ రోజున యే ట్రెనులో వస్తున్నావో తెలియజెయ్యి. దాదర్ స్టేషనులో దిగాలి.

ఉంటాను

ఓమ్‌ప్రకాశ్ మెహతా.'

ఆ వుత్తరం చదివి సూర్యం తృప్తిపడ్డాడు. తన బాగోగులు చూసే వారొకరు ఆ దూరపు దేశంలో వున్నారనే ధైర్యం కలిగింది. తను ఆఫీసరవటానికి ఒక్క



బెంగాలీ సహాయపడితే తనకు అతిథ్య మివ్వటానికి ఒక పంజాబీ సిద్ధంగా వున్నాడు. ఏమిటో భాషను బట్టి భారతీయులను పిలవటం తనకు నచ్చలేదు. భావాలను బట్టి మనుషులను సంబోధిస్తే యెంత బాగుండును. ఉత్తములు, మధ్యములు, నీచులు మనుష్యుల్లో తెగలివే!

* * *

బొంబాయిలోని దాదర్ స్టేషను రైలు చేరుకునేసరికి మెహతా దంపతులు పిల్లలతో ప్లాటుఫారం మీద వున్నారు. సూర్యాన్ని దిగగానే కౌగలించుకున్నాడు.

'ఇదిగో మీ భాభీ'

'నమస్కారం భాభీ'

'ఇప్పుడు చూడు. మా సూర్యం కోతిలా వున్నాడో కొండముచ్చులా వున్నాడో'

'మీ కంటే నయం' అందామె.

'మా అన్నయ్య దొరకటం మీ అదృష్టం అండీ భాభీ' అంటూని సిగ్గుపడ్డాడు.

టాక్సీ మీద బొంబాయి శివార్లలో ట్రాంబే వద్ద నున్న వాళ్ల మకాంకు బయలుదేరారు. మెహతాకు గవర్నమెంటు వారిచ్చిన ఆ క్వార్టర్సు ట్రాంబే కొండ ఒడ్డున వుంది. వరుసగా నాలుగు గదులున్న పెంకుటిల్లు. వెనుకను ఒక్కొక్క గదికి ఒక చిన్నగది తగిలి వుంది. పెద్ద గదులు నాలుగులో ప్రతిగదిలో ఒక సీలింగ్ ఫేను వుంది. ప్రభుత్వం అద్దెకు యిచ్చిన ఫర్నిచరు అన్ని గదుల్లో నిండి వుంది. ముందుకు నాలుగు గదులకు అంటుకుని పెద్ద సంతర్పణ పెట్టగలిగే టంత వరండా వుంది. ఉత్తర దక్షిణాలుగా వున్న ఆ యింటి ముందు ఒకపూలతోట వుంది. దక్షిణ మూలకు యింటి దగ్గరగా పెద్ద యీత చెట్టు వుంది. ఆ కొమ్మలకు బంగారు పిచ్చుకలు గూళ్లు కట్టుకుని అల్లజడి చేస్తున్నాయ్. ఉత్తరం వేపు సోనా చెట్టు వుంది. దసరా సమయంలో, ఆ చెట్టు ఆకులు ఒకరినొకరు యిచ్చుకుంటారు. ఆ ఆకులు బంగారు కానుకలతో సమానమట. ఆ రోజుల్లో ఆచెట్టు బోడి అయిపోతుంది. ఒక చిన్నకొమ్మ విరుచు ఒక తూపోతు. ఒక పెద్ద చింత చెట్టు పెరటు నిద్రపోతున్న రక్కసిలా

నాలుగు మంచాలు

వుంది. ఆ చెట్టుపై రకరకాల పిట్టలు ముఖ్యంగా మైలు దూరంలో నున్న, ట్రాంబే వుప్పుటేరులో తిరిగే తెల్లని గూడకొంగలు వాలుతుంటాయ్. ఒకోసారి ఆ చెట్టు సాయంత్రపు ఎండలో అల్యూమినియంలా మెరసి పోతుంటుంది. దానికి అంటేటట్లు బోయింగు విమానాలు శాంతాక్రూజ్ విమానాశ్రయంలో దిగడానికి యెగురుతుంటాయ్. మైలు దూరములో పది మైళ్లు పైగా వెడల్పుతో నున్న ఉప్పుటేరు పెద్ద చెరువులా కనిపిస్తుంది. ఆ వెనుక దూరదూరాన పశ్చిమ కనుమలు సాఫైన నీలికొండలుగా కనిపిస్తున్నయ్. ఉప్పుటేరులో తెరచాప లెత్తుకున్న ఓడలు శాస్త్రీక్ వేపు కదలి పోతున్నయ్.

ప్రక్కనే వున్న కొండపై రకరకాల చెట్లు. ఆ చెట్ల మధ్యనించి పెద్ద సెలయేరొకటి వానాకాలంలో పారుతుంది. అక్కడకు పశువులు మేసుకోడానికి వస్తాయ్. పుల్లలు తేరుకోడానికి చుట్టుపట్లనుంచి పడుచులు మరాఠీ కట్టుతో వస్తుంటారు. అప్పుడప్పుడు వాళు తీసే రాగం ఒక జానపద గీతంగామోసు. అందులో సూర్యం కొద్ది చరణాలే పట్టగలిగాడు.

'దౌలాలకొందాళ బాక్యాల బాందాలా
అకొచి నాగవళీ నాగావణీ
రూపు మజా చంద్రాచ బహాలాఖామూలా
తంద్రా చి, గోరిణితా రంగాణి.'

చుట్టూ పచ్చదనం. కొండంతా ఆకు పచ్చని తివాసీతో కప్పబడినట్టుంది. సూర్యం మెహతా కూతురి సహాయంతో కొండ యెక్కాడు. విచిత్రం— తనకు ఆయాసమే అనిపించలేదు. ఆ కొండపై నించి చూస్తే బొంబాయి నగరమంతా కనిపించింది. కొండపై ఒక పాడుపడిన పోర్చుగీసుల కాలంనాటి చర్చి వుంది. చర్చి గోడలే మిగిలి వున్నయ్. పాడుపడిన చర్చిలోనూ చుట్టూ రకరకాల అడివి మొక్కలు పూలతో నిండి వున్నయ్. అందులో కాలు పెట్టగానే యెక్కడలేని ప్రశాంతి. ఎవరో గుడిగంటలు దూరాన మ్రోగుతున్నట్లు చప్పుడైంది. ఈ ప్రశాంతంలో విశాల వుంటే? ఆ తలపును వెంటనే మార్చుకున్నాడు. ఎంత తుడిచి పెడ్దామన్నా ఆ ప్రతిబింబం ఒకోసారి తనలో మెరసి పోతోంది.

క్రిందకు దిగాడు. సెలయేరు మెల్లగా పారుతోంది. అందులో గలగలలు విశాల హృదయం కొట్టుకున్నట్లే వున్నయ్. విశాల యీసరికి ఒక బిడ్డను అడ్డాలలో వేసుకుని వుంటుంది. ఆమె గురించి తలచుకోడానికి తనకేం హక్కులేదు. ఇంటికి వచ్చేసరికి మెహతా అతని భార్య లత తోటలో వున్నారు. వాళ్లే మొక్కలకు నీరు పోస్తున్నారు. భాభి యెంతో అభిమానంగా సూర్యాన్ని చూస్తోంది. తను మొగవాటస్తుడని ఆమె యిట్టే పోల్చుకుంది. భోజనం దగ్గరనుంచి అన్ని విషయాల్లోనూ చొరవ చేసుకుని తినేటట్లు చేస్తోంది. ఆమె యింటిని శుభ్రంగా వుంచే తీరు, పిల్లల నిద్దరనూ పెంచే శ్రద్ధ అతనికెంతో నచ్చింది. ఆమెకు సిగ్గుపడటం అలవాటు లేదు. బాహాటంగా మాటాడేది. సూర్యంకు చదువుకున్న భార్యల యందు ఒకవిధంగా నున్న యేవగింపు కొద్దికొద్దిగా తగ్గసాగింది. కొన్ని పనులు మాత్రం అతనికి నచ్చేవి కావు. మూతి నిండా లిప్ స్టిక్ రాసుకుని గంటల తరబడి సింగారింపుకు యేవగించుకొనేవాడు.

ఒకరోజు సాయంత్రం వరండాలో తన గది ముందు వాలు కుర్చీ వేసుకుని పేపరు చదువుతున్నాడు. మధ్యమధ్య పూలతోట వేపు తన దృష్టి వెళ్తోంది. తోట ఫెన్సింగ్ మీద చిన్న రామచిలుకలు గురిపులు అరుస్తున్నాయ్. తోట నిండుగా రకరకాలపూలు విరబూసి వున్నయ్. ఆ మనోహర దృశ్యం చూస్తుంటే యెర్రగా గాఢీ రంగు చీర కట్టుకుని, కట్ జాకెట్ వేసుకుని లత వరండాలో ప్రత్యక్షమైంది. మూతి నిండుగా లిప్‌స్టిక్ రాసీ వుంది. ఈమధ్య ఆమెతో చనువుగా మాట్లాడితే గానీ ఆమె ఒప్పుకోవటం లేదు. మెహతా వూళ్లోకి వెళ్లి యింకా రాలేదు.

'ఏం భాభీ... ఎక్కడికి బయలుదేరారు?' అన్నాడు.

'ఎక్కడికీ లేదు..'

'ఎక్కడికీ లేదా?'


ఏ రోజైనా చేసుకోండి మీరు సంతోష వస్త్ర దినం
బిన్నీ షర్టులు

'ఎక్కడికీ వెళ్ళనిది యెందు కిలా సింగారించుకున్నారనేనా నీ ప్రశ్న.'

'నేనలా అన్నానా?'

'లోన అనుకుని వుంటావ్. ఏమిటీ భాభి రోజుకు రెండు గంటలు సింగారించు కోడానికి వేస్ట్ చేస్తుందని! ఇలా సింగారించుకోకపోతే మీ అన్నయ్య వూరుకుంటాడా?'

'హో భాభీ— మా అన్నయ్య మీద నింద యెందుకు వేస్తావ్?'

'మీ అన్నయ్య వూరుకుంటారా అంటే ఆయన యిలా వుండమంటారని కాదు. మీ మగవాళ్ళ సంగతి మాకు తెలీదూ? మీ కళ్ళు తుమ్మెదల్లాంటివి. నేనిలా శృంగారంగా కనపడకపోతే యీ మహా పట్నంలో యిలా తిరిగివస్తారు కదా మీ అన్నయ్య— తారసపడిన యే అమ్మాయిని మనసులో వుంచుకుంటారో?'

'ఇద్దరు పిల్లల తండ్రి—మీరలా అతనిని అనుమానించవచ్చా?'

'అబ్బే నేను అనుమానించలేదు. కాని నా విధి నేను నిర్వర్తించాలిగా.'

శృంగారించుకోవటం విధి అనగానే యెందుకో సూర్యానికి నవ్వు వచ్చింది.

'నీ నవ్వు నాకు అర్థమైందిలే! మా తల్లి తండ్రి వుండేవాడు. నాకు మాటలతో ఆడించేవాడు. పెళ్ళం పగలు యెంత కష్టపడినా రాత్రి అయ్యేసరికి రంభలా తయారవ్వాలనే వాడు. తన పెళ్ళం ముసలిదైనా కుదురుగా లేకపోతే అతనికి కోపం వచ్చేది.'

సూర్యం యీమె ముగమాటం లేకండా అన్నందుకు నవ్వుకుంటే...

'నివ్వు నవ్వావంటే అందులో యెన్నో ప్రశ్నలుంటాయ్. ఆడవాళ్ళకున్న దేమిటి చెప్పు? మెదడున్నదంటే నేను యింత చదువుకున్నాను కాని ఒప్పుకోను. ధైర్యం వుందంటే ఉహూ అదీలేదు. వాళ్ళకున్న దల్లా కోమలత్వం. అదే వాళ్ళకి అందాన్ని ప్రసాదించింది. దాన్ని పరిరక్షించుకోడానికి ఆడది మగాడిపై ఆధారపడవలసి వస్తోంది.'

'మగాడిపై ఆదారపడని ఆడవాళ్ళు లేరా?'

'అలా అనుకోవటం ఆత్మవంచన. ఒక మహారాణి యైనా భర్తను సలహా అడ

నాలుగు మంచాలు

క్కండా పాలించలేదు. ఈ దేశంలోనే కాదు మీరు పాశ్చాత్యదేశాలు తీసుకున్నా ఆడది మగవాడి మీద ఆధారపడకండా బతకలేదు. ఆ ఆధారం కోసమే అంత మంది అతివలు అర్ధనగ్నంగా నాట్యం చేస్తారు. సీతాకోకల్లా ఆకర్షవంతంగా తయారవుతారు.

ఇంత చదువు సంస్కారాలతో శోభిల్లి ఆమె గృహిణిగా వుదాత్తంగా నమ్రతతో మెసలటం చూసి సూర్యం యిదివరకు పాతుకపోయిన నిర్ణయాలను తెంప సాగాడు. ఈమెతో మాటాడుతుంటే యిలాంటి సంస్కారం గల భార్యే తనకూ వుంటె యెంత బావుండేదనిపించింది.

తను ఆఫీసుకు యెలక్ట్రిక్ ట్రైను మీద వెళ్ళాలి. స్టేషను దిగి ఒక అర మైలు నడచి యిల్లు చేరుకోవాలి. ఒక నాడు స్టేషను నుండి వస్తూ వర్షంలో చిక్కుకున్నాడు. తడవటం వలన ఆరాత్రి కొద్దిగా రొంప చేసింది. ఆమె మాటి మాటికి నిద్రపోయే వరకూ గదిలోనికి వచ్చేది. వద్దన్నా మాత్ర మింగించింది. ఒకసారి యిద్దరూ కలసి వచ్చారు.

'మీ తమ్ముడికి యిక ఒంటరి జీవితం లాభం లేదు.'

'ఇదే బాగుంది భాభీ!'

'కొన్నాళ్ళకి తల పండిపోతే యే ఆడదీ వలచిరాదు.'

'నన్నెవరు వలుస్తారు భాభీ?'

'ఊ. అన్నావంటే ఒక బొంబాయి

> # శుభవేళ
>
> పాడుకో పులుగులా
> మనసు నిండిన వేళ
> ఆడుకో పాపలా
> కల ఫలించిన వేళ.
>
> ఏరుకో రతనాలు
> భూమి పండిన వేళ
> కోరుకో కైతలను
> కవిగ మారినవేళ.
>
> — శిలపరశెట్టి 'సనారా'

పిల్లని తెచ్చి నీ ముక్కుకు దొండపండులా తగిలించేస్తాం.'

'అమ్మో. బొంబాయి పిల్లే—నాకొద్దు బాబో?'

'ఏం?'

'నేను భరించలేను!'

'వాళ్లేం భూతాలా?'

'దానితోనే సమానం. వాళ వేషాలు, యెవరు సహించగలరు? వాళ్ల క్రింద యెవరు ఖర్చుపెట్టగలరు? వాళ్లంతా, పాశ్చాత్యదేశంలో ఒక కాలు మనదేశంలో ఒకకాలు పెట్టుకొని నడుస్తారు. నాకొద్దు బాబోయ్.'

లత ముసిముసి నవ్వుతూ 'మీ అన్నయ్య భరించగలిగింది నివ్వు భరించలేవా?'

'భాభీ—నీదీ బొంబాయేనా?' అన్నాడు ఆశ్చర్యంగా.

'ఇక్కడే పుట్టాను—ఇక్కడే పెరిగాను, ఇక్కడే చదివాను— ఇక్కడే యీయనను కలిసాను—'

'క్షమించు భాభీ. నీ అంత మంచిది దొరికితే పెళ్ళాడడానికి నాకేం అభ్యంతరం లేదు.'

అంతా నవ్వేసారు.

బొంబాయి నగరం అందరూ కలిసి చూసారు. ఇక్కడ సూర్యంకు నచ్చిన వెన్నో విషయాలు వున్నయ్. ఎత్తైన మేడలూ, విశాలమైన రోడ్లు— ఎప్పుడూ నాడిలా కొట్టుకునే యీ పట్టణంలో కొద్ది నెలల నివాసమే తనకు నాదీ అన్న ఆప్యాయతను అభిమానాన్ని సృష్టించింది. బస్సులూ, యెలక్ట్రిక్ రైళ్ళ రక్తాన్ని మోసుకుని పోయి శుభ్రపరచి పంచి పెట్టే నాళాల్లా పట్టణమంతా తిరిగి యీ పట్టణాన్ని నిత్యం నిండుగా సజీవంగా వుంచుతున్నాయ్. పట్నంలో, పచ్చని వుద్యానవనాలు, ప్రేమ పూలను విర జిమ్ముతూ ప్రణయానికి వాతావరణాన్ని సృష్టిస్తున్నయ్. అందాన్ని ప్రతీకి పుచ్చుకుని అపురూపమైన ఆభరణాలు,దుస్తులతో అతివలు కళ్లవేడుకతో అన్ని స్థలాల్లోను అగుపిస్తున్నారు. ప్రాణం ప్రతిచోట తొణికిసలాడుతోంది.

ఈ అందమంతా అందని చందమామలా మనస్సును సంతోషపరచినా మరుక్షణంలో

అందిన చంధమామను వదలుకున్నానన్న నిస్పృహ తనను వేధించేది. పూలతోటల పరిమళం, ఆకాశం అందించిన విశాలం, అందం వెదజల్లిన అమృతం, చంద్ర కళల చల్లదనం, యివన్నీ ఒక యువనిలో రూపాలు ధరించి తనకు అందు బాటైతే యెలా విడువగలిగాడు? అభిమానాలతో అర్థంలేని అడ్డుగోడల మధ్య దాగుండి పోయిన తను యెంత తెలివితక్కువ వాడు? మళ్లీ చందమామ లాంటి ఆమోహము తన దగ్గరగా రమ్మంటే రాదు. తన అందాన్నంతా ఆవేశంతో అమృతంలా తనపై వొలికించదు. ఆమె గుండె ప్రేమబాస లాడదు. ప్రణయం మళ్లీ వుప్పొంగదు. ఆమె వలపు యెల్లప్పుడూ ప్రవహించే నదిలా వుండవలసింది. ఎల్లవేళలో వెలిగే కిరణం కావలసింది. కానీ తను ఆ నదికి ఆనకట్ట కట్టి ప్రవాహాన్ని ఆపు చేసాడు. ఆ కిరణం, వెలుగు రాకండా యెత్తైన గోడలు సృష్టించాడు. ఇప్పుడు తలచుకుని గోడల మధ్యలో నివశించే కంటే యింకేం చెయ్యలేడు. విశాల, విశాల విశ్వంలో ప్రతిచోట కనిపిస్తోంది. ఆ రూపంతో కాదు అనేక రూపాలతో, అనేకమైన భంగిమలతో, ఎన్నెన్నో అనుభూతులను సృష్టిస్తోంది. కానీ తను ఆమెను ముట్టుకోలేడు. నిస్పృహ ఆశను పూర్తిగా కాల్చలేదు.


తనకు తనపై నున్న జాలి తగ్గించుకోడానికి ప్రయత్నిస్తున్నాడు. ఈ ప్రయత్నానికి దోహదమిచ్చే వాళ్లలో లత ఒకర్తె! ఎల్లవేళల యందు తనకు సంతోషంగా వుండేటట్లు యే మాటల్లోనో చేతల్లోనో చేస్తోంది. శలవ రోజున యింట్లో కూర్చోబెట్టదు. ఎక్కడికో భర్త పిల్లలతో పాటు సూర్యంని కూడా పిక్నిక్కి తీసుకపోతుంది. ఒకరోజున తన చెల్లెళ్లు ముగ్గురూ వాళ్లతో కలిసారు. అంతా కలసి వాళ్ల తండ్రి కారులో ముందు ఆరే మిల్క్ కోలనీలో గడిపారు. ఎక్కడా పచ్చదనమే. కొండ మీద నున్న పాల కేంద్రాన్ని చూసారు. ప్రకృతి పచ్చదనం, పూల అందం రెండిటినీ జోడించి పూల తోటలుగా అపూర్వమైన సృష్టి చేసారు. పాలు వుత్పత్తి అయ్యే ఆ కేంద్రంలో తేనె కూడా వుత్పత్తి అవుతున్నట్లు అక్కడ విరజిమ్ముతూ పూలపై కదిలే తేనెటీగలే చెప్తున్నాయి. అక్కడ చేరిన వేలాది జవ్వనులు రంగురంగుల దుస్తులతో పుష్పోడి లాంటి ప్రణయం ఒళ్లంతా విరజిమ్ముకుని ప్రియులను ఆహ్వానించే విరబూసిన పువ్వుల్లా వున్నారు. ఎన్నో ప్రణయ సౌధాలకు అక్కడ పునాదులు వెయ్యబడుతున్నాయ్. ఎంతమందో యువకులు తేనెటీగలై వాళ్లు సృష్టించే వలపు తేనెలను వాళ్లే త్రాగేస్తున్నారు.

అక్కడ నించి కన్హేరి గుహలకు వెళ్లారు. ఆ బుద్ధుని విగ్రహం, ఆ విహారం చూడగానే ప్రేమతో నిండిన మనసు కరుణకు చోటిచ్చింది. ఏవో ధర్మాలు, కలలు, సన్యాసం వగైరా మనసులో తిరిగి నరాల పొంగును తగ్గించాయ్.

ఆఖరి మజిలీ బోరివిల్లిలో నేషనల్ పార్క్. క్రొత్తగా సృష్టించిన ఆ పార్క్ సింగారం యింకా పూర్తి కాలేదు. ఒక మూలకు వెళ్లిపోయారు. చెట్ల క్రింద బస చేసారు. భాభీ పెద్దచెల్లెలు గీత చాలా సరదాయైన పిల్ల. మగాడి దుస్తులతో తయారై వుంది. తల మీద ఫెల్ట్ టోపీ, గాడీల బుష్ షర్టు, పిక్కలకు పట్టిన వులెన్ ఫేంట్. చెవులో బెంగాళీ రింగులున్నాయ్. కళ్లు కలువరేకులను జ్ఞప్తికి తెస్తున్నాయ్. ముఖంలో చిలిపితనం, ముక్కులో కోపం, మూతిపై యెరుపు రంగు ముచ్చటగానే కనిపిస్తున్నాయ్. చెట్టున పండిన బొప్పాసి పండులా మధురంగా వుంది.

ఆమె చేసిన అలజడి యింతా అంతా కాదు. టేప్ రికార్డు చేసిన పాటలు వస్తుంటే పిచ్చిగా డ్యాన్సు చేస్తోంది ఆ ట్విష్టుడ్యాన్సులో ఆమె ఒక పాశ్చాత్య కన్యలా సూర్యంకు కనిపించింది. మొదట మౌనంగా యేవగించుకున్నా అందరితో పాటు తనూ తప్పట్లు కొట్టాడు. ఎంతో హంగామా చేసింది. అందర్నీ యేడిపించేసింది. జుత్తులు పీకేసింది. చివరకు ఆమె పాడుతుంటే ఆ టేప్ రికార్డు చేసిన పాట ఆమెదేనని పోల్చుకున్నాడు.

ఆమె పై పళ్లు పెదాలను పట్టివుంచి కన్నెపడుచు వలపు పెదాల నుంచి జారి పోకండా పట్టి వుంచినట్లుంది. సూర్యం ఒకోసారి గాబరా, యింకోసారి ఒకవిధమైన జాలీ, వేరొకసారి ఆమెను మెచ్చుకోకండా వుండలేకపోయాడు. మెహతాను, పిల్లలను పట్టుకుని లత యింకో వేపు కదలింది. చెల్లెళ్లంతా వేరొక వేపు కదిలారు. సూర్యం జేబులో పుస్తకం తీసి ఒకమూల చెట్టుకు చారబడి చదువుకోసాగాడు. కాస్సేపటికి అందులో నిమగ్నుడై పోయాడు. చెవి



నాలుగు మంచాలు

దగ్గర జోరీగలా యేదో శబ్దం—తరవాత పిల్లి అరుపు. ఇక్కడ పిల్లులు కూడా వున్నాయా అని ఒకసారి తేరి చుట్టూ చూస్తే యెవరూ అగపడలేదు. కొంత సేపయ్యాక మీద బటానీల వర్షం పడు తోంది. తన పుస్తకం మీద రాలిన రెండు బటానీ గింజలను నోట్లో వేసుకుని తలెత్తి చూసాడు. యెర్రకోతి నల్ల బట్టలు వేసుకుని కూర్చున్నట్లు గీత చెట్టు మీద నుంది. సూర్యం నవ్వు నాపు కోలేకపోయాడు. పళ్లికలించి వెక్కిరించింది గీత.

సమాధానం యీయని సూర్యం పని పెట్టేస్తానన్నట్లు చెట్టు నించి సరిగా తన ప్రక్కనే దూకింది.

'అమ్మో— కోతి' అన్నాడు సూర్యం ప్రక్కకు గాబరాగా జరుగుతూ. మళ్లీ తడబడుతూ 'ఓహో నివ్వా నీతా? చెట్టు మీద కోతులున్నాయనుకున్నాను.'

'చెట్టు క్రింద కొండముచ్చు కూర్చుం దనుకొని గెంతాను.'

'నీకు తెలీదు కామోను కోతులకు కొండముచ్చులకు బద్ధ వైరం.'

'పొరపాటుగా అన్నాను. క్రింద కోతి కూర్చుందనే బటానీలు వేసాను. ఆ రుచి చూసి యీ కోతి చెట్టెక్కుతుందనుకున్నా.'

'నాకు చెట్టెక్కటం చేతకాదు.'

'నీకు చేతకాని వెన్నో వున్నట్లు తెలిసి పోతోందిగా.'

'పోనీ చెప్పు— తెలుసుకొని...!

'ఒకరు చెప్పితే సరిదిద్దుకుంటే నీ ప్రజ్ఞ యేదీ? నీ చేతకాని తనాన్ని నివ్వే తెలుసుకుని సరిదిద్దుకుంటే గొప్పతనం.'

'నివ్వు అలాగే చేస్తుంటావా?'

'ఇది నాకు చేతకాదని చెప్పు చూస్తాను?'

'ఏముంది?...' ఆలోచనలో పడ్డాడు.

'ఏమీలేదు.' వ్రేళ్లతో లెక్కపెట్టూ 'నాలా వంట చేసేవాళ్లు, నాలా పాడేవారు, ఆడేవారు, సరదాగా వుండేవారు, చల్లగా కబుర్లు చెప్పేవారు, పెంకితనం చేసే వాళ్లు, సంతోషంగా వుండేవాళ్లు—యింకా చదివే వాళ్లు—మా వీధిలో యెవరూ లేరు.'

'ఎంతవరకు చదువుకున్నావ్.'

'మీరెంతో నేనూ అంతే చదివాను.'

'నా చదువు నీకేం తెలుసూ?'

'అయ్యో! మా అక్క యింట్లో వుంటే మా యింట్లో వున్నట్లు కాదూ! మీగురించి నాకెంతో తెలుసు! బోల్డు తెలుసు.'

'ఏం తెలుసుకున్నావో చెప్పకూడదూ వింటాను.'

'అందరి గూర్చి ఆడవాళ్లు బాహాటంగా చెప్తారు. కానీ ఒక్కడి గూర్చి చెప్పలేరని తెలీదు..'

'చెప్పు.'


'ఊ—నే చెప్పను' అంటూ పుస్తకం లాక్కుని. పరుగెత్తింది. సూర్యం అలా చూస్తూ నిల్చుండి పోయాడేగానీ ఆమె వెంట పరుగెత్తలేదు. ఇదివరకు భాభీ యింట్లో అప్పుడప్పుడు గీతను చూసాడు గానీ యింత చలాకీ పిల్ల అనుకోలేదు. ఆమె తిరిగివచ్చి

'అప్పుడే ముసలివాళ్లయిపోయారు, ఎంత మంది పిల్లలు సార్!'

'లేరు'

'అయితే మీ వేపు అనుమానంగా చూడవలసి వస్తోంది.' అనగానే అంతరార్థం గ్రహించుకుని 'అమ్మ దొంగా' అంటూ వెంట తరిమాడు.

ఆమె పరుగులెత్తింది. పది అడుగులు వేసి సూర్యం ఆగిపోయాడు.



(ఇంకా వుంది)

వారఫలం

5-5-1972 శుక్రవారం మొదలు 11-5-1972 గురువారం వరకు

మేషం: అన్ని వ్యవహారాల్లోను గౌరవం బాగా ఉంటుంది. ప్రయాణాలు ఫలిస్తాయి. వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు బాగుంటాయి. వారం ఆఖరులో కొంత మంది వ్యక్తులు మిమ్మల్ని మోసం చేయడానికి ప్రయత్నిస్తారు.

స్త్రీలకు:— పుణ్యకార్యాలు చేస్తారు. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

వృషభం: వృత్తిలో అనుకూలమైన వార్తలను వింటారు. నూతన వ్యవహారాలు లాభిస్తాయి. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరతాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది. విద్యావైజ్ఞానికరంగాల్లో మీ కృషి రాణింపగలదు.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగుంటుంది. బంధుమిత్రులను కలుసుకొంటారు.

మిథునం: వృత్తి వ్యాపారాల్లో శ్రమ కలుగుతుంది. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. వారం మధ్యలో ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. విద్యావైజ్ఞానికరంగాల్లో మీ కృషి రాణిస్తుంది. ప్రయోజనకరమైన పరిచయాలు ఏర్పడతాయి.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాల్లో చికాకులు ఏర్పడతాయి. సంతోషకరమైన వార్తలను వింటారు.

కర్కాటకం: భాగస్వాముల తోడ్పాటుతో చేసే వ్యాపారాలు బాగుంటాయి. పై అధికారులతో గౌరవం లభిస్తుంది. వారం మధ్యలో ఆందోళన కలుగుతుంది. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వారం ఆఖరులో అన్ని వ్యవహారాలు తిరిగి బాగుంటాయి.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగుండదు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

సింహం: వ్యాపారంలో పోటీదారుల పోటీ పెరుగుతుంది. ఆడంబరం కోసం వ్యయం చేస్తారు. ప్రయాణాలు అనుకూలంగా ఉంటాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. వారం ఆఖరులో అన్ని వ్యవహారాల్లోను ప్రతికూలత ఏర్పడుతుంది.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. దైవకార్యాలు నెరవేరతాయి.

కన్య: వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు బాగుంటాయి. రాజకీయ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. ఇతరుల నిమిత్తం ప్రయాసకు గురి కాగలరు. వారం ఆఖరులో మీ ప్రయత్నాలు సులువుగా నెరవేరతాయి.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగుంటుంది. పోటీ వారితో వాదప్రతివాదాలు తగవు.

తుల: మీ మంచితనమే మీకు ఇబ్బందిని కలిగిస్తుంది. ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. ప్రయాణాల ద్వారా కార్యసాధన చేయగలరు. రావలసిన డబ్బు సమయానికి అందకపోవడంవలన ఇబ్బంది కలుగుతుంది.

స్త్రీలకు:— ఆడంబరం కోసం వ్యయం చేస్తారు. బంధుమిత్రులను కలుసుకొంటారు.

వృశ్చికం: మీ కార్యక్రమాలు చురుకుగా సాగుతాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది. స్థిరాస్తి వ్యవహారాలు బాగుంటాయి. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. వారం ఆఖరులో వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగుంటుంది. పోటీ వారిలో గౌరవం లభిస్తుంది.

ధనుస్సు: ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. నూతన వ్యవహారాలు లాభిస్తాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు సాధించగలరు. వ్యాపారంలో అనుకూల వార్తలను వింటారు. వారం ఆఖరులో అన్ని వ్యవహారాల్లోను ఫలితం సామాన్యంగా ఉంటుంది.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. పుణ్యకార్యాలు చేస్తారు.

మకరం: వృత్తిలో ఆదాయం బాగుంటుంది. ప్రయాణాలు ఫలిస్తాయి. వ్యాపారంలో ప్రయోజనకరమైన సంభాషణలు జరపగలరు. విద్యావైజ్ఞానికరంగాల్లో మీ కృషి ఫలిస్తుంది. రాజకీయ వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగుంటుంది. నూతన విషయాలను తెలుసుకొంటారు.


కుంభం: ఉద్యోగంలో ఎవరినీ నిక్కచ్చిగా నమ్మడం తగదు. మీ విలువైన వస్తువులు పోవచ్చును. వారం మధ్యలో వృత్తి వ్యాపారాలు బాగుంటాయి. పోటీదారులతో గౌరవం లభిస్తుంది. సమయానికి మీకు ఒకరినుంచి డబ్బు చేతికి రాగలదు.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది.

మీనం: వ్యాపారంలో మీ ఆలోచనలు ఫలిస్తాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. వారం మధ్యలో సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వృత్తిలో శ్రమ కలుగుతుంది. వారం ఆఖరులో అన్ని వ్యవహారాలు తిరిగి బాగుంటాయి.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగుండదు. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

—మహేష్



నీకూ ఓ కథ వుందా?

కొలను వేంకట దుర్గాప్రసాద్

మా పిన్నికూతురు పెళ్ళి సందర్భంగా నేనూ, మా ఆవిడ—మాలతి, ఇద్దరు పిల్లల్తోసహా ఉదయం పదిగంటలవేళ బెజవాడలో దిగేం. ఆరోజు రాత్రే పెళ్లి. పెళ్లి రోజునే వచ్చినందుకు మా పిన్నీ బాబాయి కలిసి, నామీదా మాలతిమీదా కాసిన్ని అక్షింతలు జల్లేరు.

'సెలవు దొరకలేదు పిన్నీ! కనీసం నిన్నే వద్దాం. కాని ఆ చాకలాడు ఇస్త్రీ బట్టలు తేలేదు. ఇస్త్రీవాడికేసిపోయాను. ఈయన నేమో ఓ పూట సెలవు చాకల్ని పట్టుకొని బట్టలు (ఇస్త్రీ చేయించుకుందుకు ఖర్చు పెట్టారు. అప్పటికి కానీ...'

మాట్లాడుతున్న మాలతిని 'చాల్లేవే, వచ్చేశాం గదా...ఎందుకవన్నీ యిప్పుడు?' కోప్పడ్డాను నెమ్మదిగా.

పిన్నీ బాబాయి, పాపం వాళ్ళు మాత్రం పెళ్ళిపనులు మానుకొని ఎంతసేపని మా మీద అక్షింతలేస్తూ కూర్చుంటారు? వాళ్ళు పనుల్లో మళ్ళా నిమగ్నులయ్యారు.

మా ఆవిడ యిద్దరు పిల్లల్ని నామీఁ పడేసి, తనూ కొంగూ బొడ్లో దోపుకుని పెళ్ళి హడావుడిచేయడంలో మునిగిపోయింది.

ఇక ఈ పిల్లలు—పెద్దాడికి రెండేళ్ళు. రెండోది చంటిది—పదినెల్లు. ఎప్పుడూ ఏడుస్తుంది, ఏదో స్పష్టంతా ఆగిపోయినట్టు. పెద్దాడు పెద్దకేటు. వాడ్ని ఎత్తుకోనవసరంలేదు. అటూ ఇటూ తిరుగుతాడు. అరుస్తాడు. పాడతాడు. నవ్వుతాడు. దొర్లుతాడు. ఎవరు పిల్చినా వెళ్తాడు. అదో గుణం వాడిది. చంటిది ఈ లోకంలోవచ్చి పది నెల్లు కాలేదు. దానికి కొత్తా పాతా తెలుసు. ఛస్తే కొత్తవాళ్ళదగ్గరి కెళ్లదు. 'దామ్మా ఎత్తుకుంటా' అని ఎవరేనా అనడం ఆలస్యం కుయ్యిమంటుంది.

పెళ్ళిపందిరి పెద్దదివేశారు. ఎండాకాలం రోజులేమో, ప్రతివారూ పందిరికింద చాప లేసుకొనో, బల్లలేసుకొనో, పడకకుర్చీలేసుకొనో, మడతమంచాలేసుకొనో పడుకున్నారు. నేను ఓచోట కూర్చుని ఒరుగుదామనుకున్నా గానీ పిన్నీ మాసిందంటే 'పడుకోడానికటా వచ్చిందీ ఆయ్?' అంటుందేమోనని భయం.

పెద్దాడు అప్పుడే పందిర్లో తిరగడం మొదలుపెట్టాడు. చంటిది కుయ్యిమంది. కాసేపటికి స్థాయిని పెంచింది. ఆకలేస్తోందిగావునని 'ఏవే మాల్తీ! ...ఓసారిలారా!' అటేటో హడావుడిగాపోతున్న మా లతిని పిలిచేను.

'అబ్బ! ఏవిటండి?'

'ఏవిటీ నీ వినుగు? ఇదేడుస్తోంది చూడు!' అన్నాను.

'మీరెందుకూ ఏడుపు మొహం పెడ్తారూ? దాన్నిలా యివ్వండి, ఆకలేస్తోంది గావును' అని తీసుకుంది చంటిదాన్ని;

హమ్మయ్యా అనుకున్నాను.

కాసేపు అయింది.

భోజనాలకి లేవండ రా అన్నారంతా. పడుకున్నాళ్ళంతా ఒక్కసారే లేచి కూర్చున్నారు. చాపలూ, మడతమంచాలూ, పడక కుర్చీలూ, బల్లలూ ఖాళీఅయ్యాయి. ఇదే సమయం, ఓ మడతమంచం మీదకెళ్ళి ఒరుగుదామని పరుగెట్టేను.

'ఓరే కామేశం!...' పిన్ని పిల్చింది.

నెత్తిమీద కొట్టినట్టు ఆగిపోయేను.

'కాస్త వడ్డనలో వుండు...'.

'వచ్చాం! ఫస్టుక్లాసు ప్రయాణంవల్ల ఒళ్ళంతా వచ్చడయితే, ఇప్పుడు పనెవడు చేస్తాడు, నేచేయను ఫో' అని అరిచేద్దామనుకున్నా.

'తొరగా రా!' అంటూ నా జవాబు వినే ఓపెంలేకుండా వెళ్ళిపోయింది.

ఇక లాభంలేదని చొక్కాచేతులు పైకి మడిచి, ఇంట్లోకెళ్ళి ఫాంటుతీసేసి లుంగీ కట్టుకొని పందిర్లోకి వచ్చేను.

పందిరిలో పాతికమంది ఒకచోట గొడవ పడుతున్నారు.

'ఏవిటీ సంగతి?' అడిగేను.

'పెళ్ళికొడుకు వాళ్ళు భోజనానికి రావన్నారు.'

'ఏం? ఎందుకనిటి? వాళ్ళు వేరే వండుకున్నారా?!' అడిగాను అంతా నవ్వారు.

ఎదురుగుండా ఓ యిల్లువుంది. అదే పెళ్ళికొడుకు వాళ్ళ విడిదట.

'పాలు పంపించమన్నారట ఓగంటక్రితం అలాగేనని మనవాళ్ళు అన్నారటగానీ, పంపించనేలేదట.'

'పాలడిగిందెవరు? పెళ్ళికొడుకా? అడిగేను.

'కాదు, పెళ్ళికొడుకు వదినగారి ఆడబిడ్డ అత్తగారి అక్కయ్య కోడలి కూతురికి పాలు కావాల్సివచ్చినయి...'

'మరి వాళ్ళు అడిగినప్పుడు ఎందుకు పంపించలేదు పాలు?' కోప్పడ్డాను

'నాయనా! లక్షపనులు, పూం పంపిస్తాం అని తలూపి వచ్చినవారెవరో ఆపాలు ఇచ్చే బాధ్యత నెత్తినవేసుకుంటే బావుండేది. మరి ఆ మనిషి ఎవరికో చెప్పివుంటాడు... ఆయన మరో మనిషికి చెప్పివుంటాడు... ఎవరని ఎన్నని మాసుకుంటాం.' మా వాళ్ళ తరఫున ఎవరో అన్నారు. ఆర్గనైజేషను బావోలేదనిపించింది.

'అది కాదండి! వాళ్ళ విషయం కాస్త జాగ్రత్తగా చూసుకోవాలి మరి. ఆడపిల్ల గలవాళ్ళంకదా! ఏదొచ్చినా మనకే యిబ్బంది. ఈ రోజు కెలాగో కళ్ళు మూసుకుంటే రేపెవరి దారిన వాళ్ళుపోతారు' అన్నాను.

'ఏంచెయ్యను, తప్పయిపోయింది, క్షమించండి అని చెప్పికూడా వచ్చాను వుహూఁ ఆస్సలు వినడంలేదు' మా మావయ్య అన్నాడు.

'నేనోసారి వెళ్లొస్తానాగండి' అంటూ విడిదిలో కెళ్ళాను.

కళ్లకి, కాటుక, బుగ్గన చుక్క పెట్టుకొని పెళ్లికొడుకు కూర్చునివున్నాడు. తిన్నగా అక్కడికి కెళ్ళేను.

నేను ఫలానా అని చెప్పుకొని 'మీరంతా భోజనానికిరానని అన్నారట. సంగతేవిటో చెప్పండి...ఏదో సర్దుకుంటాం...మా పిన్నీ బాబాయికి పాపం ఈ హడావుడి కొత్త. వాళ్ళింట్లో యిదే మొదటి పెళ్లి. కంగార్లో ఏవో పొరపాట్లు జరుగుతుంటాయి' వసిగాను.

'పొరపాటేవిటండి? చంటిదానికి పాలు అడిగాం. పంపిస్తామన్నారు. చంటిదానికి పోతపాలు అలవాటు. ఇలా మమ్మల్ని పట్టించుకోరని మాకేం తెలుసు? లేకపోతే గేదెను తోలుకొచ్చుకునేవాళ్ళం' ఎవరో ముఫ్ఫై అయిదేళ్లావిడ అరిచింది

'అంతమాట అనకండి. ఇకనుంచి మీకేవి కావాలన్నా నాకు చెప్పండి నే చేస్తాను. నేనిక్కడే వుంటాను, సరేనా? మరిక మీరు భోజనానికి లేవాలి... అక్కడ వంటకాలన్నీ చల్లారిపోతున్నాయి ... రుచి పోతుంది...'

'పాపం లేవండ్రా! ఆయన చూస్తే నంటున్నాడుగా...' ఒకాయన అన్నాడు! ఆకల్తో ఛస్తున్నాడని పసికట్టేను. గభాల్న ఆయన దగ్గరికెళ్ళి. 'పెద్దవారు, మీరు లేవండి' అని ఆయన్ని లేవదీసాను.

ఆయన భార్యగావును గభాల్నవచ్చి ఆ ముసలాయన భుజంమీద బలంగా చెయ్యేసి లేవనీయకుండా చేసింది 'మళ్ళా చంటిదాని పాలగురించి మర్చిపోయారు? ముందా పాలు తీసుకురండి' అంది.

'ఇప్పుడే పట్టుకొస్తాను' అని అక్కడ్నించి పిన్నిదగ్గరికి పరుగెట్టుకొచ్చేను

'కాసిన్ని పాలు... కాసిన్నేం కర్మ... ఓ పెద్దగ్లాసులో పాలుపోసి యిటివ్వండి. నేను వెళ్ళి యిచ్చివస్తాను. ఈ లోపులో విస్తళ్లు అవీ వేసివుంచండి' అన్నాను.

వేడివేడి పాలగ్లాసు తీసుకొని విడిదిలోకి పరుగెత్తేను.

పాలు ముసలాయనకి చూపించి 'ఇదుగో పాలు తెచ్చాను, సరేనా? ఇక మీరంతా భోజనానికి లేవాలి మరి' అన్నాను. ముసలాయన భార్య ఆయనకేసి తనచేయి తీసేసింది.

'అయినా మామ్మగారూ? ఇంత వయ

సులో ఆలస్యంగా భోంచేస్తే ఆరోగ్యం పాడవదూ? మీరూకూడా ఇంత పట్టు దలయితే ఎలాగండి?' అన్నాను ఆవిడ్ని చూస్తూ.

'ఏదో నాయనా! ముందే నువ్వు వచ్చుంటే ఇంత గొడవ జరక్కపోను' అంది.

అందరూ భోజనానికి లేచారు.

'అన్నట్టు మామ్మగారూ? పాలు ఎవరి కివ్వాలో చెప్పండి, స్వయంగా నేనిస్తాను... మీరుమాత్రం భోజనానికి ఆలస్యం చేయ కండి మరి.' అన్నాను.

మామ్మగారు అటూఇటూ చూసింది. ఆడవాళ్ళు, మొగవాళ్ళు, పిల్లలు, పిల్లలూ పెళ్ళికొడుకు, చాలామందున్నారు. ఏమనిషో తెలీలేదు నాకు. ఆవిడా వెతుకుతూనే వుంది.

'ఎటుపోయిందది ఇది...వూఁ.' అని విసు క్కుంది.

'సరే, వెతుక్కుంటూ మీరు పదండి' అన్నాను.

ఆకలిమీద వున్నారేమో ఏవరికి వాళ్ళు పరుగెట్టారు. పిల్లల్ని అందరికంటె ముందు పరుగెట్టారు.

విడిదంతా ఖాళీ అయింది దాదాపు. పాలు ఎవరికివ్వాలబ్బా అనుకుంటూ ఆగదీ ఈ గదీ చూసేను.

పాలు చంటిపిల్లకయితే ఈపాటికి గుక్క పెట్టి ఏడుస్తూ వుండాలికదా, ఎవరూ ఏడవరేం?

దొడ్లోకి తొంగిచూసాను. నూతిదగ్గరగా చంటిపిల్లనెత్తుకొని నుంచున్నారెవరో ఆమెతో మా పిన్నికూతురు రెండోది మాట్లాడుతోంది.

దగ్గరగా వెళ్ళి 'ఏవండీ మీరేనా పాపకి పాలుకావాలందీ?' అన్నాను, గ్లాసు చేత్తో పట్టుకొని.

ఆమె వెనక్కి తిరిగి చూసింది.

ఒక్కసారే ఆశ్చర్యపోయి 'హా! నువ్వా!?' అన్నాను.

'ఆ! నీ గురించే అడుగుతున్నా' నవ్వి అంది మాధవి. నేను ఆశ్చర్యంలోంచి తేరు కోలేదు.

'ఏవిటలా ఆశ్చర్యపోతావు?' అంది మళ్ళా.

'బావున్నావా' అడిగాను.

'చూస్తున్నావుగా!'

'అయితే బాగానే వున్నావు ... ఈ పాప

మీ పాపేనా? నెంబర్ వన్నా, టూవా, త్రీయా?' అడిగాను.

'ఆపాపు! నెంబర్ వన్నే!' అంది నవ్వుతూ.

'మీ ఆయనేడీ?' అడిగా.

'రాలేదు. ఒక్కత్తినే వచ్చా!'

'చేతిలో ఏవిటా అది?' పిన్నికూతురు అడిగింది.

'పాలు, ఇక్కడెవరికో కావాలన్నా రటగా పాపకి,' అన్నాను.

'మళ్ళా ఎవరడిగారు?' మాధవి అంది.

'మళ్ళా ఎవరూ అడగలేదు. మొదట అడిగిందే... ఇప్పుడు తెస్తున్నా... దాన్ని గురించి మీ పెళ్ళికొడుకు వాళ్ళు ఎంత గొడవ చేశారనీ?...'

'గొడవేమిటి!?' ఆశ్చర్యంగా అడిగింది.

'హారి! నీకింకా తెలీలేదా?... ఎవరో చంటిపిల్లకి పాలు కావాలి ... కాస్త పాలు తెప్పించి యివ్వండీ అని అడిగారట. మా వాళ్ళు ఇవ్వలేదట— పనుల్లోపడి. దాంతో 'హాఁ ... మేం భోజనానికి రాం' అని కూర్చున్నారు. వాళ్లని బ్రతిమలాడి, నచ్చ జెప్పి భోజనానికి లేవదీసి పాలుపట్టుకొని వచ్చేను...'

మాధవి నవ్వింది. బాగా నవ్వింది. నాకు చాలా సంతోషంవేసింది—అలా నవ్వు తుంటే. మళ్ళా అలాంటి సమయం జీవి తంలో వస్తుందో రాదోగానీ, భలే హాయి అనిపించింది. మాధవి చంకలోని పాప పెద్దకళ్ళతో అటూ ఇటూ చూస్తోంది.

పిన్నికూతురు 'నవ్వి భలేవాడివిరా అన్నయ్యా! మాధవే పాలు అడిగింది. నే వెంటనే తెచ్చియిచ్చాను ... అసలు గొడ వెందుకు జరిగిందో...' అంది.

ఆశ్చర్యపోయాను. 'ఇంత గొడవెందుకు అయిందది మరి? పాలు అడిగింది నువ్వేనా... దీన్నే అడిగావా?' మాధవిని అడిగాను పిన్ని కూతుర్ని చూపించి.

'అవును పాలు తెస్తాను అని వెళ్ళింది. అయిదు నిముషాలవరకూ రాకపోతే నేను మా చిన్నత్తయ్యగారితో చెప్పి ఎవరినన్నా పంపించమన్నా. మరో రెండునిముషాలకే పాలు తెచ్చింది మీ చెల్లెలు' అంది

'సరే, పాలు అడిగావు, ఇదీ తెచ్చింది. బాగానే వుంది. కాని అక్కడ పాలు అడిగి నట్టు మీ వాళ్ళు, పంపలేకపోయ్యాం, పొరపాటయిందీ అని మా వాళ్ళు కాసేపు గొడవపడ్డారు ... మీకేం తెలీలేదుగావును' అన్నాను.

'ఉహూఁ—ఇద్దరం మాటల్లో పడ్డాం— అందునా నీ గురించి' నవ్వింది మాధవి.

అప్పుడే ముసలావిడ ఎవరో ఇటుకేసి వచ్చింది.

'ఇదో భోజనానికి వస్తున్నా, పదండి' అంది మాధవి వెళ్ళిపోతూ.

నేనూ అక్కడ్నుంచి కదిలి, పెళ్ళి పందిట్లో వడ్డన ప్రారంభించాను. హో రెండువరసల్లో ఆడవాళ్ళూ, రెండు వర సల్లో మొగాళ్ళు కూర్చున్నారు. మాధవి కూర్చున్న వరసలోకి వెళ్ళి వడ్డిద్దామను కున్నాగాని, మరీ బయటపడ్డట్టు అవు తుందేమోనని వూరుకున్నాను. మనసు మాధవివేపే లాగుతున్నావడ్డన కానిచ్చేశాను మిగతా వరసల్లో.

భోజనాలు ముగిసేసరికి మూడయింది మధ్యాహ్నం. మాధవి మా(పిన్ని)యింట్లోనే వుండిపోయింది, భోంచేసినతర్వాత. పెళ్ళి కొడుకు జనమంతా ముసలమ్మతోసహా విడిదికిచేరి గుర్రుపెట్టి పడుకున్నారు.

బయట ఎండ ఎక్కువగా వుంది. నాకు మహా అలసటగా వుంది. ఒక్కసారి ఉలిక్కి పడ్డాను. మా కేటు ఏవయినట్టు? గబ గబా రెండుమూడుగదులు చూసాను. వో గదిలో మంచంమీద పడుకొనివున్నాడు. ఆ మంచంమీదే మాధవి వాళ్ళ పాపని పడుకో బెట్టి నిద్రబుచ్చుతూ మా పిన్ని, చెల్లెళ్ళతో మాటాడుతోంది.

మాట్లాడ్డానికి ఇది సమయం కాదని వెనక్కితిరిగి వో మడతమంచంమీద ఒరిగాను.

అలా పడుకున్నానో లేదో పిళ్ళ టిలవ తెగ లేపేశారు. 'లేలే! నాలుగయింది. పెళ్ళి కొడుకు వాళ్లకి టిఫిన్ కాఫీ దగ్గరుండి చూడు. నువ్వయితే మాట రానివ్వవు' అన్నారు బాబాయి.

లేచి నూతిదగ్గరకెళ్ళి మొహం కడు క్కున్నాను. మొహం తుడుచుకోవడానికి లోపలికొచ్చాను. మాధవి టవలందించింది. (ఎవరూ చూడలేదు నయం) గభాల్న టవలందుకొని మొహం తుడుచు కున్నాను.

పాలన పోషణ సరిగా చెయ్యండి
పిల్లలకు బోర్న్‌విటా ఇవ్వండి!





చదువుల్లో ఆటల్లో హరింపు అయే శక్తిని పిల్లలకు తిరిగి సమకూర్చకపోతే వారి మానసిక శారీరక వికాసానికి ఆటంకం కలుగుతుంది. ప్రతి దినం వారు బోర్న్‌విటా త్రాగటం వలన పిల్లల శక్తి పెరుగుతూ ఉంటుంది. పుష్టికరమైన కోకో, పాలు, మాల్ట్ మరియు పంచదారలతో తయారైన బోర్న్‌విటా రుచికరమైనది.

శక్తి, ఉత్సాహం మరియు రుచికోసం క్యాడ్‌బరీస్ బోర్న్‌విటా!

నీకూ ఓ కథ వుందా?

పెళ్ళి తొమ్మిదింటికి. మండపం తయారు చేసి తీసుకొచ్చి పందిరికింద పెట్టారు.

అందరూ పందిరికింద కూర్చున్నారు. ముహూర్తంవేళ కావస్తోంది. అంతా ఉక్క పోసి విసుక్కుంటున్నారు. వెంటనే రెడీగా వున్న ఓ యాభై విసనకర్రలు పంచాను.

విసనకర్రలు వూగడం మొదలెట్టాయి స్పీడుగా. సన్నాయిమేళం స్థాయి నందు కుంది. మైకువాడు రికార్డులువేయడం ఎప్పుడో ఆపేసాడు— నేను చెప్పడం మూలాన.

ఆరంజిలాంటి డ్రింకు తయారు చేయించారు బాబాయి. పెళ్ళి జరుగుతుండగా అందరికీ గ్లాసులో్తుఇచ్చారు. ఎండాకాలం గిదా, గబగబా తాగేసారు ఇవ్వడంతోటే.

చిన్నపిల్లలంతా ఒకచోటజేరి విసనకర్రలతో ఆడుకోడం, కొందరు కొట్టు కోవడం మొదలెట్టారు.

సన్నాయి, మద్దెల... పురోహితులవారి మంత్రోచ్చారణా, పెళ్ళికొడుకూ, పెళ్ళి కూతురు పురోహితులవారు చెప్పినవన్నీ చేయడం చకచకా జరిగిపోతున్నాయి.

పురోహితులవారు దంపతులని అరుంధతీ నక్షత్రం చూడమన్నారు ఆకాశంకేసి చూపిస్తూ. అప్పుడే నేను మాధవికోసం చూసాను, కానీ కనపడ్లేదు.

భోజనాలు అయ్యాయి. టైం పదకొండు దాటింది. పెళ్ళికొడుకు జనాభా విడిదికి చేరారు.

మాలతి బాగా అలసిపోయింది గావును, వంటిదాన్ని పక్కలోవేసుకొని పడుకుంది.

నాకు భోజనం సయించలేదు. పిన్ని బాబాయి మిగతావాళ్ళు ఏవేవో సర్దు తున్నారు. బట్టలు మార్చుకుందామని నా సూటుకేసు అవి పెట్టిన గదిలోకెళ్ళాను. మా కేటు మంచంమీద పడుకొనివున్నాడు. వాడు సంధ్యాస్నాంనుంచి పడుకునేవున్నాడో లేక మధ్యలో లేచి మళ్ళా పడుకున్నాడో తెలీలేదు.

ఆ గదిలో మాధవివుంది! నన్ను చూడ గానే నవ్వింది. బట్టలు మార్చుకుందామని వెళ్ళినవాడ్ని మావాడు పడుకున్న మంచం మీద కూర్చుండిపోయాను. మాధవికింద చాపవేసుకొని తన తొడమీద వాళ్ళపాపని పడుకోబెట్టి నిద్రబుచ్చుతోంది.

'భోంచేయలేదుకదూ?' అడిగాను.

'లేదు...ఆకలేయలేదు!'

'నాకూ అంతే!' నవ్వాను.

'నిన్ను చూడగానే నా కడుపు నిండి పోయింది' అంది. ఆ మాటలో, తమాషా, బాధ, ప్రేమ వున్నాయని నాకు తెలుసు.

'ఇప్పుడెక్కడ? జంషెడ్‌పూర్‌లో వుంటున్నారటగా!' అన్నాను.

'అవును.'

'చాలా మారిపోయావు మాధవీ!'

'నువ్వూ మారావుగా!'

'ఏమిటా మార్పు?'

'నా మార్పేమిటో చెప్పు!'

'మనం విడిపోయిన బాధ నీకెక్కడా లేదనుకుంటా. నిజం చెప్పాలంటే ఇంతకు మునుపుకన్నా, నువ్వు అందంగా ఆరోగ్యంగా వున్నావు.'

'నువ్వూ అంతే! నేనూ అదే చెబుదా మనుకుంటున్నాను.'

'నీ పెళ్ళి నిశ్చయమైనరోజు... ఇద్దరం కళ్ళనీళ్ళు పెట్టుకున్నాం గుర్తుందా? దగ్గరిదానివి అయికూడా నిన్ను దగ్గరికి తీసుకొని నాదాన్నిగా చేసుకోలేకపోయాను. అప్పుడెంత పిరికో! ఒకవేళ నువ్వు మీ నాన్నతో నేను మా నాన్నతో మాట మాత్రం చెబితే మనపెళ్ళి జరిగేదేమో అనిపిస్తుంది ఇప్పుడు...'

'సరేలే! మనం అనుకున్నట్టు జరగ లేదు. ఇంకా అవన్నీ అనుకోడం దేనికి.'

'అందులోనే ఆనందంవుంది మాధవీ! నీ పెళ్ళిఅయినతర్వాత నాకు ఉద్యోగం వచ్చింది. తర్వాత పెళ్ళిచేసుకున్నాను. నువ్వురాలేదు నా పెళ్ళికి. అంతదూరం నుంచి రావాలన్నా కష్టమే అనుకో. మళ్ళా జీవితంలో ఎప్పుడు కలుస్తామో? ఏకాంతంగా మాట్లాడుకోగలుగుతామా అని పించేది.'

మాధవి వింటూ కూర్చుంది.

'చిన్నప్పుడు జ్ఞాపకముందా, నీకంటే నేను నాలుగేళ్ళు పెద్దయినా నువ్వేటువి అప్పుడు. 'కానిస్తే ముక్కానిస్తా' అనే దానివి. నేను నిజమేగావును అనుకొని 'కానీ' యిస్తే నువ్వు మూడుకానులు బదులు ముక్కానిచ్చేదానివి. పెరిగి పెద్ద యిన తర్వాతకూడా అడిగాను 'కానీకాదు, పదిరూపాయలిస్తే, ముక్కానిస్తావా' అని, 'అబ్బ! అర! పాపం' అనేదానివి. మధ్యలో నయాపైసలువచ్చి చెడగొట్టేసాయి కానీ, ఎప్పుడో ముక్కానిచ్చే జేసేవాడ్ని.'


మాధవి తలొంచుకుంది.

'ఏం మాధవి?'

మాధవి పలకలేదు.

చంటిపిల్లమీద కన్నీళ్ళు టపటపమని పడ్డాయి.

'మాధవి!' దిగ్గునలేచి దగ్గరి కెళ్ళాను,



'ఛ! ఏడుస్తున్నావా?' అన్నాను; ఏడుస్తోం దని తెలిసికూడా.

కొంగుతో కళ్ళనీళ్ళు తుడుచుకుంది.

'ఏడవకు మాధవి! నవ్వుతూ మాట్లాడు. మన జీవితంలో మళ్ళా యిలా కలుస్తామో లేదో, ఏదేనా మాట్లాడు మాధవి... వింటాను. అదే జీవితాంతం గుర్తుంచు కుంటాను...నీ పెళ్ళి నా పెళ్ళి అయింది. మీ ఆయన సంగతి నాకు తెలీదుగానీ, మాలతి చాలా మంచిది. మన స్నేహం గురించి, మన భగ్నహృదయాల గురించి నా పెళ్ళి అయింతర్వాత మర్చిపోయాను— అలా అన్నీ మరపింపజేసింది మాలతి, నిజం చెప్పాలంటే నువ్వూ అంతేకదూ?'

మాధవి నవ్వింది. 'పెళ్ళయితే అంతే... ఎవరి గొడవల్లో వాళ్ళు, ఎవరి సంసారాల్లో వాళ్ళు పడిపోతారు, సహజం. కానీ, ఎందుకనో నిన్ను చూడగానే పాతదంతా జ్ఞాపకమొచ్చి దుఃఖం వస్తోంది.' ఇప్పిన మాధవి కంఠం మళ్ళా మారింది.

'నాకూ అంతే! నువు ఒకరి భార్యవు. నేనొకరి భర్తను. ఇద్దరం ఈ గదిలో, నీ పాపతో, నా బాబుతో వున్నాం. చాలా గమ్మత్తుగావుంది కదూ? ఈ సమయం ఎందుకో నాకు చాలా విలువైందిగా కని పిస్తోంది ఇలాంటి అదృష్టం ఎంత మంది పాతస్నేహితులకి, పోనీ ప్రేమికులకి వస్తుందంటావు? నువ్వూ నేనూ పెళ్ళి చేసుకొని ఓ గదిలో మన పిల్లలతోవుంటే ఇలాంటి సమయం, విలువయినదనీ, అదృష్టమనీ అనుకునేవాళ్ళం కాదుకదూ?!

మాధవి అంది 'నీకొకటి చెప్పనా' ఒసారి మావారు అడిగారు, మాధవీ! నువ్వు ఎవరినైనా ప్రేమించావా ఇంతకుముందు అని.'

'ఏం చెప్పావు' ఆదుర్దాగా అడిగాను.

'లేదని చెప్పాను.'

ఎందుకో ఆ జవాబు నాకు బాధనిపించింది.

'ఆయన చాలా మంచివారు. ఒక్కటీ దాచరూ. తనూ ఓ అమ్మాయిని ప్రేమించారట...అంతా చెప్పారు'

'అలాంటప్పుడూ నువ్వూ చెప్పక పోయావా?' నవ్వాను.

'చెబుదామనుకున్నాగానీ, తీరా చెప్తే ఆయనకి అనుమానం, అసూయ పుట్టు

కొన్నే ? మగాళ్లని ఎవరు నమ్మేరు ?... అందుకని నాకు ప్రేమాగీమా అనేవి తెలియవన్నా.'

'సర్లే చెప్పకు !' అన్నాను.

'మావారిని చూస్తుంటే ప్రతివాళ్లకీ ఏదో కథ వుంటుందనిపిస్తోంది. ప్రతి ఒక్కళ్లూ ఎవర్నో ఒకర్ని ప్రేమించ

నీకూ ఓ కథ వుందా ?

డమో, దూరంగా వుండి ఆరాధించడమో చేస్తుంటారు. పెళ్లినాటికిముందే హృదయం ఎవరితోనో నిండిపోతుంది. నిజంగానో, వూహలతోనో. కానీ ఎవరూ అనుకున్న విధంగా ప్రేమించినవాళ్లని పెళ్లిచేసుకో

లేదు...' మాధవి చెప్తోంది:

అలా చాలాసేపు కూర్చుని మాట్లాడాం. మా పిన్నివాళ్లు గాబట్టి మమ్మల్ని అంతగా పట్టించుకోలేదు. ఎందుకంటే మాధవీ, నేను చిన్నప్పట్నించి కలిసివున్నామని తెలుసు.

పెళ్లి హడావుడి అయిపోయింది. మాధవి పెళ్లి అయినప్పుడు ఎంతబాధ పడ్డానో ఇప్పుడూ అంతే బాధపడ్డాను.

'అచ్చు నీ పోలికే !' అంటూ మా కేటుని ముద్దెట్టుకుంది మాధవి, వెళ్లే ముందు.

ఆ ప్రేమముద్దు నాకే అని తెలుసు.

సామానులు సర్దుకుని నేనూ మాలతీ పిల్లలోస్తే బెజవాడనుంచి బయలుదేరాం.

* * *

ఇంటికి చేరగానే ఆర్రాత్రి మాలతిని వున్నట్టుండి అడిగేను! 'మాలతీ! ఇంతకు మునుపు నువ్వు ఎవరినన్నా ప్రేమించేవా ?'

బిత్తరపోయింది మనిషి.

'ఏమిటండీ, ఏవిటిలా మాట్లాడు తున్నారు' అదోలా చూసింది మొహంలోకి.

'నిజమేను మాలతి! భయపడక. నిజం చెప్తే అతన్ని పిలిపిస్తాను— సరదాగా మాట్లాడుకోవచ్చు.'

మాలతి ఒక్కసారిగా ఏడ్చేసింది.

'మాలతీ! మాలతీ! ... ఎందుకేడుస్తున్నావు?' గడ్డం పట్టుకొని అడిగేను.

'లేపోతే ఏవిటండి యిదీ?...నాకేం తెలీదు..నేనెవర్నీ యింతకుముందు ప్రేమించ లేదు...నన్ను నమ్మండి' అంటూ గుండెల మీదపడి ఏడ్చింది.

'ఛ ! వూర్కో మాలతీ !'

'మరి అలా అడగననీ, అడిగి బాధ పెట్టననీ ఒట్టేయండి' అంది.

ఒట్టేశాను. మాలతి మొహంలోకి చూసాను.

'నన్ను నమ్మరా!' అంది గుండెలమీద వాలిపోయి మళ్లా. ఏడుపు ఆపలేదు.

మాధవి మాటలు గుర్తుకొచ్చేయి 'మగాళ్ళని ఎవరు నమ్మేరు...'

నిజమే. ఈ విశాలహృదయం కథ విననంతవరకే. విన్నతర్వాత ఈ హృదయం బ్రద్దలుకాకుండా విశాలంగా వుంటుందా?

ఏమైనా మాలతిని ఇంకెప్పుడూ అలా అడగకూడదనుకున్నాను. ●

పళ్లు—గుణాలు

మామిడి పండు

మామిడి పళ్ళలో దేశవాళీ మామిడి పళ్ళు అంటుమామిడి పళ్ళు అని రెండురకాలు. ఇక ఈ రెండు రకాలలోను మళ్ళీ అనేక రకాల మామిడిపళ్ళు ఉన్నాయి.

సాధారణంగా తియ్యగా పళ్ళగా వుండే మామిడి పళ్ళ రసం వేడిచేసి ఆర్చుతుంది. వాతాన్ని హరిస్తుంది. క్రొవ్వుని పెంచుతుంది. వీర్యానికి వేడినిచ్చి వీర్యవృద్ధి గావిస్తుంది. అరుచిని పోగొడుతుంది. కిడ్నీస్‌కు, హృదయానికి, మెదడుకి, రొమ్ముకి, మూత్రపు సంచికి బలాన్ని యిస్తుంది.

గుండెలోని వికారాన్ని, దగ్గుని, తలనొప్పిని, నీరసాన్ని పోగొడుతుంది. శరీరానికి మంచి బలాన్ని చేకూరుస్తుంది. పొట్టను మృదువు పరుస్తుంది.

పుల్లగా ఉండే మామిడిపళ్ళ రసం మిక్కిలి వేడి చేస్తుంది. శరీరానికి అంత మంచిదికాదు. అపథ్యమయినది.

మామిడిపళ్ళ రసం శరీరానికి ఎంత మేలు చేస్తుందో— అధికంగా తింటే అంత అపకారం కూడా చేస్తుంది. ఇదికాక పైత్యం చేస్తుంది. గురుత్వంగా ఉంటుంది. కడుపు బిగబడుతుంది. ఒక్కొక్కప్పుడు కడుపు పొంగవచ్చు. వాత పైత్యం, కామిల, పాండువు, ఆమరోగాలు, కఫోద్రేకం, వీనినికలుగజేస్తుంది. వాత శ్లేష్మతత్వాలు గలవారికి, ద్వంద్వ రోగులకు ఇది మిక్కిలి అపథ్యమయినది.

ఈ పండు యొక్క దుర్గుణాలకు విరుగుళ్లు :— 1. నెయ్యి 2. పాలు 3. శొంఠి 4.శొంఠి, పిప్పలి, మిరియాలు ఈ మూడింటి చూర్ణం. 5. ఉప్పు 6. మజ్జిగ 7. ఏలకి గింజల చూర్ణం 8. సైంధవలవణం.

మామిడి టెంక్ర వీర్యవృద్ధి, దేహపుష్టి, శక్తి నిస్తుంది. పైత్యాన్ని, శ్రమను, అరుచిని పోగొడుతుంది.

మూలవ్యాధి, విసర్పి, గ్రహణి, శ్వాస కాస, నేత్ర రోగం, వాతరోగం, రక్తపైత్యం ఈ రోగాలు కలవారు— రసమిశ్రితమైన ఔషధం సేవిస్తున్నవారు మామిడికాయ, దీనిపచ్చడి, ఊరగాయ తినడం మంచిదికాదు.

దానిమ్మపండు

తియ్యని దానిమ్మపండు మన శరీరానికి చాలా మేలు చేస్తుంది. ప్రతిదినం భోజనానంతరం ఒక దానిమ్మపండు తిన్నట్లయితే, తినిన పదార్థాలు బాగా జీర్ణమవుతాయి. ఈ పండు చలవచేసి నీరును పెంచుతుంది. మంచి దేహపుష్టినిస్తుంది. రక్తాన్ని వృద్ధి పొందిస్తుంది.ఉష్ణతత్వం గల వారి పుంస్త్వమును హెచ్చిస్తుంది. శరీరానికి మంచి కాంతి నిస్తుంది. హృదయానికి బలాన్ని యిస్తుంది. అరుచిని పోగొడుతుంది. మేహాన్ని వెడలగొడుతుంది. పైత్యశాంతి చేకూరుస్తుంది. రక్తగ్రహణి, గజ్జి గల వారికి మిక్కిలి పథ్యమయినది. పొట్టకు, గుండెకు బలాన్ని యిస్తుంది. గుండెలో గల వికారాన్ని నొప్పిని తగ్గిస్తుంది. దగ్గుని హరిస్తుంది. కంఠస్వరాన్ని బాగు చేసేటందుకు తోడ్పడుతుంది. అమితంగా తింటే వాతరోగం రావచ్చును.

తియ్య దానిమ్మపండు యొక్క దుర్గుణాలకు విరుగుళ్ళు :—1.పొగడ పండు 2. ఉష్ణ శరీరులకు పుల్లదానిమ్మపండు 3. చలవ శరీరులకు అల్లం మురబ్బా.

పుల్ల దానిమ్మపండు మొదట చలవచేసి ఆ తరువాత వేడి చేస్తుంది. పొత్తి కడుపుకు బలాన్ని యిస్తుంది. రక్తపైత్యాన్ని హరిస్తుంది. మేహశాంతి చేకూరుస్తుంది. రక్తాతిసారాన్ని పోగొడుతుంది. పుల్లని దానిమ్మ పండు ఉష్ణతత్వం గలవారికి అనుకూలమైనది. అధికంగా తింటే గుండెకు నష్టాన్ని కలుగజేస్తుంది. వీర్యనష్టం కలుగజేస్తుంది.

పుల్లదానిమ్మ పండు యొక్క దుర్గుణాలకు విరుగుళ్ళు:— 1. పొగడపండు 2. శొంఠి పొడి వేసిన తియ్యదానిమ్మపండు రసం.

సేకరణ: ఆకుండి నారాయణమూర్తి



చిన్నసైజు అబద్ధాలు— పెద్దసైజు చిక్కులు

కె. రామలక్ష్మి

నాకు తెలిసిన అనసూయ ఒకసారి చిన్న ఇరుకున చిక్కుకున్నది. కొత్తగా పెళ్ళయింది. భార్యాభర్తలు చదువుకున్న వాళ్ళు. సవ్యంగా కాలం సాగిపోతోంది. అలాంటప్పుడు అనుకోకుండా ఎమ్. ఏ. లో తన క్లాస్‌మేట్ ఒకడు బజారున కని పించడం, ఇద్దరూ కాఫీ తాగుతూ స్నేహితులను గురించి, చదువుకునే రోజుల గురించి బాతాకానీ కొట్టడం జరిగిపోయింది. ఇది జరిగిపోయిన నాలుగైదు వారాలలో ఓ రోజు "ఎవరితోనో కాఫీ తాగుతూ కన్పించావట?" అన్న ప్రశ్న భర్త నోటివెంట విని— ఏం చెప్పాలో ఆ క్షణంలో తోచక 'అబ్బే లేదే!' అనేసిందట. 'అవును నా క్లాస్‌మేట్ ఒకడు బజారో, కనిపించాడు, తాగుతూ కబుర్లు చెప్పుకున్నాం' అన్న సూటైన నిజం చెప్పేసిఉంటే ఎంతో బాగుండేది. 'అబ్బే, లేదే' అన్న చిన్న అబద్ధంతో భర్తగారు అనుమానాస్పదంగా చూడ్డం, వేసిన కప్పదాటు చాలదన్నట్టు ఆ రోజు యింకో స్నేహితురాలితో సినిమాకి వెళ్ళాననడం . . . యిలా యిలా తన అబద్ధాల పద్మవ్యూహంతో చిక్కుకుపోయి— అటు భర్తని నమ్మించలేక — ఇటు ఎలా బయట పడాలో తెలియక ఏడుస్తూ ఫోను చేసింది. నిజమే కాళ్ళకి వేస్తే చేతులకి, చేతులకి వేస్తే కాళ్ళకి చుట్టుపెట్టేసే యీ చిరు అబద్ధాలు— సగం నిజాల ఊబిలో చిక్కుకుంటే ఎంత యిబ్బందో అనుభవించిన ఎవరికేనా తెలుస్తుంది. మొట్టమొదటి అబద్ధంతో ప్రారంభం అయ్యే యీ ప్రోగ్రాం— ఎక్కడో ఒకచోట తెగ నరకడం ఉత్తమం. సహృదయంతో ఆడిన చిన్న అబద్ధమేనా— నిజంకాకపోడంవల్లనో— మూరిగే నక్క మీద తాటికాయలాగా కాలం కలిసి రానప్పుడు మీద పడుతుంది.

ఇలాంటి చిన్నసైజు అబద్ధాలు ఆడేటప్పుడు— అస్సలు మనం ఆలోచించం. మన మనస్సులో కూడా యిలా అబద్ధం ఆడుతున్నామే అన్న పీడన కూడా వుండదు — మనం సహృదయంతో ఎదుటివారిని బాధపెట్టడం యిష్టంలేక చెప్తూవుంటాం — యిలాంటివి.

కాని వచ్చిన చిక్కేమిటంటే— ఎప్పుడో ఒకప్పుడు, ఎక్కడో ఒకచోట యీ చిన్న అబద్ధాల ప్రవాహంలో పైవాళ్ళు కూడా చిక్కుకోక తప్పదు. ఉదాహరణకి, మనం చెప్పిన దానికి కొత్త కోణం ఆపాదించి మూడో నోట వింటుంటే— మనం ఎవరినైతే నొప్పించకూడదని అబద్ధం చెప్పామో— వాళ్లే మన ధోరణిని అపార్థం చేసుకుని విరుచుకు పడవచ్చు! మనం నవ్వు చెప్పినకొద్దీ— అపనమ్మకం పెరగవచ్చు. ఆఫ్టరాల్ నోసారి అబద్ధం ఆడిన మనిషి యిప్పుడు నిజం చెప్తున్నాడని ఏమిటి నమ్మకం?!

ఇష్టం లేకుంటే, 'యింట్లో లేనని చెప్పు' అని ఏ పసిపాపకో చెప్పేస్తాం. ఈసారి అవసరం అనుకుంటే ఆ పసిపాపే చెప్పేస్తుంది— ఆ చిన్న అబద్ధం. ఎవరో మనకి నవ్వని బహుమతి పంపిస్తే— దాన్ని ఆడిపోసుకుని— తీరా ఆ యిచ్చిన వ్యక్తి వస్తే తెగ పొగుడుతూంటే — మన పిల్లలు ఏమనుకుంటారు? చెప్పేది వేరూ చేసేది వేరూగా ఉండడం పెద్దవాళ్ళ లక్షణం అనుకోరా?

ఎటువంటి చిన్న అబద్ధానికైనా వీలై నంత దూరంగా ఉండడం మంచిది. విప త్కర పరిస్థితులలో ప్రాణం అడ్డేయ డానికీ, అడ్డేసుకోడానికి నేమోగాని లేకుంటే అబద్ధానికి ఆస్కారం యివ్వడం అర్థం లేనిపని. ప్రాణ స్నేహితుడు చావు బ్రతుకుల మధ్య ఉన్నాడని తెలిసినా— తీరా కోలుకున్నాక— 'వస్తావను కున్నానోయ్' అని మనం నిజంచెప్పి చంపక్కర లేదు. కొత్త రచయిత రచన చదివి ఏడిసినట్టుం దని ఒక్క వాక్యంలో చెప్పక్కరలేదు ... అంతేగాని వ్యక్తిగత జీవన పరిధిలో యిలా చిన్నసైజు అబద్ధాలు— దాటలేనిగోడలై హితుల మధ్య స్నేహితుల మధ్య నిలుస్తాయి. ... ప్రమాదం లేదుకదా అని అబద్ధాలాడే వాళ్ళు— అసలబద్ధాలకోర్ల కంటే—కూడా అన్యాయం అన్నమాట. ●

శిశిర సంగీతం

ఏకతారను మీటికొంచేవో, పాడు—
కొంచు, ఏకాకినై సాగనెంచునపుడె
బ్రతుకు సమరాన అలసితి బడలిపోతి
మూగనై పోతి, నిదురలో మునిగిపోతి.

రంగు రంగుల మాయ తెరలు తొలంగె
బ్రతుకు వాకిండ్ల చీకటుల్ పరచుకొనియె
ఈ నితాంత విషాదాబ్ధి నీదలేక
తనువు పాషాణమాయె చైతన్యముడిగి.

కనుల ముందొక మెఱపటుల్ కదలిపోయె
బాల్య జీవన మధుర స్వప్నముల వెల్లి
పోయె, ఆ కోయిలలకారు, పోయెనో, మనో—
జ్ఞ స్వాప్నిక కవితా వినోదమెల్ల.
శేషితమ్మీ విషాద శిశిర నిశిధి
కీచురాళ్ళాలపించు సంగీత మొండె.

— ఎ. లీలావతి

సీరియల్



విమలారామం

జరిగిన కథ

మాధవరావు ఆ వూళ్ళోకి స్కూలుమాస్టారిగా వచ్చాడు. ఎవరికో ఉపకారం చెయ్యబోతే అతను కుక్కకాటుకు గురి అయ్యాడు. రామ్మగారు అతన్ని యింటికి తీసుకువచ్చింది. అనురాధ తొలి చూపుల్లోనే అతన్ని ఆకర్షించింది. ఆమె తండ్రి అభిప్రాయం ప్రకారం అతను ఆ యింట్లోనే వుండిపోవలసి వచ్చింది. ఓ రోజున తూలుతూ వచ్చాడు మాధవరావు. అతనుకూడా తన తండ్రిలాగా తాగుబోతు అయినందుకు విచారించింది అనురాధ. అతనికి హితబోధ చేసింది. మాధవరావు తప్పు తెలుసుకున్నాడు. ఆతర్వాత అనురాధ అతనికి మరింత చేరువైపోయింది. ఆ తర్వాత అతనిదగ్గర చదువు కోవడం ఆరంభించింది. రంగరాజు కొడుకు స్కూలుకి ప్రెసిడెంటుగా నెగ్గాడని ఆమె చాలా బాధపడింది.

11

కొంతసేపు బరువెక్కిన హృదయాలతో అలాగునే కూర్చుండిపోయాము.

'పిచ్చితల్లీ! నీకే కన్నీళ్ళెందుకమ్మా! కష్టసుఖాలు కావడికుండలు. భగవంతుని సృష్టిలీలకు మనం తలవొగ్గవలసిందే!' నేను కొంతసేపటికి తేరుకున్నాను. అతను సంభాషణ మార్చేసాడు.

'ప్రెసిడెంటుగారీవేళ ప్రక్కావాయిద్యాల వాళ్ళకు కబురు పంపిసానన్నారట! ఇన్నాళ్ళకు వారికి మంచిభావాలు కలగటం ఆశ్చర్యంగా వుంది! ఏమయినా హర్షించ దగినది...'

'నాకు తెలుసులెండి ... మంచికోసం ఏదయినా చేస్తాముకాని—ఇంకొకరికి లొంగి కాదు కదా!' అన్నారు నాన్నగారు.

'అవును.'

నాకు వాళ్ళమాటలు వినేసరికి మతి పోయినట్లయింది. ఈ కచేరీ జరపటంలో ప్రెసిడెంటుగారి చెయ్యి ఉందన్నమాట! మనస్సులో భగ్గుమంది. 'ప్రెసిడెంటుగారు ప్రక్కావాయిద్యాల వాళ్ళకోసం కబురు పంపటమేమిటి నాన్నా?' అని అడిగాను.

నా కంఠంలోని ఆవేశం చూసి అతను తెల్లబోయాడు. కాని, నాన్నగారు శాంతం గానే అన్నారు. 'రిపబ్లిక్‌డే ఉత్సవాలు క్రొత్త ప్రెసిడెంటుగారు జరిపిస్తున్నారుటమ్మా! స్కూలుకి కొత్తబిల్డింగు శాంక్షను అయిం దిట ఎమ్. ఎల్. ఏ. గార్ని తీసుకువచ్చి ఆరోజునే శంకుస్థాపన చేయిస్తారుట. ఏదో ఊరికోసం మంచి చేస్తున్నాడు కదా అని...'

'నాకా విషయం ముందెందుకు చెప్ప లేదు? అతనికిందులో ప్రమేయముందని తెలిస్తే నేను సుతరామూ ఒప్పుకునేదాన్ని కాదు.'

'ఆవేశపడకమ్మా!...'

'నేనావేశపడుతున్నా నంటారేమిటి నాన్నా! అతడిదివరకు చేసిన అవమానం చాలక మళ్ళీ మన మిందుకు తలవొగ్గితే చులకనైపోమా?'

'మనం ఆ వ్యక్తిని కాదమ్మా గౌర వించేది అతను నిర్వహించే సంస్థని. ప్రజల మంచికోసం మనస్సుని సమాధాన పరచుకుంటున్నాము కాని అతనికి లొంగి కాదు.'

'మీరెంత చెప్పినా నాకెందుకో ఈ కచేరీ అంటే ఇష్టంలేదు నాన్నా! నన్ను క్షమించండి.'

'హెడ్మాష్టారి కిప్పుడే మాట యిచ్చి నన్ను తిరిగి పొమ్మంటావామ్మా!' నాన్న గారి కంఠంలోని ఆర్ద్రతకు తట్టుకోలేక పోయాను. కాని, రాజారావు ముఖం కళ్ళ ముందు ప్రత్యక్షమై నన్ను మొండిదాన్ని చేసింది.

'హెడ్మాష్టారికి నా పరిస్థితి చెప్పండి నాన్నా! ఆయనకోసం కావాలంటే ఆయన యింటికి వెళ్ళి రోజంతా వీణకచేరీ చెయ్య మంటే చేస్తాను. కాని, ఆ నీచుడెదురుగా క్షణంకూడ కూర్చోలేను...'

నాన్నగారు మాట్లాడలేదు. ఆయనలా దిగాలుపడిపోయి వుండటం నాకు బాధగా ఉంది అయినా ఈ విషయంలో ఓటమి నంగీకరించలేకపోయాను.

'ఇప్పుడు నేనేం చేయను?...' తనలో అనుకున్నట్లుగా అన్నారు నాన్నగారు.

'రాధా! నేనొకమాట చెపుతా వింటావా?' అన్నాడతను.

ముఖంలోకి ప్రసన్నతను తెచ్చుకొని, 'చెప్పండి ఈ విషయం మాత్రం వద్దు' అన్నాను.

అతను నవ్వి, 'షరతులు తర్వాత పెడుదువుగానిలే! ముందొక మాట చెప్పు. ఫలపుష్పాలతో కళకళలాడుతున్న తోట లోకి నువ్వు అడుగు పెట్టావనుకో, ఏక్కడో పడి ఉన్న చిన్న తుమ్మ ముల్లు

గాలి కెగిరివచ్చి నీ దారిలో పడివుంటే ఆనందపారవశ్యంలో అది నువ్వు గుర్తించక అడుగువేసినప్పుడు నీ కాలికి గుచ్చుకుందనుకో! ఆ ముల్లు మీద కోపంచేత ఆ తోటలోకి ఇక అడుగుపెట్టనని నీవనటం బాగుంటుందా చెప్పు!' అన్నాడు.

'ఈ విషయం వేరు.'

'కాదు రాధా! సరిగ్గా అటువంటిదే ఇది. ఓటమికాదు మనకు ముఖ్యం—అనేకమందికి నీవిచ్చే ఆనందం.'

ఇంతలో ఎవరో మందుకోసం వచ్చారు. నాన్నగారు లేస్తూ, 'మాస్టారూ! మా అమ్మడిని ఎలాగో మీరే ఒప్పించాలి. నా గౌరవం కాపాడండి.' అంటూ డిస్పెన్సరీ గదికి వెళ్ళిపోయారు.

'విన్నావా రాధా ఆయన మాటలు! తండ్రినిలా బాధ పెట్టటం బాగుందా నీకు?'

నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. 'మీ అందరికీ నా మనస్సు ముఖ్యం కాదు. గౌరవమే ముఖ్యం!'

అతను నా దగ్గరగా కుర్చీ నీడ్చుకొని నా ముఖాన్ని తనవైపు త్రిప్పుకొని, 'నా కళ్ళల్లోకి చూసి ఆ మాట అనాలనిపిస్తే అను రాధా! స్థిమితంగా నా మాటలాలోచించు. అప్పటికీ నీకిష్టం లేకపోతే—నేనే స్వయంగా హెడ్మాష్టారి దగ్గరకి వెళ్ళి క్షమాపణ చెప్పుకుంటాను' అన్నాడు.

నేను పిచ్చిగా అతని కళ్ళల్లోకి చూసాను. 'మాస్టారూ!...' నా పెదవులు కంపించాయి.

అతను గబుక్కున నా కన్నీళ్ళు తుడిచి అన్నాడు. 'నీవింత బేలవైతే ఎలా అనూ!.. లోకాన్ని అన్ని కోణాలలోంచి అర్థం చేసుకోవటం లేదు నువ్వు. ఒకవేళ అతనే నీదగ్గరకి వచ్చి అడిగితే నీవు నిరాకరించకుండా అంగీకరించటమే నీ గొప్పతనాన్ని చాటుతుంది తెలుసా!'

'మీ కతనెటువంటివాడో తెలియదు కనుక అలా అంటున్నారు.'

'అతనెటువంటి వాడయినా మగవాడు' అన్నాడు అతను నవ్వుతూ.

'అంటే !'

'నిన్ను చూసిన యువహృదయం నీపై మక్కువ పెంచుకోవటం తప్పుకాదు.'

నా ముఖం ఎర్రనయ్యేలా నవ్వాడతను. '...చెట్టునున్న పండు నోరూరిస్తుంది. నోరూరించే గుణం ఆ పండుకి ఉంది కనుకనే నోరున్నవాడికి నోరూరుతుంది. మరి అది అతని తప్పనటం భావ్యమా చెప్పు.'

'అబ్బ, మాట మార్చేసి ఏమిటి పరిహాసాలు!'

'నిజాలుకూడ ఒక్కోసారి పరిహాసంగా



ఉంటాయి అనూ! అందుకనే, అతను నిన్ను ఆశించటంలో అతనిదేం తప్పులేదు. ఇక ఒప్పుకోవటం ... ఒప్పుకోకపోవటం నీ ఇష్టంపై ఆధారపడి వుంటుంది.'

'ఏమిటి మీరతని తరఫున మాట్లాడుతున్నారీవేళ!'

'మగవాని హృదయం తెలిసిన మగవాని మాటలివి రాధా! ఒక పురుషునిమీద అసహ్యంతో అతనిలోని మంచి అనేది గుర్తించటానికి ప్రయత్నించకపోవటం ఆ స్త్రీ అహంకారాన్ని తెలుపుతుంది. నీవహంకారివి కావటం నా కిష్టంలేదు. నీలోని సహృదయం ఏవ్వరిమీదయినా వెన్నెల కురిపించాలి కాని ఏ ఒక్కరిమీద వడగాడ్పును విరజిమ్మకూడదు రాధా!'

'మీ మాటలతో నన్ను కట్టేస్తున్నారు.'

'లేదు అనూ! నన్నర్థం చేసుకోమనే చెప్తున్నాను. ఏ ఫలితాన్ని అతను ఆశించినా ఈ ఉత్సవాలవల్ల ప్రజలకు మంచే జరగుతోంది. నీవు కచేరీ చేయకపోయినా జరిగేది ఎలానూ జరుగుతుంది. కాని, ఒక మంచి ప్రయత్నంలో నలుగుర్ని సంతోషపెట్టేది చేయటం మనకు మంచినే తెస్తుంది కాని చిన్నతనాన్ని కాదు. మీ నాన్నగారి గౌరవం నిలబెట్టినదానవవుతావు. హెడ్మాష్టారికి తన కుమార్తె స్మృతిలో ఓదార్పును కల్గించగలుగుతావు. అంతమంది ప్రజలకు వీనుల విందు చేయగలుగుతావు ... అందరి నానందింపజేయగల్గిన నీవు నా అనూవి అయినప్పుడు నాకెంత ఆనందంగా ఉంటుందో తెలుసా!'

ఇంకేం మాట్లాడను! మూగదాన్నిచేసిన మాధవుడు అవమానాలనుండి రాధ హృదయాన్నిలాగునే మరపించాడేమో!

* * *

ముక్కనుమ పండుగ వెళ్ళిన మరునాడే వాయిద్యాలవాళ్ళు వచ్చారు. వీణ సాధన మొదలయింది. చిన్నప్పుడు అమ్మ కచ్చేరీ చేసినప్పుడు మృదంగం వాయించిన రంగదాసు కూడ వచ్చాడు. ఆయన సూచనల ననుసరించి సాధన ప్రారంభించాను. మొదటి రోజు కొంచెం లయ తప్పినా రెండోరోజుకి విపంచికా విన్యాసము విశక్తమయింది. పలువురిని పరవశింపజేయగలనన్న ఆత్మవిశ్వాసం కలిగింది.

రిపబ్లిక్ డే దినోత్సవం ప్రారంభమయింది. ప్రెసిడెంటుగారి కారు వచ్చింది. కుటుంబ సమేతంగా శారదాపాణినై హైస్కూల్లో అడుగుపెట్టాను.

హైస్కూలు గ్రౌండ్‌లో అడుగుపెట్టేసరికి గుండెలు దడ దడలాడాయి. మూడేళ్ళ క్రితం అసహ్యంతో అవమానంతో వదలిపెట్టిన చోటుకి ఈనాడు కొని తెచ్చుకున్న ఆనందంతో, ఘనతతో తిరిగి వచ్చాను. ఇటువంటి విచిత్ర సంఘటన నా జీవితంలో సంభవిస్తుందని నేనెప్పుడూ ఊహించలేదు.

స్టేజికి ప్రక్కగా అతిథుల కేర్పరచిన స్థలంలో మేమంతా కూర్చున్నాము. నేను క్రీగంట వేదికలని పరికిస్తున్నానే కాని తీవిగా అటు ఇటు తిరుగుతూ అందరికీ పనులు పురమాయిస్తున్న రాజారావుని చూసినప్పుడల్లా మనస్సులో ముల్లు గుచ్చుకున్నట్లనిపిస్తోంది. అతని చిరునవ్వులు వెగటుగా ఉన్నాయి.

మనస్సులోని ఆలోచనల్ని మరలించాలని త్రివర్ణ పతాకం వైపు దృష్టి మరలించాను. స్టేజిమీద అలంకరించిన ఫోటోలో బాపూ బోసినవ్వులు శాంతిని ప్రసాదిస్తున్నాయి. మైక్‌లో స్వాతంత్ర్యగీతం వినిపించి ఒడలు పులకెత్తింది.

ఎమ్. ఎల్. ఏ. గారు వచ్చారు. క్రొత్త భవనానికి శంకుస్థాపన పూర్తయింది. వచ్చీరాని ఇంగ్లీషు ముక్కలు నాలుగు జోడించి ఆయన గ్రామానికి చేయబోయే సేవ గురించి ఉద్ఘాటించారు. క్రొత్త ప్రెసిడెంటుగారు కంఠం సవరించుకొని ఎమ్.ఎల్.ఏ. గారిని పొగడుతూ ఏదో చెప్పబోయారు. ఆడపిల్ల దగ్గర బిరాలు పలికే ఆ మహానుభావునికి తెలుగు నిఘంటువులోని పదాలు సమయానికి గుర్తు రాలేదు కాబోలు!

అయితేనేం, తెలివితేటలు కలవాడు కనుక, 'ఈ ఆనందరంలో ఏం చెప్పాలో ఎలా చెప్పాలో తెలియటంలేద'ని శలవు తీసుకొని టకీమని తన కుర్చీలో కూలబడ్డాడు. అదే పదివేలు!

తర్వాత హెడ్మాష్టరు స్కూలు పరిస్థితిని వివరిస్తూ నాల్గు మాటలు చెప్పి, '...యువకుడు, అందరి శ్రేయోభిలాషి చిరంజీవి మాధవరావు నాల్గు మాటలు చెప్పబోతున్నాడు. దయయుంచి అందరూ వినగోరతాను.' అని ముగించారు.

అతని ఉపన్యాసం ఎలా ఉంటుందో ఎప్పుడూ వినని నేను చెవులు రిక్కించుకని వినసాగాను. మైక్ ముందు అతని కంఠంలో ఎంతో గంభీరత, సమపాళ్లలో ఆవేశం మిళితమయ్యాయి.

స్త్రీ విద్య, వయోజన విద్య, విద్యార్థులలో క్రమశిక్షణ, గ్రామ పునరుద్ధరణ, సేవాదళము...అతను చర్చించని విషయము లేనట్లుగా అన్నిటి గురించి ఉపన్యసించాడు. ప్రస్తుతము ఈ సంస్కరణలరూపం ఎలా వున్నది, లోపము ఎక్కడున్నది, ఎట్లా సవరణలు చేసుకోవల్సినది అతను అనర్గళంగా విపులీకరించాడు. అంత వాక్ప్రవాహము అతనిలో ఉందని నాకెప్పుడూ తెలియదు. సభలో చీమ చిటుక్కుమన్న శబ్దము లేకుండా అంతా స్థాణువుల్లా కూర్చుని వినసాగారు.

అతను ఉపన్యాసం ముగించేసరికి అందరూ కరతాళధ్వనులు చేసారు. ఆ ఆనందాన్ని భరించలేని అసూయాపరుడు రాజారావు ముఖం మాడ్చుకోవటం నా దృష్టిలో పడింది. కసితోకూడిన ఉన్మాదంలో అందరితోపాటు నేను కూడ చప్పట్లు కొట్టాను.

హైస్కూలు సెక్రటరీ కార్యక్రమంలో ఆఖరి భాగంగా 'మన స్కూలు ఓల్డు స్టూడెంటు అనూరాధాదేవిగారు వీణాగానం చేస్తారు' అని ప్రకటించాడు.

వేదికమీదనున్న కుర్చీలన్నీ క్రిందవరసకు దిగిపోయాయి. ప్రముఖ వ్యక్తులంతా ముందర వరసలో ఆసీనులయ్యారు. మృదంగకులతో నేను వేదిక నెక్కాను. విద్యుద్దీపాల కాంతులలో మైక్ ముందు కూర్చున్న నాకు ముచ్చెమటలు పోసాయి. అంతమంది ఎదుట జ్ఞానం తెలిసాక ఇంతవరకు పాడి ఎరుగని నాకు అంతరాలలో ఏదో భయం కల్గింది.

అయోమయంగా ప్రక్కగా చూసాను. అతను వేదిక ప్రక్కగా నిలబడి నావైపే తదేకంగా చూస్తున్నాడు నా చూపులకు అతని ముఖంలో దరహాస చంద్రిక లుదయించాయి.

శారదను చేతుల్లోకి తీసుకున్నాను. రంగదాసు సూచన నందుకున్నాను. వీణ మెట్లపై నా చేతి వేళ్ళు పరుగులెత్తాయి. క్రమంగా నా ఎదుటనున్న వ్యక్తుల చూపులు మాయమయినాయి. అనంత

మయిన గాన ప్రవంతిలో లీనమై పోయాను. పరిసరాల స్మృతి కోల్పోయాను. అంతర్గతమైన ఉత్సాహం కంఠంలో గాన స్రవంతిని పొంగించింది. ఆ స్పందనతో తనువెల్లా పులకరించింది. అవలీలగా చేతి వేళ్ళు వీణ మెట్లపై నర్తించాయి. పక్కవాయిద్యాలతో కచేరీ రక్తి కట్టింది.

గణపతి ప్రార్థన పూర్తయ్యేసరికి సభాస్థలిలో కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి. అతని అభినందన దృక్కులతో మరింత శక్తిని పుంజుకున్నాను. అదే సమయంలో ముందు వరుసలో నావైపు అతనివైపు చూపులు మార్చి మార్చి చూస్తున్న రాజారావు కనిపించాడు. నాకు నవ్వు వచ్చింది!

ఆ ఉత్సాహంలో తిరిగి వీణాతంత్రులు పలికించాను. అలా వో గంటసేపు వీణాగానం నిర్విరామంగా సాగింది. స్వేదబిందువులతో ఒళ్ళు తడిసి గిలిగింతలు పెట్టినట్లుగా ఉంది. వేడి వేడి కాఫీలు అందించారు కార్యకర్తలు. ఆ తర్వాత మళ్ళీ వీణాగానం మొదలయింది.

అప్పటికి సభాపిరికితనం పోయి అంతమందిని ఆనందింపజేస్తున్నానన్న సంతృప్తితో గానం చేయసాగాను.

గాయనికి ప్రోత్సాహం ఉంటే ఇతరులను ఆనందింపజేయాలన్న కోరిక కలుగుతుంది. ఆనందింపచేసిన తృప్తితో శ్రోతలను రంజింపజేసి మెప్పును పొందాలన్న ఆశ కలుగుతుంది. ఈ ఆశ మహోన్నతమైనది.

శ్రోతల కోరికమీద అనుకున్నదాని కంటే అరగంటసేపు అధికంగా గానం చేసాను. వేదిక దిగబోతున్న సమయంలో హైస్కూలు సెక్రటరీ వచ్చి, 'అనూరాధా దేవికి మా విద్యార్థుల తరపున ఈ రాధాకృష్ణుల ప్రతిమను బహుమతి ఇస్తున్నాను' అన్నాడు.

'మీ అందరి అభిమానానికి కృతజ్ఞురాల్ని' అని అ ప్రతిమ నందుకున్నాను. అతని చూపుల నెదుర్కొన్న నాకు సిగ్గు ముంచుకొచ్చింది.

ఇంతలో హెడ్మాష్టారు దగ్గరగా వచ్చి, 'నిన్నెలా సత్కరించాలో నాకు తెలియక పోయినా నాకు తోచిన కానుక ఇవ్వాలనిపించింది ... తల్లీ! ఈ పదిరూపాయలు తీసుకో!' అన్నారు.

'కానుకలు నాకెందుకు మాష్టారూ! మీ ఆశీర్వచనాలు చాలవా?...' అన్నాను.

నా మాటలు పూర్తవకుండానే మైక్ ముందు సెక్రటరీ కంఠం మ్రోగింది. 'సోదరులారా! మన స్కూలు గౌరవప్రతిష్ఠలకు పాటుపడిన అనూరాధాదేవిని సత్కరించటానికి ప్రతి ఒక్కరు తమకు తోచిన విధంగా ముందుకు రమ్మని నా కోరిక...'

నేనలా ఉత్తేజితురాలిగా నిలబడిపోయాను; ప్రతిష్టకొద్దీ రంగరాజుగారు నిభయిరూపాయలు పంపారు. కామేశంగారు, కరణంగారు, ఎమ్. ఎల్. ఏ. గారు ఒకరి తరువాత ఇంకొకరు తమకు తోచిన సొమ్ము అందజేశారు. ఎవరెవరు ఎంత ఇస్తున్నదీ సెక్రటరీ చదువుతుంటే ఒక విద్యార్థి అందుకొని హెడ్మాష్టారికి అందిస్తున్నాడు. అలా అరగంటపైన కానుకల వర్షం కురిసింది. నా గానంతో శ్రోతల్ని రంజింపజేయాలని ఆశించాను కాని ఇలా నన్ను లజ్జాభరితురాల్ని చేస్తుందనుకోలేదు. పరవళ్ళు త్రొక్కే ఆనందోద్వేగంతో అలా వేదికపై చిత్తరువులా నిలబడిపోయాను. అతని చూపుల్లో ఆనంద ద్యుతులు వెలుగుతున్నాయి.

ఈలోపల ఒక పళ్ళెంతో క్రిందకు వెళ్ళి చిన్నచిన్న కానుకలు ప్రోగుచేసుకు వచ్చారు నలుగురు విద్యార్థులు. అంతా హెడ్మాష్టారిముందు పళ్ళెంలో గుమ్మరించారు. నోట్లతో నిండిన పళ్ళాన్ని తీసుకొని మైక్ దగ్గరగా వచ్చిన హెడ్మాష్టారి కంఠం బొంగురుపోయింది. 'సభాసదులారా! ఈ చిరంజీవి అమృతగానం విన్నాక తిరిగి నాకు పునర్జన్మ ఎత్తినట్లుగా వుంది. చచ్చి స్వర్గాన వున్న నా కుమార్తె తిరిగి వచ్చినట్లు సంతృప్తుడనయ్యాను. ఈ ఆనందాన్ని దక్కించిన ఈబిడ్డకు ఏవిధమైన సత్కారముచేయలేని నా అసమర్థతను మీరంతా గుర్తించి కొంతవరకు నా ప్రయత్నాన్ని సఫలీకృతం చేసారు. అందుకు మీకందరకీ కృతజ్ఞుడిని......'

...'అమ్మా! రాధమ్మా! నీ విలువకు తగిన కానుకను మేమంతా ఇవ్వలేకపోయినా అందరి సంతోషంకోసం ఈ కానుకను అందుకో తల్లీ!' అని నాచేతి కా పళ్ళాన్ని అందించారు.

అప్పటికే అంతర్గతంగా ఒక నిశ్చయానికి వచ్చిన నేను ఒక్క క్షణంపాటు ఆ సొమ్మువైపు చూసాను. బహుశా పదారువందలు ఉండవచ్చు.

మైక్ ముందుకు నేను రావటంచూసి అంతా ఆతృతగా నావైపు చూస్తున్నారు. లజ్జాభారంతో కళ్ళు దించుకొని నెమ్మదిగా మనస్సులోని మాట చెప్పాను. 'మీ అందరి అభిమానానికి నాకెంతో ఆనందంగా ఉంది ఈ కానుకలకంటె మిమ్మల్ని ఆనందింపజేయటం నా అదృష్టం. అందుకున్న కానుకను సద్వినియోగపర్చవల్సిన బాధ్యత నాపై ఉన్నది. రివర్వ్ కోడే ఉత్సవ సందర్భంలో మన స్కూలు నిర్మాణానికి ఏర్పాట్లు జరిగినా... స్కూల్లో చదువుకునే తెలివైన బీద విద్యార్థులకు చేయవల్సిన ఆర్థిక సహాయం విషయం మనం మర్చిపోకూడదు. ఈ ధనాన్ని పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్పుగా వినియోగించమని హెడ్మాష్టారిని కోరుతూ ఇది వారికే అందజేస్తున్నాను...' అని ఆ పళ్ళాన్ని హెడ్మాష్టారి చేతుల్లో పెట్టాను. ఆయన ఆత్యాశ్చర్యంతో అలా నిలబడిపోయి నా వైపు చూస్తున్నారు.

'మీ కుమార్తె స్మృతితో మీరిచ్చిన కానుకను మాత్రం నేను తీసుకున్నాను మాస్టారూ! ... మీ ఆశీర్వాదం కన్న నాకింకేమి కానుక లక్కర్లేదు...' అని ఆయనకు నమస్కరించాను.

'డాక్టరు రాజశేఖరంగారు ధన్యులు...' హెడ్మాష్టారి కంఠం గాద్గదికమైంది.

నాన్నగారి వెనుకగా నేను నిలబడ్డా అంతా ఆయన్ని పొగడ్తలతో ఉబ్బితబ్బిబ్బు చేస్తుంటే లజ్జాభారంతో అవనత శిరస్కనైపోయాను. నాన్నగారంత ఆనందంగా ఉండటం నేనెప్పుడూ చూడలేదు!

రాజారావు నవ్వుతూ దగ్గరగా వచ్చి, 'నీకో మంచి కానుక ఇవ్వాలని వుంది రాధా!... కాని, ఇప్పుడు చేతిలో డబ్బు తప్ప మరేమీ లేదు. సరే, ప్రస్తుతానికిది తీసుకొని నన్ను ఆనందింపజేయి' అంట్నా

ఒక వందరూపాయలనోటు నా చేతుల్లో కూరాడు.

అతని చొరవను త్రిప్పికొట్టాలన్న ఆవేశం పొంగింది. తిరస్కరించటంలో అర్థం లేదు. ఏం చేయను ? ప్రక్కగా నిలబడిన రంగదాసును చూసేసరికి నాకు చటుక్కున ఒక విషయం గుర్తుకు వచ్చింది. చిరునవ్వు తెచ్చుకుంటూ, 'సమయానికి అందజేసారు. ఈ సత్కారంలో నా భాగస్తుల విషయం మర్చిపోయినందుకు బాధపడుతున్నాను. నా గౌరవం నిలబెట్టారు... రంగదాసుగారూ! మీరంతా ఇది తీసుకొని నన్ను ఆశీర్వదించండి...' అని ఆ వందరూపాయలనోటు రంగదాసు చేతుల్లో పెట్టాను. అతడు 'కళ్యాణ ప్రాప్తిరస్తు!' అని దీవించి అమ్మను తలుచుకొని కంట తడిపెట్టాడు.

రాజారావు ముఖం వెలవెలబోయింది, పేలవంగా నవ్వి నెమ్మదిగా జారుకున్నాడు. విధము చెడినా ఫలం దక్కినందుకు నాకు ఎంతైనా ఆనందమయింది...

ఆ రాత్రి ఇంటికి వచ్చాక అతనన్నాడు, 'నీ త్యాగశీలత ముందు నా ఆంతర్యం తలవంచుకుంటోంది అనూ!'

అతని పెదవుల్ని నా చేతివ్రేళ్ళు అడ్డుకున్నాయి. 'ఇంకెప్పుడూ అలా అనకండి. ఏ విషయంలోను మీకంటె అధికురాల్ని కాలేను. ఏ ఆధిక్యత కలిగినా అది రాధ హృదయాన్ని జయించుకున్న మాధవునిదే!'

'ఇంతకుమించిన వరం దేవుడు నాకింకేమివ్వగలడు ?' అతని మధురమైన స్పర్శలో నా మనోకుసుమం విచ్చుకుంది!

* *

మాధవి పెళ్ళి ముహూర్తం నిశ్చయమైంది. పెళ్ళి వారంలోజులుందనగా కాలేజీకి సెలవుపెట్టి వచ్చింది మాధవి.

శేషమాంబగారికి క్షణం తీరిక లేదు. బామ్మ దాదాపు రోజంతా అక్కడే గడిపేస్తోంది.

'ఈ నాల్గురోజులూ మీరంతా ఇక్కడికి వచ్చెయ్యండి రాధా,' అన్నారావిడ.

'ఎంతదూరమని? కావాలన్నప్పుడు నేను వస్తూనే ఉంటానుగా!' అన్నాను.

ఇక నాన్నగారి హడావిడికి అంతేలేదు. 'ఇంతకీ రాఘవరావుగారి కూతురి పెళ్ళా! లేక రాజశేఖరంగారి కూతురి పెళ్ళా...' అని ఎవరో ఛలోక్తి విసిరారు కూడా.

'వారి స్నేహం అటువంటిది! వారి శరీరాలు వేరు కాని వారి మనస్సులు ఒక్కటే!' అని సమర్థించారు ఇంకొకరు.

నాన్నగారు తనమాట పట్టించుకోకుండ తాగుడు కలవాటుపడి ఆరోగ్యం పాడుచేసుకుంటున్నారని గతంలో రాఘవరావుగారికి కోపంగా ఉండేది. అందువల్లనే ఆంతర్యంలో ఎలాఉన్నా వ్యక్తిగతంగా నాన్నగారికి దూరం కావటం జరిగింది. కాని, తర్వాత విషయం తెలుసుకొని క్రమేపీ దగ్గరయ్యారు. నాన్నగారెలా మారింది ఆయన అడగలేదు. ఈయన చెప్పలేదు. తిరిగి తామిద్దరూ దగ్గర కావటమే ఇద్దరికీ కావల్సింది. వారి కోరిక నెరవేరింది.

పెళ్ళి ఏర్పాట్లకి మరి నాన్నగారంత బాధ్యత తీసుకున్నారంటే ఆశ్చర్యమేముంది ?

ఇంటికి పెద్దకొడుకులా అతను ఏర్పాట్లు చేస్తుంటే రాఘవరావుగారి ఆనందానికి అవధి లేకపోయింది. మాధవి 'అన్నయ్యా!' అని పిలుస్తూ తిరుగుతూ ఉంటే అతని ముఖంలో వెలిగే ఆనందానికి నేను పరవశించి పోయాను.

మాధవి ప్రవర్తనమీద నా అనుమానాలు పటాపంచలయ్యాయి. ఆమె జీవితంతో రాజీపడింది. పెళ్ళికుమార్తెగా నునుసిగ్గులు రంగరించి పోసుకుంది. నాకు అన్నిటికన్న ఆనందం కల్గించినదీ విషయం!


ఆమె కాలేజీ స్నేహితులు నలుగురు పెళ్ళికి వచ్చారు. కావల్సినంత హడావిడి చేసారు. నేను బ్రతిమాలినా వినకుండా నా గురించి వాళ్ళకు చెప్పింది మాధవి. అక్కడినుంచి వాళ్ళు నన్ను పాటలు పాడమని వేపించుకు తిన్నారు.

'...ఒక మహాగాయని ఇలా అజ్ఞాతవాసం చేయటం అన్యాయం...' అని ఒకామె అన్నది.

'సంగీత నాటక కళా వికాడమి వాళ్ళకు పట్నవాసాల విషయమే కాని పల్లెటూళ్ళు ఉన్నాయని—అక్కడ సంగీతానికి చెట్లు చిగిరిస్తాయని బొత్తిగా తెలియదు. షేమ్! షేమ్...' అని మరొకామె—

'...ఈ వూరి వాళ్ళకు మాత్రం బుద్ధుందా...ఒక గాయనిని గౌరవించాలని తెలియద్దూ...' అని మరొకామె—

'...మీరంతా దయయుంచి శాంతించండి. నేను మీరనుకొన్నంత మహాగాయనిని కాను. నాకు సన్మానాలపైన, సత్కారాల మీద ఆశలేదు. నా ఆనందంకోసం నేను పాడుకుంటాను. ఆ పాటవిని ఇతరులు ఆందిస్తానంటే నా కభ్యంతరం లేదు... మీరంతా ఇలా మాట్లాడేస్తుంటే నాకేమిటో సిగ్గుగా ఉంది...' నా మాటలకు వాళ్ళొకరి ముఖా లింకొకరు చూసుకున్నారు. వాళ్ళు నోరువిప్పేలోగానే అక్కడినుంచి జారుకున్నాను.



అయినా పెళ్ళిలో నా గానకచేరీ తిలామా తప్పలేదు...వాళ్ళ మళ్ళీ పొగడ్తలతో నన్నుమొగ్గను చేయటమూతప్పలేదు.

ఏ ఆటంకాలు, లోటుపాట్లు లేకుండా మాధవి పెళ్ళి జరిగిపోయింది. మాధవీ శ్రీనివాసరావులకు ఈడు జోడు కుదిరింది.

పెళ్ళి జరుగుతున్నంతసేపూ నా చూపులు అతని చూపుల నెదుర్కొని సిగ్గుతో వెనుతిరిగి పోయాయి. ఊహాలోకంలో మాధవీ శ్రీనివాసరావుల తలలపై నుండి కురుస్తున్న తలంబ్రాలు రాధామాధవుల తలలపైనుండి కురిసినట్లే రూపుకట్టింది.

మాధవి పెళ్ళి నా జీవితంలో కూడ

రాగధార

చిరస్మరణీయమైన అనుభూతుల్ని అందించింది. భవిష్యత్తుమీద ఎన్నో ఆశల్ని పెంచింది. అనుభవంకన్న ఊహలు మరింత తియ్యగా వుంటాయని విప్పిచెప్పింది!

మాధవి అత్తవారింటికి బయలుదేరేటప్పుడు అప్రయత్నంగా నాకన్ను లశ్రుపూరితాలయ్యాయి.

తాను కళ్ళతో నవ్వుతూ, 'నేనప్పుడే వెళ్ళిపోవటంలేదే అనూ! మూడురోజుల్లో తిరిగి వస్తానుగా!' అంది మధూ.

'ఏమయినా ... ఇదివరకు నీమీద నాకు సర్వహక్కులు ఉండేవి! ఈవేళ అవన్నీ మరెవరో తీసుకుపోయారంటే ఏదో బాధగా వుందే మధూ! ఆడపిల్ల జీవితంలో ఇంత మధురఘడియలోకూడఆబాధతీరనిదేసుమా!'

'అవును. ఆడపిల్లకి ఈ బాధ తీరనిది...'

ఆమెను నవ్వించాలని, "బావగారితో నేను చెప్తాను లేవే! — నాకెప్పుడు కావాలంటే అప్పుడు పంపే పక్షంలో తీసుకు వెళ్ళమని...' అన్నాను.

ఫక్కున నవ్వింది మధూ. నా హృదయం తేలికపడింది. అంతలోనే ఏదో గుర్తుకు వచ్చినట్లు 'డాక్టరు రాలేదు చూసావా అనూ!' అంది మాధవి.


చిన్నబోయిన ఆమె ముఖం చూసేసరికి కళవళపడ్డాను. 'అతను క్యాంపులో ఉన్నాడట. అందుకని రాలేకపోయి వుంటాడు. అంతకన్న ఏమని ఓదార్చగలను?

మాధవి అత్తవారింటికి వెళ్ళిపోయింది. శేషమాంబగారు కన్నీరు పెట్టింది. రఘవరావుగారు బింకంగానే ఉన్నా మాటల్లో బాధను వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఒక్కగానొక్క కూతురు అత్తవారింటికి వెళ్ళిపోతే వాళ్ల వొంటరితనం బాధించదూ! ఇన్నాళ్ళు మాధవి కాలేజీలో చదువుతున్నా — అప్పటి భావం వేరు. ఇప్పుడు ఆడపిల్ల పరాయిసొమ్ము అయిపోయింది. దగ్గర ఉన్నప్పుడుకూడ దూరంగా ఉన్నట్లే అనిపిస్తుంది మరి!

ఆ రాత్రి నాన్నగారు అన్నమాటలు నాకు మరింత బాధ కలిగించాయి. '...ఆడపిల్లను కనకూడదు. ఒకవేళ పుట్టినా ఒక్కత్తే కాకూడదు. ఆ పిల్లను అపురూపంగా చూసుకొని ఒక అయ్యచేతిలో పెట్టాక అప్పుడిక మిగిలేదేమిటి? ... రాఘవుడు క్రుంగిపోయాడమ్మా!'

మనుగుడుపులకి మాధవితో శ్రీనివాసరావు అతని అప్పచెల్లెళ్ళు వచ్చేసరికి కొంచెంగా అంతా స్థిమితపడ్డారు. అప్పటికి డాక్టరు పంపిన గ్రీటింగ్సు అందాయి. దంతంతో చేసిన 'ప్రేమికుల' బొమ్మని కానుకగా పంపాడు అతను. మాధవి ఆనందానికి అవధులు లేవు. నా హృదయం తేలికపడింది.

(ఇంకా ఉంది)



ఏటేటా వచ్చే దురద

దానికి నివారణ ఏమిటి?




చెమటకాయలతో దురద, మంటని ఎంతో చికాకు పడతారు. గోకితే చర్మము పొరలు లేచి అసహ్యముగా ఉంటుంది. జాన్సన్స్ ప్రిక్లీ హీట్ సబ్బు మరియు ప్రిక్లీ హీట్ పౌడరు ఎంత వేడితో చెమట కాయలు రాకుండా త్వరగా రక్షణ కలిగిస్తాయి. అవి రెండూ చెమటకాయలనుండి రక్షణ పొందుటకు నేడు లభిస్తున్న తయారులలో ఎంతో పొదుపైనవి.


మొదట, ఔషధములు చేరిన జాన్సన్స్ ప్రిక్లీ హీట్ సబ్బుతో స్నానము చేయండి. అది వాచిన చర్మ రంధ్రములకు ఉపశమనము కలిగించి, అంటురోగములను పోకనీయదు.



తరువాత, చెమ్మను పీల్చి చర్మమునకు హాయిని కలిగించే జాన్సన్స్ ప్రిక్లీ హీట్ పౌడరును ఒంటిమీద జల్లుకోండి. దానిలో చెమటకాయలనుండి రక్షణనిచ్చే ఒక ప్రత్యేకమైన ఆంటిసెప్టిక్ పదార్థముంది. దానితో వెంటనే గుణము కనిపిస్తుంది. చెమటకాయల బాధనుండి తప్పించుకొనే పద్ధతి ఇదే.



జాన్సన్స్*
ప్రిక్లీ హీట్
పౌడరు మరియు సబ్బు





పాలడుగు
వెంకటేశ్వరరావు

బాగా ప్రొద్దుపోయింది.

చలిగాలి రివ్వుమని వీస్తూ వుంది.

నీర్సంగా వీధి తలుపుమీద చెయ్యివేసి తోసేడు రామ్మూర్తి.

తలుపు కిర్రుమని తెరుచుకుంది.

హాలులో సోఫాకి చేరబడి నిద్రపోతున్న సూరిగాడు వులిక్కిపడిలేచి కళ్ళు నులుముకుంటూ నిలబడ్డాడు.

'అమ్మగారు లేరేరా?'

'లేరు బాబూ.' 'పిల్లలు?', 'ఆరూ లేరు బాబూ.'

'ఎక్కడికి వెళ్ళారు?'

'వర్ధనమ్మగారింట్లో 'పార్టీ' వుందట. అంతా వెళ్ళేరు బాబూ! ఇంటికి రాగానే తవర్ని అక్కడికే వెంటనే రమ్మనమని చెప్పేరు.'

'అహా'

బయట కడుగేసి వీధి మెట్లమీద నిలబడి సిగరెట్టు వెలిగించుకున్నాడు రామ్మూర్తి.

గుప్పుగుప్పున పొగవదుల్తూ చీకట్లోకే చూస్తుండిపోయాడు. చీకట్లో తోరణాల్లా లైట్లు.

అంతదూరాన రాజలింగం బంగళాలో ఇంకా లయిట్లు వెలుగుతూనే వున్నయి.

రాజలింగివ్వాల ఇప్పటివరకూ క్లబ్బులో పేకాడుతూనే వున్నాడు. రాజలింగం, పనిమీద మద్రాసు వెళ్తున్నాడట. రైలు పన్నెండింటికట. అందుకని పదకొండుదాకా క్లబ్బులోనే పేకాడి అప్పుడే టాక్సీ వేసుకుని స్టేషనుకి వెళ్ళేడు రాజలింగం. ఇరూరయిన వ్యాపారవిషయమట. మూడు నాలుగురోజులుదాకా రాడట. మళ్ళీ రాజలింగం, తను వెళ్ళేటప్పుడు రామ్మూర్తిని పక్కకి తీసుకెళ్ళి చెప్పేడు. 'నాలుగురోజులు 'మావాళ్ళు' ఒంటరిగావుండాలి. పనిమనుషులువున్నారుగాని నిశ్వాసహీనులు. ఆవిడకి వాళ్ళమీద నమ్మకంలేదు. కనుక కాస్త మీవాళ్ళకి చెప్పు అంతదాకా చేదోడు వాదోడుగా వుండమని.'

'అట్లాగే! అదేమంత భాగ్యం' అని భరోసా ఇచ్చేడు రామ్మూర్తి.

రాజలింగం తృప్తిగా శ్వాసపీల్చి రామ్మూర్తి చెయ్యివదిలి వెళ్ళిపోయేడు.

రామ్మూర్తికి ఆరోజు పేకాటలో బాగా డబ్బులుపోయేయి. అందరి దగ్గరా రాజలింగం గుంజేడు. ముఖ్యంగా అందరికన్నా

ఎక్కువగానే తాగేడు రాజలింగం.

రాజలింగమంటే రామ్మూర్తికి మంట. రాజలింగం ఆ వయస్సులో మళ్ళీ పెళ్ళి చేసుకోటం రామ్మూర్తిని పుండువలె బాధ పెట్టింది. ఆపయిన ఆ రెండో భార్యకి ఏడాది క్రితం కొడుకుపుట్టటం ఆ పుండు మీద కారం చల్లినట్లయింది.

రాజలింగం రెండో భార్య వసంత, రామ్మూర్తి చిన్నప్పటి క్లాసుమేటు. వసంత అందగత్తె! ఆమెదీ రామ్మూర్తి వూరే. రామ్మూర్తి ఆరోజుల్లో వసంతని పెళ్ళి చేసుకోవాలనుకుని ప్రేమించాడు రహస్యంగా.



పవిత్ర పాపి

కాని అతను తల్లిదండ్రుల బలవంతంమీద కొండంత ఆస్తితో వచ్చిన జయమ్మని కిక్కురుమనకుండా పెళ్ళిచేసుకోక తప్ప లేదు; ప్రేమ ఒకచోట, పెళ్ళి మరోచోట. అదే విధి వైపరీత్యం. కాని... ఆవిధికే తల ఒగ్గి వసంత రాజలింగాన్ని పెళ్ళిచేసుకోవటం రామ్మూర్తికి సుతరామూ నచ్చలేదు. పైగా ఆమె ఆ పూళ్ళోనే తన కళ్ళెదుటే రాజలింగం అనే వృద్ధుడితో కాపురం చెయ్యటం మరింత అసహ్యంగా అనిపించింది రామ్మూర్తికి.

ఆస్తి, అంతస్తులలో రాజలింగం తనకంటె ఒకమెట్టు పైనేవుండటమూ రామ్మూర్తిని క్రుంగదీసింది. రాజలింగం ముసలివాడు. ఆస్తిపాస్తులు వుండవచ్చుగాని ఈడుజోడుకాని సంసారం సుఖాన్నెలా ఇవ్వ గలదు?!

ఆ రోజుల్లో తనని రామ్మూర్తి అనే నాయకుడు ప్రేమించినట్లు ఆ ప్రేమ విఫలమైనట్లు పెద్దల పట్టుదలలు తనని ఆ స్వర్గలోకాన్నుంచి త్రోసివేసినట్లు వసంతకీ తెలియదు. ఆవిషయం రామ్మూర్తికి మాత్రమే తెలుసు

పేదరికంతో క్రుంగిపోతున్న తల్లిదండ్రులకోసం, తన వెనకవున్న తోడబుట్టినవాళ్ళకోసం వసంత, జీవితంతో రాజీపడి వుండవచ్చు. కాని వసంత ఆపనిచెయ్యటం రామ్మూర్తి గుండెల్లో రంపపుకోతే అయింది, అందుకే.

స్వతహాగా జయమ్మ నోరు పెద్దది. దానికితోడు కూడా తెచ్చిన ఆస్తిపాస్తులు ఆవిడ ఆధిక్యానికి బలం ఇచ్చేయి. రామ్మూర్తి మొండివాడు. తన వ్యక్తిత్వాన్ని నిలుపుకోవటానికి, భార్యమీద భర్తగా తన అధికారాన్ని నిలుపుకోవటానికీ రామ్మూర్తి విశ్వ ప్రయత్నం చేశాడు. పెళ్ళయి పదేళ్ళవుతుంది. నలుగురు పిల్లలూ పుట్టారు. ఇంత జరిగినా భార్యాభర్తల మధ్య ఇన్నాళ్ళూ నిరంతరమూ జరుగుతూ వచ్చిన ప్రచ్ఛన్నమయిన సంఘర్షణ ఇంకా సాగుతూనే వుందిగాని 'రాజీ' సూచనలు కనిపించలేదు, నేటికిన్నీ.

అందుకే మనశ్శాంతికోసం రామ్మూర్తి కొత్త అలవాట్లు నేర్చుకున్నాడు.

క్లబ్బుకి వెళ్ళి పేకాట, తాగుడు నేర్చుకున్నాడు. పొద్దుపోయాక ఇల్లు చేరుకోటం అలవర్చుకున్నాడు. కావాలనే ప్రతి విష


తప్పక చూడండి! మళ్ళీమళ్ళీ చూడండి! సకుటుంబంగా చూచి ఆనందించండి!
పూర్ణిమ పిక్చర్స్
శ్రీకృష్ణాంజనేయ యుద్ధం
దర్శకత్వం: సి. యస్. రావు B.A.(Litt) నిర్మాత: డి. యస్. రాజు
STUDIO Ketha
THARAKARAMA
ఆంధ్ర: తారకరామ
సీడెడ్: జయలక్ష్మి
నైజాం: ఉషా
మైసూరు
నవయుగ పిక్చర్ సర్క్యూట్

పవిత్ర పాపి

యానికి జయమ్మని ఎదిర్చి మాట్లాడటం, వదవటం అలవర్చుకున్నాడు!

'మీకు ఇంకా బుద్ధి ఎన్నాళ్ళకి రాను?' అని నిష్కర్షగానే అడుగుతుంది జయమ్మ.

'నా బుద్ధి నిన్ను కట్టుకోవటంతోనే చచ్చిపోయింది. అది తిరిగి వస్తుందన్న నమ్మకం లేదు.'

'కనీసం కన్నపిల్లల కోసమయినా 'మనిషి' మారకపోతే ఎలా? ఇప్పుడు మీకు ఏం తక్కువయిందని? ఊరికే తిని కూర్చోవటంకూడా కష్టమయితే ఎలా బాబూ! ఎందుకు నన్నిట్లా ఏడిపించుకు తింటం?' జయమ్మ ఆవేదన.

'కాదు. నువ్వే నన్ను ఏడిపించుకు తింటున్నావు. నా మెడకి గుదిబండలా తయారయావు.'

ఆవేశంతో జయమ్మ నోరు పెంచి శోకాలు తీస్తుంది.

రామ్మూర్తి తలపట్టుకుని బయటికి వెళ్తాడు.

సంసారమన్నా, జయమ్మ అన్నా రామ్మూర్తి కి అసహ్యం; భయం.

అయినా తప్పదు. ఈ రోజుల్లో ప్రతి చిన్న దానికీ డబ్బు కావాలి. రామ్మూర్తికి నిత్యావసరాలకి డబ్బు చాలా అవసరం. అందుకే జయమ్మ లేకపోతే రామ్మూర్తికి అస్తిత్వం లేదు. తెల్లవారితే రామ్మూర్తికి జయమ్మ డబ్బుతో అవసరం మరి! తిట్టినా, శాపనార్థాలు పెట్టినా రామ్మూర్తికి జయమ్మనుంచి అవసరాలకోసం డబ్బు ముడుతుంటుంది. అందుకే రామ్మూర్తి స్థాన భ్రంశం పొందక అక్కడే నిలబడి పోరాటం సాగించాలని నిర్ణయించుకున్నాడు. మౌనంతో ముష్టి యుద్ధంలా.

'ఒక్కనాడయినా పిల్లల్ని దగ్గరకి తియ్యరు' అని సాధిస్తుంది జయమ్మ.

'వాళ్ళు పిల్లలు కారు. రాక్షసులు.'

'ఏ తండ్రీ తన పిల్లల్ని అట్లా అన లేదు.'

'నేను అంటున్నాగా...'

'నా పిల్లలు కాదు. మీరే రాక్షసులు. నన్నూ నా పిల్లల్నీ రాచి రంపాన పెడుతున్నారు. మా నాన్నే వుంటే ఇలా జరిగేదా? మీ ఆటలు ఇలా సాగేవా?...'

'అందుకే ఆ మహానుభావుడికి త్వరగా నరకానికి 'టికెట్' ఇప్పించాను. లేకపోతే నీకు తోడు ఆయనకూడా నామీద పెత్తనం చెలాయించేవాడు.' విరసంలోనే రామ్మూర్తి సరసం.

'అంత కఠినంగా ఎట్లా మాట్లాడుతారండీ. మీకు హృదయం లేదా?' అని శోకాలు తీస్తుంది జయమ్మ. అదే... జయమ్మ తురుపుముక్క, రామ్మూర్తి నోరు కట్టాను. నోరున్న ఆడదంటే రామ్మూర్తికి భయం. ఆడదాని ఏడుపు అతను సహించలేడు. అందుకే రామ్మూర్తికి జయమ్మ మీద కోపం. ఆడజాతి మీదనే అసహ్యం. ఆ రెండూ పుష్కలంగా వున్న జయమ్మ అంటే రామ్మూర్తికి భయం కూడాను. ఆ భయాన్ని లోలోపలే అణచుకుని పైకి గాంభీర్యం నటిస్తాడు రామ్మూర్తి.

డబ్బు కోసము తను మోసపోయాడు. జయమ్మ అందగత్తె కాదు. ఇద్దరి మధ్యా స్వారస్యమూ లేదు. తన తత్వానికి జయమ్మ సరిపడదు. జయమ్మ డబ్బు తనని కొనేసింది.

జయమ్మ తన జీవితానికి గుది బండలా తయారయింది. వద్దనుకున్నా ఇప్పుడు చెయ్యగలిగింది లేదు. తను భరించక వేరు దారిలేదు. పెద్దల చలవ. బ్రహ్మరాత. ఆ ఆలోచనే రామ్మూర్తిలో విపరీతమయిన ప్రతీకార జ్వాలని రేపుతుంది. ఆ అగ్నికి ఆజ్యంవలె తోడయింది. తన ఖర్మగాకపోతే ఆరాజలింగమూ, వసంతా ఈ ఘూర్ణోన్నే తన కళ్ళ ఎదటే వుండాలా? రాజలింగం మొదటి భార్య నిస్సంతుగా పోయింది. తను సంపాయించిన ఐశ్వర్యం పరుల సొత్తవుతుందనే భయంతో, వసంత మీద జాలి నటించి అతను వసంతకి అన్యాయం చేశాడు. కాకి ముక్కుకి దొండపండు.

కాని వసంతలో ఆ నిరాశలేశమాత్రమయినా కనపడదే?!


అదే రామ్మూర్తి బాధ.

వసంత రాజలింగాన్ని కొంగున ముడేసుకుంది. ఆ అనాకారిని భర్తగా భరించటానికి సంతోషంగా అంగీకరించింది. రాజలింగంతో పార్టీలకి విందులకి తిరుగుతుంది. ఎంతో తృప్తిగా వున్నట్టు అగుపడుతుంది, వసంత!

ఆదేమి మనిషి? ఆ ఉత్సాహం ఎక్కడిది? ఆ సంతోషం ఎందుకట? ప్చ్. అసలు వసంత ఆ 'ముసలి వాసన'ని ఎలా భరిస్తుంది?! ఈడాజోడా?!

సిగరెట్టు చివరంటా కాలి వేళ్ళు

హరిరామ్



చురుక్కుమంది.

ఉలికిపడి సిగరెట్టు అవతలికి విసిరేశాడు రామ్మూర్తి.

ఒకవేళ ఇదంతా...?! 'ఆ ఆలోచన' వచ్చి ఉషారుగా గిర్రున వెనుదిరిగాడు రామ్మూర్తి. గబగబా మెట్లెక్కి 'బాత్ రూం'లోకి వెళ్ళాడు. సబ్బుతో ముఖం తోమి పౌడరు పూశాడు. బీరువాలోంచి సిల్కుచొక్కా తీసి వేసుకుని సెంటు రాశాడు. ఉంగరాల జుట్టుని అదిమి దువ్వి ఆకుజోళ్ళు టక టకలాడించుకుంటూ మేడ దిగివచ్చాడు.

'అరే సూరీ! తలుపేసుకోరా!' అని వీధినపడ్డాడు, రామ్మూర్తి.

చలిగాలి రామ్మూర్తికి గిలిగింతలు పెట్టింది.

హృదయంలోంచి తన్నుకవస్తున్న కోరికలు చక చక అడుగులుపడేలా చేశాయి. గబ గబా నడిచివచ్చి 'ఆ మేడ' కెదురుగా నిలిచాడు. అది రాజలింగం ఇల్లు?

రాజలింగం మేడలో ఇంకా లయిట్లు వెలుగుతూనే వున్నాయి.

అవును. ఇన్నాళ్ళూ వసంత నటించింది. గుండెల్లోని కోరికల్ని దాచుకుని రాజలింగానికి విశ్వాసపాత్రంగా వున్నట్టు మెలిగింది. ఆ నటనా ప్రపంచంకోసమే. వసంత హృదయం తనదే. అది తనే అర్థం చేసుకోలేకపోయాడు. ఆడదాన్ని అర్థం చేసుకోవటం కష్టం. మాటలకి చేతలకి అర్థాలే వేరు— ఆడదానికి సంబంధించినంతవరకూ.

గేటు తీసి తోటలోగుండా నడుస్తూ పోర్టికో దగ్గరకి వచ్చాడు రామ్మూర్తి. పిల్లివలె అడుగులువేసి తలుపుమీద చెయ్యివేసి తోశాడు. కావాలని తీసివుంచినట్టు తలుపు తెరుచుకుంది!

అవును. తనకోసం వసంత కాచుకుని వుంది. అందుకే రాజలింగంతో వసంతే అలా చెప్పించి వుండవచ్చు: 'మావాళ్ళు ఒంటరిగావుంటారు, చూడమని.' అమ్మ! వసంత ఎంత గడుసరి!

తనెంత అదృష్టవంతుడు. జీవితాన్ని ఆనందమయం చేసుకోటం, దుఃఖభాజనం చేసుకోటం రెండూ మనిషి చేతుల్లోనే! వసంత ఎంత తెలివిగలది!

రాజలింగం ఎంత అమాయకుడు! అది మూర్ఖతతోకూడిన పిచ్చి నమ్మకం!

ఇంటి లోపల్నుంచి వెలుగు వచ్చి రామ్మూర్తి మొహంమీద కొట్టింది. కళ్ళు మూసుకుని ఇంట్లోకి నడిచి వెనకే తలుపు వేశాడు రామ్మూర్తి.

ఎదురుగా...,

హాల్లో సోఫాలో తల వంచుకుని కూర్చున్నది ఎవరు?

వసంత.

వసంతే!

దేవకన్య వలె మెరిసిపోతున్న వసంత! తన కలల పంట!

రామ్మూర్తి కాలు టీపాయికి తగిలి ఫ్లవర్‌వేజు కింద పడింది, గల్లుమని.

రామ్మూర్తి వణుకు నణచుకోవటానికి ప్రయత్నించేడు.

వసంత తలెత్తి చూసింది.

ఆమె ఒళ్లో పడుకుని నిద్రపోతున్న పాపాయి, అదొక అడ్డు కాబోలు! సిల్లీ.

'రామ్మూర్తిగారా! రండి.' వసంత కనులలో మెరుపు!

రామ్మూర్తి ఆమె దగ్గరకి నడిచాడు.

'రండి. కూర్చోండి. ఎంతదృష్టం! ఇందాకట్నించీ ఒంటిగా భయంతో నేను చచ్చిపోతున్నాను. నౌకరు తన తమ్ముడికి జబ్బుగా వుందని వెళ్ళాడు. పని మనిషి తన పని ముగించుకుని వెళ్ళిపోయింది. దేవుళ్ళా మీరు వచ్చారు. నా ఆందోళన సగం తగ్గింది. నా ఒంటరితనం పోయింది.'

రామ్మూర్తి నవ్వటానికి ప్రయత్నించాడు.

మాట్లాడదామని నోరు తెరవబోయాడు.

'వసంతా! నీ బాధ నాకు తెలుసు. నేనూ నీలా బాధపడుతున్నవాణ్ణే. కనుకనే నిన్ను అర్థం చేసుకున్నాను. ఆ భగవంతుడే మనకీ ఈ అవకాశం కల్పించాడు. గుండెలు విప్పి మాట్లాడుకుందాము. మన జీవితాలకి బంగారు రోజులు వచ్చాయి వసంతా! ఇన్నాళ్ళూ నిన్ను అర్థం చేసుకోలేకపోయినందుకు నన్ను క్షమించు వసంతా!' అందామనుకున్నాడు; కాని నోరు పెగిలి రాలేదు, రామ్మూర్తికి.

'బాబు ఇప్పటిదాకా ఒకటే ఏడుపు. ఏడ్చి ఏడ్చి అలిసిపోయాడు. పిచ్చి తండ్రి! ఏం చెయ్యాలో నాకు తోచటం లేదు. ఈ రాత్రిపూట ఒక్కదాన్ని ఏం చెయ్యగలను చెప్పండి? సమయానికి ఫోను చెడి కూర్చుంది. నాకు గాభరాగా వుంది. మీరు దయచేసి వెంటనే డాక్టర్ని పిల్చుకురాండి. ప్లీజ్!' అంది వసంత. ఆమె గొంతు బొంగురుగా అయింది.

ఆమెని పరీక్షగా చూశాడు రామ్మూర్తి.

వసంత కళ్ళు ఎర్రగా వున్నాయి, బుగ్గల మీద కన్నీటి చారికలు!

పవిత్ర పాపి

ఒక్కసారిగా మొహం కప్పుకుని ఏడ్వసాగింది వసంత, మరలా.

రామ్మూర్తి గాభరాపడ్డాడు.

అతని ఆలోచన్లు చెదిరిపోయేయి. గుండెలు వేగంగా కొట్టుకున్నాయి.

'ఇదుగో ఒక్క నిముషం. వూరుకోండి. మరేం భయం లేదు. డాక్టర్ని తీసుకొస్తా.' తడబడే అడుగులతో బయటికొచ్చాడు. డాక్టర్ని తీసుకొచ్చేప్పటికి పది నిముషాలు పట్టింది. ఆ నడకలో రామ్మూర్తి కాలికి ఎదురుదెబ్బ తగిలి బొటనవేలిగోరు పగిలింది.

డాక్టరు వచ్చి బాబుని పరీక్ష చేశాడు.

బాబుకి ఇంజక్షన్లు ఇచ్చి 'ఇప్పుడు మరేం భయం లేదు. అలస్యంచేస్తే మాత్రం ప్రమాదం జరిగేది. మీరదృష్టవంతులు. ఇప్పుడేం ఫర్లేదులెండి. కంగారు పడకండి. కాసేపటికల్లా బాబు లేచి ఆడుకుంటాడు.' డాక్టరు ఆ మాట అనటంతోటే వసంత మొహం విప్పారింది. పాపని వుయ్యాల్లోవేసి తదేకంగా చూసింది. వాణ్ణి అప్యాయంగా నిమిరింది.

'నన్నూ, నా బిడ్డనీ రామ్మూర్తిగారే దేవుళ్ళా వచ్చి కాపాడారు. లేకపోతే ఈ రాత్రి ఎంత భయంకరంగా ఉండేదో. రామ్మూర్తిగారి ఋణం మేము తీర్చుకోలేము.' అంటూ కృతజ్ఞతతో, ఆప్యాయంగా చూసింది వసంత. ఫ్లాస్కులోంచి కాఫీ తీసుకొచ్చి గ్లాసుల్లో పోసి అందించింది ఇద్దరికీ. ఆమె చూపుల్లోని నైర్మల్యానికి సిగ్గుతో ముడుచుకుపోయాడు రామ్మూర్తి. గుండెలు చల్లని నీటితో తడిసినట్లయింది. నరాల్లో ఒణుకు—మండుతున్న గుండెల్లో నీళ్ళు పోసినట్టు.

కాసేపటికి బాబు లేచి కాళ్ళూ చేతులూ ఆడిస్తూ ఆడుకోసాగాడు.

కాఫీ తాగి డాక్టరు వెళ్ళిపోయాడు. 'మరేం భయంలేదు. నిశ్చింతగా వుండండి.' అని చెప్పి.

'ఈ రోజు నేనెంతో అదృష్టవంతురాల్ని; నాకు అన్నయ్య లేడని బాధపడేదాన్ని. భగవంతుడిచ్చిన అన్నలా ఇదాక మీరే రాకపోతే ... తల్చుకోటానికే భయం వేస్తోంది రామ్మూర్తిగారూ! మీరు దేవుడు...'

రామ్మూర్తి మూగగా చూశాడు.

అతని గుండెలు విపరీతమయిన వేగంతో కొట్టుకున్నాయి.

కళ్ళు అప్రయత్నంగానే తడిని తెచ్చుకున్నాయి.

'వసంతా! నేను పాపిని తల్లీ! నికృష్టమయిన ఆలోచనలు పెట్టుకుని మలిన హృదయంతో నీ గుమ్మం తొక్కినవాణ్ణి. నన్ను దేవుడిగా చేస్తున్నావా? దేవుడున్నాడు తల్లీ! వాడే తప్పక నిన్ను జాగ్రత్తగా కాపాడుతాడు.' అనుకుని లేచాడు రామ్మూర్తి.

'బాబుకి మరేమీ ఫర్వాలేదు తల్లీ. ఈ రాత్రి నీకు తోడుగా మా నూరిని పంపిస్తాను. తలుపులు వేసుకుని పడుకో. వస్తాను.' అని చెప్పి బయటకి వచ్చాడు. గబగబా నడిచాడు. ఇంటికొచ్చాడు. నూరిని నిద్రలేపి సంగతి చెప్పి రాజలింగం ఇంటికి పంపించేడు. తలుపు గడవేసేడు; పడగ్గదిలో అడుగుపెట్టేసరికి జయమ్మ అతనికోసం ఎదురు చూస్తోంది. చీకట్లో పెద్ద పులిలా చూస్తూ.

ఇంటినీ, ఇల్లాలినీ నిర్లక్ష్యం చేస్తున్నందుకూ, పార్టీకి రాకుండా క్లబ్బుల్లో గడిపి నలుగుర్లో తలవంపులు తెచ్చినందుకూ, అవిగాక మరెన్నో కారణాలనీ—చూపించి రామ్మూర్తిని ఎన్నో ఆడిపోసింది జయమ్మ. ఎంతో భయంకరమైన సంఘర్షణకి సిద్ధపడిన జయమ్మని ఒక్కమాటకీ ఎదురాడక నిజస్వభావ విరుద్ధంగా మౌనంగా అన్నీ భరించిన రామ్మూర్తి తత్త్వం ఆశ్చర్యపరిచి ఆమె నోటిని కట్టుపడేలా చేసింది చివరికి.

'పొరపాటయింది లేవే. ఇకనుంచీ ఆ అలవాట్లన్నీ మానేసి నీ ఇష్టప్రకారం నడుచుకుంటానుగా.' అన్న రామ్మూర్తి చివరి మాటకి ఆశ్చర్యం, ఆనందం ముప్పిరిగొనగా అతన్ని క్షమించి తప్పుచేసి పశ్చాత్తాపపడుతున్న కుర్రవాణ్ణి ప్రేమతో దగ్గరకి తీసుకున్న చందంగా రామ్మూర్తిని దగ్గరకి లాక్కుంది జయమ్మ.

తొలికోడి కూత 'కొక్కొరొకో' అని ఆ వాడంతా ప్రతిధ్వనించింది. ●

ప్రశ్నోత్తరం

...కె. రామలక్ష్మి...

వి. ఎమ్. బి, హైదరాబాదు

అనంతపురంనుంచి మీ ప్రశ్నావళిలో ఒక సోదరి ప్రేమకు నిర్వచనం కోరింది. నే గ్రహించిన నిర్వచనాన్నామెకు అంద చేయుండి "సుమదళ పరిమళాలు వెదజల్లే స్నేహమనే పుష్ప గుచ్ఛంలోని రెండు పూరెందాల మధుర స్పందనే ప్రేమ!"

మరి మిగిలిన పుష్పాల స్పందన నేమందాం? ప్రేమకి నిర్వచనం ఒకరికొకరు చెప్పుకల్గేది కాదు. ఎవరికివారికి అర్థం అయ్యేది. ప్రేమకి రకరకాల నిర్వచనాలిచ్చారు పెద్దలు. అవసరానికీ, సెంటిమెంటుకీ—కలయిక ప్రేమ అన్నాడు బాల్జాక్. పెళ్ళితో కుదిరిపోయే వో రకం పిచ్చి అన్నాడు ఎంబ్రోస్ బయిర్స్. ఇంకా ఎందరో చెప్పారు. కాని ఏ ఒక్కటీ ఇదే ప్రేమకు నిర్వచనం అని యీ నాటికీ ఒప్పుకో లేక పోతున్నాం.

ఆర్. కె, కర్నూలు

మీకు గృహలక్ష్మి అనేనవల రాసినందుకు స్వర్ణ కంకణం అందుకున్నారు కదా. ఈ స్వర్ణ కంకణం అనేది ఎవరు ఎప్పుడు ఏర్పరిచారు?

గృహలక్ష్మి అనే నవల నేను రాయలేదు. పిలకా గణపతిశాస్త్రిగారు రాశారు. పోతే ఇది గృహలక్ష్మి స్వర్ణకంకణం. ఆ సంవత్సరం ఉత్తమ రచయిత్రి అనుకున్న వారికది యిస్తూ వుంటారు—కే.ఎన్. కేసరి గారు దీన్ని ప్రారంభించారు. వారి సంతతివారా సంప్రదాయం వదల్లేదు. నాకా కంకణం 1957 లో యిచ్చారు.

కె. ఎస్. సి. హెచ్, మద్రాసు

...తెలుగు నేర్చుకొని రెండు సంవత్సరాలే అయినా మీ జవాబులను పట్టిచూస్తే కలిసి మెలిసి ఉన్న భావం నాలో వరుం. మిమ్మల్ని విమర్శించులేఖలకు మీరిచ్చు జవాబులు బాగున్నాయి. మీ శీర్షికలు మెచ్చు పదిమంది యుండగా దూషించు వంద మంది గురించి తలంపు లేల?

ధాంక్స్. మీకు నా సంతోషం ఎలా చెప్పాలో తెలియడంలేదు. మెచ్చే వారున్నా తిట్టేవారున్నా కంట కనిపెట్టడం డిప్లొమసీ కదా?!

వి. వి. ఆర్. ఎస్, విజయనగరం

చదువు ఉద్యోగం మొదలైన వాటిలోనే కాకుండా సమానత్వం కావాలంటూ లుంగీలు పాంట్లు షర్ట్లు ధరించడం ఎబ్బెట్టుగా ఉంది.

సమానత్వం కోసం అనుకుంటారెందుకు? సౌకర్యం కోసం. ఫేషన్ కోసం అని ఎందుకనుకోరు? మగాళతో పువ్వుల లుంగీలు షర్ట్లు వేసుకుంటే మేం అంటున్నామా— సమానత్వం కోసమా?! అని.

కె. డి. సి, కొత్తగూడెం

మీకు స్వజాతి అభిమానం ఉండాల్సిన దానికంటే కాస్త ఎక్కువగా వుంది. ఎందుకంటే?

ఎంతుంటే ఒంటికి మంచిది డాక్టరుగారూ!

వి. ఆర్, ఆదోని

మీరు రాసిన మొదటి కథ పేరు తెల్పుతారా?

నే తొలుత కథ రాయలేదు. వ్యాసం రాశాను. దాని పేరు —'తమిళభాషాల్లో ప్రేమతత్వం'. అది అచ్చయిన రోజు ఆఫీసుకు సెలవు పెట్టాను—గోరా శాస్త్రి తన స్నేహబృందంతోసహా— ఏం వేళాకోళం చేస్తాడో అని!

జె. ఆర్. సి, నాగపూరు

మీ సమాధానాలు జనాలకి బోరు కొడుతున్నాయి. ఇప్పటికైనా మీరు ఆపితే ఇకముందు నుండి....

మీరిస్తారా?!

జె. కె. ఆర్, మద్రాసు

మగవారిని నమ్మించడం ఎలా? అని వ్యాసాలు రాయకూడదూ?

ఎందుకు దండుగ. మేం నిజం చెప్పినా నమ్మలేని మగవాళ్ళు— చూపులకే లొంగిపోతారు!

ఎమ్. ఆర్, ఆర్, రాజమండ్రి

తప్పుచేయడం సులభమేగాని చేసి నట్టు ఒప్పుకోవడం కష్టం అంటాను.

నిజంగా తప్పు చేస్తే— ఒప్పుకోడానికి సిగ్గు పడ్డం—పిరికితనం.

డి. ఎస్. ఆర్, తుని

ఆడదానికి ముఖ్యమైన గుణాలు ఏవి?

ఆడదానికి మాట్లాడే చతురతేనా ఉండాలి. మాట్లాడకుండా వురుకతే తెలివైనా ఉండాలి. ఈ రెండూ లేకపోవడమే— నిజమైన దురదృష్టం.

ఎస్. వి.జె, అమలాపురం

నేను ప్రశ్నావళి చదువుతున్నాను—చాలా కాలంగా. మీరు చాలా నేర్పుగా చిన్నవిగా జవాబులిస్తారు.— నేను కథ పంపి మూడు నెలలైంది. ప్రచురణ అవలేదు. పేరు ప్రఖ్యాతులు గాంచిన రచయితల రచయితల కథలు నవలలు గాని స్వీకరించరా. ఎడిటరుగారు?

క్లుప్తంగా వుంటేనే జవాబు రాణిస్తుంది. విట్టు ఫలిస్తుందని —నా నమ్మకం. అందుకు చిన్నవి రాస్తా. ఇక, పేరు ప్రఖ్యాతులున్న వారివే స్వీకరిస్తారన్నది —మీ భ్రమ. అదేనిజమైతే యింతమంది కొత్తవారెలా వెల్గులోకి వచ్చారు?

ఎ. ఆర్. డి, నిడమనూరు

కష్టసమయాలలో ఆదుకునే వారిని ఏమనాలి?

స్నేహితులు.

మీరు రచయిత్రి అయి ఎంతకాలం అయింది.

ఇంకా కాలేదు. కావాలని ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాను..

డి. వి. ఎస్, చీరాల

అసభ్యమైన నృత్యాలు. జుగుప్స కల్గించే వస్త్రధారణ—యివి కూడా కళకు నిదర్శనమేనా?

అని ఎవరంటున్నారు సోదరీ, అటువంటి వికృతాలు చూడాలని కుతూహలపడే వాళుంటున్నారు కనుక— వేస్తూ వుంటారు.

మీరు కేవలం పత్రికకే అంకితం అయి పోయారా? మిగతా వీక్లీలలో మీ వ్యాసాలు కన్పించవేం?

సర్వ సాధారణంగా ఒక పత్రికలో కాలం రాసే వాళ్ళు— మిగిలిన పత్రికలలో అలాంటి శీర్షికే రాయడం —మర్యాద కాదు. అంతేగాని నిషిద్ధం కాదు అటువంటి జర్నలిస్టిక్ సంప్రదాయాలను నేను అధిగమించను. అంతే.

సి హెచ్. ఆర్. కె, పేరాల

జీవితం మీద విరక్తి కల్గిన వారికి ఒక్క చీమ కుట్టినంత బాధకూడా లేకుండా చచ్చిపోవడం ఎలాగో మీకు తెలుసా?

నెప్పిలేని చావు లేదు!

జీవితంమీద విరక్తి పుట్టిన వాళ్ళకు మీ సలహా?

విరక్తికి విరుగుడు వెతకమని.

పి. బి. ఆర్, టాంగుటూరు

ఇరువురి వ్యక్తుల కలయికకు మనస్సులా? పెళ్ళా ఏది ముఖ్యం?

సంఘపు సెంక్షను ముఖ్యం— మీకు పుట్టబోయే— పాపం భవిష్యత్తు దృష్ట్యా. పిల్లలు అక్కర్లేదనుకుంటే— ఏ బాధా లేదు


అక్కినేని నాగేశ్వరరావుతో ఇంటర్వ్యూ

జగపతి ఆర్ట్ పిక్చర్స్ ఈస్ట్‌మన్ కలర్‌లో నిర్మిస్తున్న 'బంగారు బాబు' చిత్రానికిగాను యిటీవల కోవలంలో హెలికాప్టర్ ఫైటింగు జరిగింది. ఆ వింత దృశ్యాన్ని వీక్షించడానికి నేను వెళ్ళాను. లంచ్ బ్రేకులో 'నటసామ్రాట్' నాగేశ్వరరావుతో కాసేపు సంభాషించాను. మా సంభాషణ సారాన్ని పాఠకులకు తెలుపుతున్నాను.

'విశ్రాంతికి బదులు ఊటీ ఔట్‌డోర్'

ప్ర: ఎండలు మండుతున్నాయి. 'వేసవి విడిది' ఎక్కడికయినా పోవాలని ప్లాన్ చేశారా?

జ: మే మాసమంతా వూటీలోనే వుంటాను. ప్రతి సంవత్సరం మే నెలలో రెస్టు తీసుకునేవాణ్ని. ఈసారి అవుట్‌డోర్ షూటింగులో పాల్గొంటున్నాను.



హెలికాప్టర్‌తో 'బంగారుబాబు' ఔట్‌డోర్‌లో

ప్ర: వయస్సు పెరిగేకొద్దీ, మీలో ఓపిక ఎక్కువ అవుతూవుంది. మీకు అలసట అనిపించడంలేదా?

జ: ఓపిక లేకపోతే పని ఎలా సాగుతుంది. అలసట అనుకుంటే, నా పనిని మరెవరు చేస్తారు.

'సురేన్ నాకు నచ్చిన పాత్ర'

ప్ర: మీరింతవరకు పోషించిన పాత్రల్లో మీకు బాగా నచ్చినదేది?

జ: కన్నతల్లి, దేవదాసు, లైలామజ్ను, ప్రేమనగర్, విప్రనారాయణ, తెనాలి రామకృష్ణ, కాళిదాసు, బీదలపాట్లు. అన్నింటికన్నా 'బాటసారి'లోని సురేన్ పాత్ర నాకు బాగా నచ్చింది.

ప్ర: 'బీదలపాట్లు' ఫెయిల్యూర్‌కి కారణం ఏమిటి?

జ: ప్రజలకు అందులో ఏదో వెలితి కనిపించి వుంటుంది. వాళ్ళకి నచ్చలేదు గాబట్టే ఫెయిల్ అయింది.

'ప్రేక్షకుల తీర్పుని గౌరవిస్తాను'

ప్ర: ప్రేక్షకుల తీర్పును మీరు గౌరవిస్తారా?

జ: తప్పకుండా. మాపైన వాళ్ళకి విరోధమా, ద్వేషమా? విజయవంతమైతే, సంతోషించి, దెబ్బతింటే నాకేమిటి అనుకునే మనస్తత్వం నాకులేదు. మమ్మల్ని యింతగా అభిమానించి, నేటి మా సుస్థితికి కారకులైన ప్రేక్షకులు యిచ్చే తీర్పును, సగౌరవంగా స్వీకరిస్తాను.

'నటించిన చిత్రాలన్నీ విజయవంతం కావాలని లేదు'

ప్ర: 'బీదలపాట్లు' చిత్రానికి ఎం. జీ. ఆర్ వుంటుందని అన్నారు గుర్తుందా?

జ: ఫ్యామస్ నవల్స్ వున్న కథలకి ప్రజాదరణ, ప్రజాభిమానం లభిస్తుంది అనుకున్నాను. నేను నటించే చిత్రాలన్నీ విజయవంతంగా ప్రదర్శింపబడాలన్న సిద్ధాంతం లేదే! _ 'బీదలపాట్లు' ఫెయి

ల్యార్‌కి వీరలాచార్యతోబాటు నేనూ వింతో బాధపడుతున్నాను. ఆయన ఒక మంచి నిర్మాత.

'తుకారామ్ పై నమ్మకం ఉంది'

ప్ర: 'భక్త తుకారాం' పాత్రపై మీ అభిప్రాయం ఏమిటి ?

జ: ఈ చిత్రాన్ని నిర్మించమని ఆది నారాయణరావుగారికి నేనే సలహా ఇచ్చాను. తుకారాం కేవలం భక్తుడేగాదు. కులమత భేదాలను పాటించని వ్యక్తి. విప్లవవాది. సంఘసంస్కరణాభిలాషి. పైగా కథలో ఇంట్రిన్‌సిక్ ఫ్యామిలీ డ్రామా వుంది: సంగీతానికి మంచి అవకాశం వుంది. ఈ కథపై నాకు చాలాకాలంగా మోజు వుంది. కమర్షియల్‌గా కూడా బాగా నడుస్తుందనే నమ్మకం వుంది.

ప్ర: ప్రేమకు నిర్వచనం చెప్పగలరా?

జ: ప్రేమే దైవం అన్న భావంగల వాణ్ని నేను.

'ఏదీ అసంభవంకాదు'

ప్ర: మీరు, రామారావుగారు కలిసి నటించే అవకాశం వుందా ?

జ: నథింగ్ ఈజ్ ఇంపాజిబుల్ హియర్.

ప్ర: సెక్స్‌ని విమర్శిస్తూ, కొన్ని చిత్రాల్లో మీరు మితిమీరిన శృంగార ఘట్టాల్లో నటిస్తున్నారే అని కొంత మంది విమర్శిస్తున్నారు...

జ: వ్యక్తిగతంగా నా అభిప్రాయం అది. వృత్తిరీత్యా కొన్నిసార్లు పాత్ర స్వభావాన్ని బట్టి, సన్నివేశ ప్రాధాన్యతనుబట్టి నటించక తప్పడంలేదు.

* * *

ప్ర: మీరు ప్రస్తుతం నటిస్తున్న చిత్రాలెన్ని ?

జ: రవీంద్రా ఆర్ట్ పిక్చర్స్‌వారి చిత్రం దాదాపు పూర్తయింది. జెమినీవారి చిత్రం విడుదల కాబోతూంది ప్రస్తుతం అన్నపూర్ణా ఆర్ట్ పిక్చర్స్, పద్మశ్రీ పిక్చర్స్, వీనస్ కంబైన్స్, జగపతి ఆర్ట్ పిక్చర్స్ షూటింగులు జరుగుతున్నాయి. అన్నీ కలర్ చిత్రాలే.

'దేనికైనా ధైర్యం అవసరం'

ప్ర: 700 అడుగుల ఎత్తున ఎగిరే హెలికాప్టర్ అంచున నిలబడి, ఫైటు చేశారే మీకు భయం అనిపించలేదా ?

జ: దేనికి భయం. ఇట్ ఈజ్ మై డ్యూటీ ? పైగా యిలాంటి వాటికి కాలిక్యులేషన్ చాలా అవసరం. అప్పుడే ఆ సన్నివేశాలు సహజంగా వస్తాయి. ఏ పనికయినా ధైర్యం చాలా అవసరం.

ప్ర: 'బంగారు బాబు' పాత్రపై మీ అభిప్రాయం ?

జ: నేను ధరిస్తున్న మరొక వెరైటీ పాత్ర, నావర్త్‌కోసం, ఖర్చుకు వెనకాడని, మంచి కథకోసం తాపత్రయపడే వ్యక్తి శ్రీ రాజేంద్రప్రసాద్.

'షాట్‌రెడీ' అనడమే తరువాయి, అక్కినేని టకప్ చేసుకుని హెలికాప్టర్ని ఎక్కారు. అది జయ్‌మంటూ ఆకాశంలో ఎగిరింది.

శ్రీనివాస్●

సినిమా

చిత్రానికి పేరు?

✱ దుక్కిపాటి మధుసూదనరావు ప్రతినెలా వారి ఆఫీసులో పత్రికలవాళ్లను సమావేశ పరుస్తుంటారు.

మద్రాసు భగీరథమ్మాళ్ వీధిలోని అన్నపూర్ణా ఆర్ట్స్ పిక్చర్స్ ఆఫీసులో ఏప్రిల్ 17న 'ప్రెస్ మీట్' జరిగింది. అల్పాహార విందు అనంతరం, విజేత నవల ఆధారంగా నిర్మింపబడుతున్న చిత్రానికి సరయిన



'హంతకులు—దేవాంతకులు'లో నాగేష్, రాజసులోచన.

టైటిల్ కావాలి, అని అడిగారు మధుసూదనరావు.

పాఠకలోకంలో 'విజేత'ను అనేకమంది చదివేయుంటారనుకుంటా. మీకు ఏదేని మంచి పేరు తోస్తే, ఆ టైటిల్‌ని దుక్కిపాటి మధుసూదనరావుకు పంపండి. సరయిన పేరును సూచించినవారికి, బహుమానం కూడా లభిస్తుందట.

మార్పులు—చేర్పులు

ప్రముఖ నవలా రచయిత్రి సులోచనా రాణి రాసిన 'విజేత' నవలలోని సుధ, భాస్కర్ పాత్రలు యీ చిత్రంలో వుండవు. చిత్రానికి బలాన్నిచ్చే రాజబాబు, పద్మనాభం, అల్లు రామలింగయ్య, మరియు గుమ్మడి పాత్రలు, యీ చిత్రంలో కనిపిస్తాయి. జాతీయోద్యమం కాని, రజాకార్ ఉద్యమం గాని యీ చిత్రంలో వుండవు. గంభీరమైన పాత్రపోషణతో, గాఢమైన సన్నివేశ నిర్మాణంతో, వినసొంపైన సంగీతంతో సర్వాంగసుందరంగా తయారవుతుంది, అన్నారు మధుసూదనరావుగారు.

స్త్రీ జీవితం

సహనం, కీర్తి, క్షమ, త్యాగం పుణ్య పవిత్రమూర్తి భారత నారి. వీటిలో ఏ ఒక్కటి లోపించినా, ఆమెకు శోకమే శరణ్యం అవుతుంది. స్త్రీ జీవితం అరిటాకు లాంటిది. ముల్లు వచ్చి అరిటాకు మీద పడ్డా, అరిటాకు ముల్లుమీద పడ్డా, ప్రమాదం అరిటాకుకేగా.

'ఉన్నత ఆదర్శాలతో, ఉత్తమ ఆశయాలతో విరాజిల్లవలసిన స్త్రీ జీవితం, కోపావేశాలకు గురైతే, ఎంతటి దుర్భర జీవితాన్ని గడపవలసి వస్తుంది' అనేది యితివృత్తం గల చిత్రం యిది.

'పూలరంగడు' తర్వాత బాక్సాఫీస్ దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు, నిర్మాత దుక్కిపాటి మధుసూదనరావుల కాంబినేషన్‌లో నిర్మితమవుతున్న యీ చిత్రానికి ఆచార్య ఆత్రేయ, కె. వి. మహదేవన్, సెల్వరాజ్ తమ అనుభవసారాన్నంతా వుపయోగిస్తున్నారట.

ప్రధాన పాత్రధారులు : నాగేశ్వరరావు, వాణిశ్రీ, అంజలీదేవి, సూర్యకాంతం, లీలారాణి, వై. విజయ, గుమ్మడి, పద్మనాభం, రాజబాబు, అల్లు రామలింగయ్య, ఎస్వీరంగారావు (గెస్టు); అన్నపూర్ణా విడుదల.

కృష్ణతో కేరళకి వెన్నెలఆడై నిర్మల

అందాల వెన్నెలఆడై నిర్మలకి. హీరో కృష్ణమీద విపరీతమైన మోజు. అతగాడితో వుంటే క్షణం ఒకయుగంలాగా వుంటుందట ఆమెకి. కృష్ణతో వె. నిర్మల కేరళకు పయనం కట్టింది. వయస్సులోవున్న ప్రేమికులు కలుసుకుంటే వాళ్ళ కళ్ళు ఏకమవుతాయి. మనస్సులోని భావాలు అనురాగ బంధాలతో కలిసిపోతాయి. ఈ ఉదంతం ఎందులోనిదో మీకు తెలియాలిగా, ఉమా ప్రొడక్షన్స్ వారి 'కత్తుల రత్తయ్య' చిత్రంలోదే.'



నటి వాణిశ్రీ.

(చిత్రకారుడు : శ్రీ ఎం. ఆర్. ఎస్. ప్రసాదరావు)

సినిమాల్లో ప్రేమికులు కలిస్తే, పాట తప్పనిసరిగా వుండాలిగా. ఈ చిత్రంలో కూడా ఒకపాట వుంది. కవి సి. నా. రే. వ్రాసిన,


'ఓహోహో చామంతి—ఒయ్యారి
పూబంతీ !
మురిపాల ముద్దబంతి—ముద్దుల
రబ్బరుబంతీ నువ్వు కసిరితె ఒక అందం
జడ విసిరితె ఒక అందం' అంటూ

బాలసుబ్రమణ్యం పాడిన పాటను, కృష్ణ పాడుతూ కవ్విస్తుంటే, వె. నిర్మల వనమయూరిలా నాట్యం చేసింది. 'కట్' అన్నారు దర్శకుడు కె. ఎస్. ఆర్. దాస్. ఈ పాట చిత్రీకరణతోబాటు ఎస్వీరంగారావుకు, కృష్ణకు జరిగిన స్టీమ్‌బోట్ ఫేజ్‌ని పెరియార్ నదిలో చిత్రీకరించడం జరిగింది. మలబార్ తీర సౌందర్యంతోబాటు, కేరళప్రాంతాలు, రమణీయ ప్రకృ

సినిమా డైరీ

- మాధవీ ఆర్ట్ పిక్చర్స్ వారి రెండవ షెడ్యూలు ఏప్రిల్ 16న మద్రాసులో ప్రారంభమైంది. [illegible] కె. హేమాంబరధరరావు దర్శకుడు.
- రవీంద్రా ఆర్ట్ పిక్చర్స్ 'దత్తపుత్రుడు' ఆఖరి షెడ్యూలు ఏప్రిల్ 18న ప్రారంభమైంది. లక్ష్మి, వాణిశ్రీ పాల్గొన్నారు. లెనిన్‌బాబు దర్శకుడు.
- అన్నపూర్ణా ఆర్ట్ పిక్చర్స్‌వారి లాస్ట్ బట్ వన్ షెడ్యూలు ఏప్రిల్ 23న హైదరాబాదు పరిధిలో ప్రారంభమవుతుంది. ఆదుర్తి సుబ్బారావు దర్శకుడు.
- ఎస్. వి. ఎస్. పిక్చర్స్ 'డబ్బుకు లోకం దాసోహం' రెండవ షెడ్యూలు ఏప్రిల్ 14న మద్రాసులో ప్రారంభమైంది. ఎన్టీరామారావు, జమున, సత్యనారాయణ, పాల్గొన్నారు. డి. యోగానంద్ దర్శకుడు.
- ఎ. కె. ఎస్. ప్రొడక్షన్స్ 'అబ్బాయిగారు, అమ్మాయిగారు' 14 రీళ్ళు తయారైంది. వి. రామచంద్రరావు, దర్శకుడు.
- సుచిత్రా ప్రొడక్షన్స్ 'కాలం మారింది,' 8 రీళ్ళు తయారైంది. కె. విశ్వనాథ్ దర్శకుడు.

తిని సహజ వర్ణాలతో చిత్రీకరించారు. అనేక వ్యయప్రయాసలకోర్చి; భారీఎత్తున నిర్మింపబడుతున్న 'కత్తుల రత్తయ్య' త్వరలో రాజశ్రీ పిక్చర్స్‌ద్వారా విడుదలవుతుంది. ఎస్. ఎస్. భట్ నిర్మించే యీ చిత్రానికి ఎం. నాగేశ్వరరావు నిర్మాణ వ్యవహర్తగా, వి. ఎస్. ఆర్. స్వామి ఛాయాదర్శకునిగా, సత్యం సంగీత సారధిగా వ్యవహరిస్తున్నారు.



సుభాషిణీ ఆర్ట్ పిక్చర్స్ షూటింగు ప్రారంభోత్సవంలో క్లాప్ కొడుతున్న తాతినేని ప్రకాశరావు, నాగభూషణం, జమున, పూర్ణా కామరాజు, దర్శకుడు హేమాంబరధరరావు.

విజయభట్‌లో అక్కినేని!

'భలేరంగడు' చిత్రాన్ని నిర్మించిన విజయభట్ మూవీస్ త్వరలో ఒక సముజ్వల సాంఘికాన్ని నిర్మించ బోతున్నారు. అక్కినేని నటించడానికి అంగీకరించారు. తాతినేని రామారావు దర్శకుడు. ప్రస్తుతం స్క్రిప్టు వర్కు జరుగుతూంది.

శోభన్—శారదల కొత్త చిత్రం!

చూడ ముచ్చటైన జంటగా, విజయవంతమైన చిత్రాల జంటగా శోభన్ శారదలను పేర్కొనవచ్చు. ఈ కాంబినేషన్‌లో ప్రస్తుతం 'మానవుడూ—దానవుడు' 'కాలం మారింది' తయారవుతున్నాయి. ఇప్పుడు అన్నపూర్ణా కంబైన్స్ వారి ద్వితీయచిత్రంలో శోభన్‌తో శారదకు జత కుదిరింది. టి. క్రాంతికుమార్. సి. రాఘవరావులు నిర్మించే యీ చిత్రానికి బొల్లిముంత మాటలను, చక్రవర్తి సంగీతాన్ని, జి. కె. రాము ఛాయను నిర్వహిస్తారు. దర్శకుడు. కె. విశ్వనాథ్. అన్నపూర్ణా విడుదల.

ఏప్రిల్ నెలాఖరున పాటలన్నింటిని రికార్డు చేయించి, మేలో షూటింగు ప్రారంభించదలచినట్లు, నిర్మాత క్రాంతి కుమార్ చెప్పారు.

మా ఇంటి వెలుగు

మహేశ్వరీమూవీస్‌వారి 'మా ఇంటి వెలుగు' అవుట్‌డోర్ షూటింగు కేరళ మూనార్‌కొండలలో, అతి సుందరమైన తేయాకు తోటలలో, ఆకాశాన్ని అంటుకునే టేకు వృక్షముల నడుమన, భయంకరమైన కొండలపైన పతాక సన్నివేశాలను, కారు ఛేజింగును, గుర్రాలు కరిగించే ఫైటు దృశ్యాలను యువదర్శకుడు విజయ్ చిత్రీకరించారు.

ఊటీ బొటానికల్‌గార్డెన్స్‌లో ప్రొస్పెక్టు హిస్సెట్‌లో రెండు పాటలు, కొంత డైలాగు విభాగాన్ని చిత్రీకరించడం జరిగింది. కృష్ణ, వెన్నిరాడై నిర్మల పాల్గొన్నారు. పక్షంరోజులు జరిగిన యీ షెడ్యూలుకు లక్ష ఖర్చయిందట.

అవుట్‌డోర్‌లో పాల్గొన్న తారాగణం



'మేనకోడలు'లో కృష్ణ, జమున.

క్రిష్ణ చంద్రకళ, వెన్నిరఆడై నిర్మల, సత్యనారాయణ, సాక్షి రంగారావు, పేరు మాళ్ళ, వల్లం నరసింహారావు, బోణం అంజనేయులు, ఏడిద నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు మరియు అరుణ అనే నూతన నటి. ఈ చిత్రానికి పినిశెట్టి రచన్ను, చలం కళను, ప్రకాశ్ ఛాయను, పొన్నలూటి నిర్మాణ వ్యవహారాలను, జగన్మోహనరావు సహాయ దర్శకత్వాన్ని నిర్వహిస్తున్నారు. పైడిమర్రి నిర్మించే 'మాయింటి వెలుగు' చిత్రానికి విజయ్ దర్శకుడు. పూర్తై విడుదల.

సినిమా

నటి యింట్లో నల్ల డబ్బు!

గతవారం ఒక ప్రముఖ తమిళ నటి యింటిని సి. బి. ఐ. శాఖవారు సోదా చేశారు. సడన్‌గా జరిగిన యీ దాడి ఫలితంగా, ఆ నటి యింట్లో 30 లక్షల విలువచేసే నల్లడబ్బు దొరికిందట. ఈమెకు అనేక ప్రయివేట్ సంస్థల్లో వాటా వుందని తేలింది. ఇతర రాష్ట్రాల్లో కూడా యీమెకు ఆస్తులు వున్నాయని ఋజువు పరిచే దస్తావేజులు దొరికాయట. ఈ వార్త పరిశ్రమలో సంచలనాన్ని కలిగించింది.

మంచిరోజులు వచ్చాయి

ఉన్నవాళ్ళు, లేనివాళ్ళు అనేడి రెండు వర్గాలను సమన్వయ పరచడమే సోషలిజం. పాత కొత్తలకు అనునిత్యం సంఘర్షణ జరుగుతూ వుంటేనే, మంచి ఫలితాలు లభిస్తాయి. మంచిరోజులు వస్తాయి.

డబ్బుంటే ఏదయినా చెయ్యొచ్చు అన్న అహంభావం గొన్న బంగారయ్యకి, జనవాక్యమే శ్రీరామరక్ష అన్న భావం గొన్న పాలేరు గోపాలానికి పంచాయితీ ఎన్నికల్లో పోటీ వచ్చింది. జనవాక్యం జయించింది. ధనవంతుడి ముద్దుల కూతుర్ని పరిస్థితుల ప్రభావం వల్ల పాలేరు గోపాలానికి అర్ధాంగిని చేస్తాడు, బంగారయ్య. తాళి కట్టించుకున్నదేగాని, పాలేరు గోపాలాన్ని భర్తగా స్వీకరించలేక పోయింది.

వాళ్ళ సంఘర్షణ, భార్య భర్తల వైరుధ్యం, మంచి, చెడుల పోరాటం ఎలా పరిష్కరింపబడ్డాయో, తెలియాలంటే జెమినీవారి వర్ణచిత్రం 'మంచి రోజులు వచ్చాయి'ని చూడాల్సిందే

'మంచిరోజులు వచ్చాయి' చిత్రానికి బొల్లిముంత రచయిత; ముళ్ళపూడి రాజగోపాల్ కథకుడు; చలపతిరావు సంగీతానికి, సెల్వరాజ్ ఛాయకి నిర్దేశకులు. ఇక దర్శకత్వం అంటారా—అనేక విజయవంతమైన చిత్రాలను అందించిన వి. మధుసూదనరావే. నాయకుడు నాగేశ్వరరావు. నాయిక కాంచన, ప్రధాన పాత్రధారులు: గుమ్మడి, నాగభూషణం, ధూళిపాళ, కృష్ణంరాజు సత్యనారాయణ, అంజలీదేవి, గీతాంజలి, నిర్మల. విడుదల; నవయుగ, నిర్మాత, ఎస్. ఎస్. బాలన్.

మీకు తెలుసా?

రాజకపూర్ నిర్మించే 'ధర్మకర్మ' చిత్రానికి ఆర్. డి. బర్మన్ సంగీత సారధ్యం వహిస్తున్నారు.

ఎస్కే. పిక్చర్స్ నిర్మించే హిందీ చిత్రానికి, (అనేక చిత్రాలకు నృత్య దర్శకుడిగా పనిచేసిన) సత్యనారాయణ్ నిర్దేశకుడయ్యాడు.

నేటి ప్రముఖ నటి జీనత్‌అమన్ కొంతకాలం మోడల్‌అమ్మాయిగా వుండేదట.

1958 లో 'బాజిగర్' చిత్రాన్ని నిర్మించిన రామదయాల్, అదే పేరున విజయలలిత నాయికగా ఒక చిత్రాన్ని హిందీలో నిర్మిస్తున్నారు.

'ఉమంగ్' హిందీ చిత్రంలో నటించిన సతీష్ అరోరాయే 'నీతి — విజాయితి' కథానాయకుడు.

ప్రముఖనటి జయలలిత ఒక తమిళ చిత్రంలో 7 పాత్రలను పోషిస్తోంది.

అన్నపూర్ణా ఆర్ట్స్ పిక్చర్స్‌వారి చిత్రానికి టైటిల్ కావాలట.

* * *

ఎస్. ఎస్. బాలన్ దర్శకత్వంలో విడుదలైన 'కలెక్టర్ జానకి' చిత్రానికి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. శ్రీ బాలన్ — తండ్రికి తగ్గ కుమారుడయ్యాడు.

బుల్లెమ్మ—బుల్లోడు శతదినోత్సవం


శ్రీరమణచిత్రవారి 'బుల్లెమ్మ—బుల్లోడు' ఏప్రిల్ 16న విశాఖపట్నం ప్రభాత్ టాకీసులో శతదినోత్సవం జరుపుకుంది. ఆంధ్రప్రదేశ్ అమాత్యులు శ్రీ ఎల్. లక్ష్మణదాస్ అధ్యక్షతన జరిగిన యీ శతదినో

త్సవ సభకి వందలాది జనం విచ్చేసారు. శ్రీమతి ఇందిరా శ్రీనివాసన్ మెమెంటోలను అందచేశారు. ఈ ఉత్సవాన్ని ప్రభాత్ టాకీస్, శ్రీఫిలింస్, శ్రీరమణ చిత్ర కలసి జరిపించారు. అమాత్యులు ప్రసంగిస్తూ, విశాఖపట్నం ఒక ఫిలిం కేంద్రం చెయ్యొచ్చు అన్నారు. చలం ప్రయోజనాత్మక చిత్రాలను నిర్మించడానికి నడుం కట్టాలన్నారు. హాలు బయట వేలమంది నిలబడి, చలంను చుట్టుముట్టారు. వాళ్ళందరికీ సావధానంగా, వినయంగా సమాధానం యిచ్చారట, చలం. ప్రేక్షకుల అభిమానమే లేకపోతే. చిత్రం యింత విజయవంతం అయ్యేదికాదు, అన్నారు చలం. అదృష్టవంతుణ్ని చెరిచేవాళ్ళు; దురదృష్టవంతుణ్ని బాగుపరిచేవాళ్ళు వుంటారా?

ప్రాణానికి తెగించిన నాయకుడు

ఏప్రిల్ 12న కళ్ళారాచూసిన దృశ్యాన్ని నెమరువేసుకుంటే, వొళ్ళు జలదరిస్తుంది; కళ్ళు మైకంతో తిరిగిపోతాయి. ఏడు వందల అడుగుల ఎత్తున ఎగిరే హెలికాప్టర్ అంచున నిలబడి, ఒకచేత్తో విలన్ పాత్రధారిని చిత్తుచేసిన ఆ నాయకుడి ధైర్యాన్ని యేమనాలో తెలియడం లేదు. నిర్మాతలు, శ్రేయోభిలాషులు, గుమికూడిన ప్రేక్షకులు వారించినా, వినకుండా ప్రాణానికి తెగించి, సాహసించారు అక్కినేని. ఆయునకు యేమాత్రం బాలెన్స్ తప్పినా ఎముకలు కూడా కనిపించివుండేవి కాదు. 'సహజత్వంకోసం అలా చెయ్యాల్సి వచ్చింది', అన్నారు అక్కినేని. ఇలాంటి దృశ్యం జగపతి ఆర్ట్ పిక్చర్స్‌వారి రంగుల చిత్రం 'బంగారుబాబు'కుగాను దర్శకుడు వి. బి. రాజేంద్రప్రసాద్ ఏప్రిల్ 12, 13 తేదీల్లో కోవలంలో చిత్రీకరించారు. రెండురోజుల షూటింగుకు లక్షన్నర ఖర్చయింది. తెలుగు నిర్మాతల్లో యింత భారీగా ఖర్చుపెట్టే నిర్మాత రాజేంద్రప్రసాద్‌గారే అని చెప్పాలి. నాణ్యతని కాంక్షించే, వెరైటీని అపేక్షించే మంచి నిర్మాతల్లో జగపతి అధినేత ఒకరు.

'బంగారుబాబు' మొదటి షెడ్యూలులో



విశాఖపట్నంలో జరిగిన 'బుల్లెమ్మ—బుల్లోడు' శతదినోత్సవంలో పాల్గొన్న నటీనటులు, డిస్ట్రిబ్యూటరు రామకృష్ణారావు.

నాగేశ్వరరావు, వాణిశ్రీ, నాగభూషణం, ఏస్. వెంకటరత్నం, ఆచార్య ఆత్రేయ, రాజబాబు, రమాప్రభ, పద్మనాభం, రమణా రెడ్డి, సారథి పాల్గొన్నారు.

మహదేవన్ చేకూర్చే బలం ఎంతో చెప్పడం కష్టం. మొదటి చిత్రంలో సంపాదించి



శ్రీ పేకేటి శివరామ్ కుమార్తె వివాహ సందర్భంలో తీసిన చిత్రం. వధూవరులని ఆశీర్వదించడానికి విచ్చేసిన తమిళనాడు గవర్నరు శ్రీ కె. కె. షా ని కూడా చిత్రంలో చూడవచ్చు.

పేరును సుస్థిరం చేసుకునే విధంగా శ్రీ రాజేంద్రప్రసాద్ కృషిచెయ్యడం తథ్యం. ఈ చిత్రం అన్నపూర్ణాద్వారా విడుదల గావడం ఒక విశేషం.

శ్రీకృష్ణ ఆంజనేయ యుద్ధము

సీతా వియోగమును భరించలేక, సీతకై విలపించే శ్రీరాముని బాధను చూడలేక పోయాడు హనుమంతుడు. రామభక్తుడు, వశిష్ఠునికడకేగి, 'శ్రీరాముని బాధకు విముక్తిలేదా ?' అని ప్రశ్నించాడు. ఒకరి బాధ తొలగవలెనన్న మరొకరు ఆ బాధను పంచుకొనవలెనని ఆ మునీంద్రుడు సలహా యిచ్చాడు. ఆంజనేయుడు మునీంద్రుని సలహానుసారంగా ప్రవర్తించెనా ? రాముని బాధకు నివారణోపాయం లభించెనా ?

సినిమా

అనెడి సమస్యలు ఎలా పరిష్కరింప బడ్డాయో, తెలియాలంటే 'శ్రీకృష్ణాంజనేయ యుద్ధము' సినిమాను చూడవలసినదే.

పూర్ణిమా పిక్చర్స్ నిర్మించిన యీ పౌరాణిక చిత్రంలో ఎన్టీరామారావు రామ, కృష్ణ, పరంధాముని రూపాలకు తమకు తామేసాటి అని మరోసారి నిరూపించారు. సత్యభామగా వాణిశ్రీ, హొయలు, వగలు, గర్వం, డంబం, శృంగారం, కోపం యొక్క ప్రతిరూపమా అన్నంతగా ఒప్పించింది. బలరామదేవుడిగా ఎస్వీ రంగారావుకు వెరైటీ పాత్ర దొరికింది. నారద, ఆంజనేయ పాత్రలకు కాంతారావు, రాజనాల పెట్టింది పేరు. రుక్మిణిగా దేవిక. వసంతకుడిగా రాజబాబు, యితరపాత్రలను శాంతకుమారి,



చి. సౌ. విజయలక్ష్మి, చి. సూర్యప్రసాదరావుల వివాహ సందర్భంలో తీసిన చిత్రం.

హేమలత, సంధ్యారాణి, లీలారాణి పోషించారు.

ఈ పౌరాణికానికి సముద్రాల మాటలను టి. వి. రాజు సంగీతాన్ని, జి. కె. రాము ఛాయను, గోఖలే కళను నిర్వహించారు. డి. ఎస్. రాజు నిర్మించిన యీ చిత్రం తారకరామాద్వారా విడుదలవుతుంది.

తమిళ చిత్రానికి పేకేటి దర్శకుడు

'కులగౌరవం' కథను బోలన్‌పిక్చర్స్ తమిళంలో నిర్మిస్తున్నారు. తమిళ సంవత్సరాది నాడు షూటింగు ప్రారంభమైంది. తాత, తండ్రి, మనవడు పాత్రలను ముత్తురామన్ ధరిస్తున్నాడు. జయంతి నాయిక. దర్శకుడు పేకేటి శివరాం.

హిందీలో కూడా యీ చిత్రం నిర్మించబడుతుందట.

అక్కినేని పాత్రలో రాజ్‌కుమార్

'ధర్మదాత' హిందీ చిత్రంలో అక్కినేని ధరించిన తండ్రి, తనయుడి పాత్రలను రాజ్ కుమార్ పోషిస్తున్నాడు. లీలాచంద్రా వర్కర్ నాయిక. పి. మాధవన్ దర్శకుడు. షూటింగు దాదాపు పూర్తయింది.

రాజా — రాణి

ఫిలిమ్‌కుంజ్ ప్రొడక్షన్స్ 'రాజా—రాణి' సాంఘికచిత్రాన్ని ఈస్ట్‌మన్ కలర్‌లో నిర్మిస్తున్నారు. రాజాగా రాజేష్‌ఖన్నా, రాణిగా షర్మిలాటాగూర్ నటించే యీ చిత్రానికి సచిన్ భౌమిక్ దర్శకుడు. ఆర్. డి. బర్మన్ సంగీత సారథి.

ఆదుర్తి చిత్రంలో సైరాబాను

బహార్ ఫిలిమ్స్ 'జవాబ్‌బతా' చిత్రాన్ని ఆదుర్తి సుబ్బారావు దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. సైరాబాను, ధర్మేంద్ర ముఖ్య పాత్రధారులు.

షమ్మీ ద్విపాత్రాభినయం !

సింకే ఫిలింస్ నిర్మించే 'ఛోటేసర్కార్' చిత్రంలో షమ్మీకపూర్ ద్విపాత్రాభినయం

చేస్తున్నారు. నాయిక సాధన. ముఖ్యపాత్రలను శశికళ, హెలన్, సులోచన పోషిస్తారు. సంగీతాన్ని శంకర్—జైకిషన్, కథను రాజేంద్రకిషన్ సమకూరుస్తున్నారు.

అమీర్—గరీబ్

విశ్వా ఫిలింస్ వారు మైసూరులో నిర్మిస్తున్న చిత్రం యిది. రాజేష్‌ఖన్నా, ప్రేమనాథ్ హేమమాలిని ముఖ్యపాత్రధారులు. కథ: కె. ఎ. నారాయణ; సంగీతం: లక్ష్మికాంత్, ప్యారేలాల్. మేలో షూటింగు ప్రారంభం.

వి వా హా లు

క్యారెక్టర్ నటుడు శ్రీ ఎస్వీ రంగారావుగారి జ్యేష్ఠపుత్రిక సౌ. విజయలక్ష్మికి, హైదరాబాదు వాస్తవ్యులు శ్రీ శృంగారం కృష్ణారావునాయుడుగారి కుమారుడు చి. సూర్యప్రసాదరావుకి మార్చి 31వ తేదీ ఉదయం మద్రాసులోని రాజేశ్వరి కళ్యాణ మండపంలో వైభవోపేతంగా వివాహం జరిగింది. వెండితెర ప్రముఖులందరూ వచ్చి, వధూవరులని ఆశీర్వదించారు.

* *

జర్నలిస్టు, నటుడు, అయిన పేకేటి శివరాంగారి కుమార్తె. సౌ. రాజ్యలక్ష్మికి, రిపబ్లిక్ శీతారాంగారి జ్యేష్ఠకుమారుడు సి. ఎస్. ఎన్. ప్రభుతో ఏప్రిల్ 6న ఎస్. జి. ఎస్. సభ హాలులో వైభవంగా వివాహం జరిగింది. పలువురు ప్రముఖులు వివాహానికి హాజరై వధూవరులని ఆశీర్వదించారు.

* * *

'మోసగాళ్లకు మోసగాడు' చిత్రనిర్మాత హీరో కృష్ణ తమ్ముడు అయిన చి. ఆదిశేషగిరిరావుకు, సౌ. లలితాప్రమీలతో; వారి సోదరి సౌ. లక్ష్మీతులసీదేవికి చి. సూర్యనారాయణతో ఏప్రిల్ 9 వ తేది ఉదయం రాజేశ్వరి కళ్యాణమండపంలో వైభవోపేతంగా వివాహ మహోత్సవాలు జరిగాయి. ప్రముఖులనేకమంది హాజరై ఆశీస్సులందజేశారు.

—శ్రీనివాస్

పుస్తకాలు

1. సైరన్

కవితా సంకలనం, వివిధ రచయితలు: డమ్మీ 78 పేజీలు. వెల 1—50 ప్రకాశకులు—కార్యదర్శి — యువరచయితల సమితి డి. నెం. 187—69 నల్లగొండ.

2. పాటలలో ఛందస్సు

రచన: శ్రీ పి. రాజగోపాలానాయుడు, బి. ఏ. డెమ్మీ 160 పేజీలు వెల 4 రూ. భారతీ ప్రచురణలు గిరింపేట, చిత్తూరు.

3 చిత్తూరు జిల్లా రచయితల తృతీయ మహాసభల ప్రత్యేక సంచిక

క్రౌను 1/4, పేజీలు 72. వెల 2 రూ. ప్రచురణ—చిత్తూరు జిల్లా రచయితల సంఘం, చిత్తూరు.

1. నేటి సమాజం అన్యాయంలో మునిగిందని దారిద్ర్యం, సామాన్య మానవుణ్ణి పీల్చి పిప్పిచేస్తున్నదనీ, రాజకీయాలు, కుల మత, మౌఢ్యాలను రెచ్చగొడుతున్నవనీ, పత్రికలూ, సినిమాలు, చెత్త కార్తె చెత్త సాహిత్యంతో యువతరాన్ని నిర్వీర్యం చేస్తున్నందుకు బాధపడి తత్ప్రతీకారంగా యువరచయితల సమితి వారు ఈ సైరన్ మూలంగా సమాజానికి హెచ్చరిక నిస్తున్నారు. సాహిత్యం ద్వారా వాస్తవికతకు దర్పణం పట్టి నిద్రాణమైన జాతిని మేల్కొల్పడానికి నలభైకి పైగా గొంతుకలతో పొలికేక వేస్తున్నారు. ఇందలి సాహిత్యం చిత్తకార్తెకు చెందిన చెత్త కాదని అనుకోవాలి. నేడు కుప్పలు, తిప్పలుగా వెలువడుతున్న వచన పద్య, గేయాల కోవలోనిదే ఇదిన్నీ.

* * *

2. పరిశీలన దృష్టితో చూస్తే ఛందస్సుకూ, శ్రుతి ప్రాసలకూ పద్యాలలోకంటె పాటలలోనే ఎక్కువ ప్రాముఖ్యం కానవస్తుంది. శ్రుతిపేయమైన గానంలో ప్రధానమైన సాహిత్యం ఛందానుప్రాసాల మీదనే ఆధారపడి ఉన్నది. గేయ వాఙ్మయం లోని ఛందస్సుని గురించి శాస్త్రీయంగానూ అనుభవ పూర్వకంగానూ, అపార కృషిచేసిన రాజగోపాల నాయుడుగారి కృషి ఫలితం యీ గ్రంథం. సామాన్యులేకాక విద్వాంసులూ, పరిశోధకులు కూడా తెలుసుకోదగిన విషయాలెన్నో యీ గ్రంథంలో ఉన్నవి. ఇందులో చెప్పబడిన విషయాలన్నిటికీ ప్రమాణాలు ఉదాహరణలు ఈయబడినవి. తెలుగులో వెలువడిన అపూర్వ గ్రంథాలలో ఇదొకటి.

* * *

3. మాండలిక రచయిత సంఘాలను స్థాపించిన వారిలో చిత్తూరుజిల్లా వారిదే అగ్ర తాంబూల మనుకుంటాను. వీరి అడుగు జాడల్లోనే చాలా మాండలిక రచయితల సంఘాలు వెలువడి, తమకు నచ్చిన వారిని కూడదీసుకుని మహాసభలను, ఉత్సవాలను జరుపుకుంటున్నారు. ఈ చి. జి. ర. తృతీయ మహాసభల సంచిక పేరుపడిన వారిరచనలు, సభలకు సంబంధించిన నివేదికలు, ఛాయా చిత్రాలు, అక్కడకక్కడ—పలల అడుగున (స్థలం మిగిలి పోతేనేమో) పెద్దలు పలికిన పసిడి పలుకులు ఉన్నవి. ఆ జిల్లాకు సంబంధించిన వారికే కాకుండా ఇతరులకు కూడా చదవడానికి ఉత్సాహాన్ని కలిగిస్తుంది యీ సంచిక. **—అంగీరస**

బాలసాహిత్యం :

'అమర చిత్రకథా' సీరీస్‌లో పది కథలు—1. బాలకృష్ణుడు, 2 శకుంతల, 3. పంచ పాండవులు, 4. సావిత్రి, 5 శ్రీరామకథ, 6. నలదమయంతి, 7. హరిశ్చంద్ర, 8, లవ—కుశ 9. హనుమంతుని కథ, 10. మహాభారతం.

ప్రతిపుస్తకం క్రౌన్ క్వార్టో సైజున 32 పేజీలు. ఒక్కొక్కటి రూపాయిన్నర. ప్రచురణ: ఇండియాబుక్‌హౌస్, 3—4—423 నారాయణ గుడా, హైదరాబాదు—29. సోల్ ఏజంట్లు, ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాదు.

కథాలోకంలో ఇది కొత్త అవలోకన. సినిమాల్లోలాగా ఇవన్నీ బొమ్మలు మాటాడుకుంటూ మనకి చెప్పే కథలు. కథకు బొమ్మ తోడుగా ఉండటం లోగడ రివాజు. ఈనాడు బాణీ మారింది. బొమ్మకు కథ తోడవుతున్నది. అంటే—కథ ఒకరు చెప్పడం, మనం వినడం కాదు. తెరమీది బొమ్మల్లాగా పుస్తకంలో . బొమ్మలే మనకి ముఖాముఖి కథ చెబుతాయి.

ఇటువంటి పద్ధతి పాశ్చాత్య సాహిత్యంలో ఏనాడో అమల్లోకి వచ్చింది. వారి ప్రసిద్ధ కథలూ కావ్యాలూ అప్పుడే లక్షలాదిగా పుస్తక రూపంలో వెలువడి, కోట్లకొద్ది ప్రజను ఆకర్షించి ఆనందింప జేస్తూనే వున్నాయి. ఇదే తీరులో మన భారతీయ సాహిత్యాన్ని కూడా రూపొందించాలనే ఆసక్తి ఇప్పుడిప్పుడే మనవారికి కలగడం శుభ సూచకం.

సమీక్షకు వచ్చిన పది కథలూ పూర్తిగా పౌరాణికం. ఆబాలగోపాలానికీ తెలిసినవే. పసిపాపలు సయితం ఉగ్గుపాలతో జీర్ణించుకున్నవే. అయినా, ఈ కొత్త రూపంలో మళ్లీ చదవటానికి ఎంతో కుతూహలపడతారు. అందుకనేవీటికి 'కలకాలంనిలిచే కల్యాణాత్మక కథ' అనే మాట సార్థకమవుతుంది.

ఈ కోవకు చెందిన కథల బొమ్మలకు భావ ప్రకటన జీవం. ఇది పది కథల్లోనూ చక్కగా నెరవేరింది. అయితే 'హరిశ్చంద్ర'లో శైబ్యాదేవి 'పంచపాండవులు' లో కుంతీదేవి లాటి కొన్నిపాత్రల ముఖలక్షణాలూ దుస్తులూ పాశ్చాత్య శైలిలో చిత్రింపబడ్డాయి. భారతీయుల హృదయానికి స్త్రీ పాత్రల వ్యత్యాసం ఇట్టే పట్టిచ్చేస్తుంది. కనుక ముఖ్యంగా పౌరాణిక వ్యక్తుల చిత్రణకు ఆ మనస్తత్వంలో ఆరితేరిన వారే పూనుకోవాలి. ఇంగ్లీషుపాఠం మాతృకగా ఆధారం చేసుకుని తక్కిన రాష్ట్ర భాషల తర్జుమా జరగటమే బహుశా ఈ లోపానికి కారణం కావచ్చు.

ఇదే కారణం వల్ల అనువాదంలో కూడా రచయితకు తగినంత స్వాతంత్ర్యం లేక ఇబ్బంది పడినట్లు కొన్ని ఘట్టాలలో కానవస్తుంది. 'నలదమయంతి' 13—వ పేజీలో అక్షరాలు తిరగ మరుగులు కావటం పెద్ద పొరపాటు. ఈ చిన్న లోపాలే లేకపోతే ఇవి అక్షర లక్షలు చేసే అమర చిత్ర కథలే.

ప్రచురణ కర్తలు ప్రారంభించినది మహోద్యమం. దీన్ని జయప్రదంగా కొనసాగించగల సమర్థులు వారు. మనది తరుగు లేని సాహిత్య సంపద. దీన్ని వినియోగించి అపారమైన సేవ చేయగల అవకాశమున్నది వారికి. మంచి మంచి కథలను రంగు రంగుల బొమ్మలతో, ముచ్చటయిన ముద్రణతో, అన్ని జాతీయ భాషల్లోను అందిస్తున్న ఇండియా బుక్ హౌస్ వారికి తెలుగు వాట పిన్నలూ పెద్దలూ తప్పక జేజేలు చెబుతారు. **—శివకుమారి**

జీవిత వలయాలు

రచయిత: ఎల్. మాలకొండయ్య. ప్రతులకు. వివేకానంద ప్రింటర్సు. లకిడీకాఫూల్, హైదరాబాదు—4. వెల: అయిదు రూపాయలు.

ఇది ఎల్. మాలకొండయ్యగారు అప్పుడప్పుడు రచించిన అరవై అయిదు వచనకవితల సంపుటి.

శ్రీ మాలకొండయ్యగారి వచన కవితారచనలో ముఖ్యంగా కనిపించేది చక్కని సరళత. అచ్చమయిన అతిశయోక్తి లేని అనుభూతి.

ఈ సంపుటిలో 'ఎవరా చిన్నది?' 'ప్రేమ', 'పొగడ్త', 'సెలయేరు' వంటి ఎన్నదగిన కవితలు కొన్ని కనిపిస్తాయి.

జీవితం తరచి చూచిన అనుభూతి 'ప్రేమ'లో స్ఫురిస్తుంది.

'ఎవరా చిన్నది?' సొగసయిన జీవిత చిత్రణం. పిల్లలనుద్దేశించి రచించిన 'ఆరుగురు మిత్రులు' పిల్లలేకాక పెద్దలు కూడా చదివి ఆలోచించ వలసిన వచన కవిత.

శ్రీ మాలకొండయ్యగారి లేఖిని నుండి ఇతోధికంగా మంచి రచనలు ఇంకా వెలువడగలవని ఆశించవచ్చును. **— శాస్త్రి**

దర్పణం

నల్లగొండ సాహితీ మిత్రుల నిర్వహణలో, శ్రీ కంచనపల్లి చిన వెంకటరామారావు గౌరవ సంపాదకత్వంలో వెలువడిన 'దర్పణం' సాహితీ త్రైమాస పత్రిక ప్రారంభ సంచిక మా కార్యాలయం చేరింది. 58 పేజీలు గల ఈ పత్రిక వెల ఒక రూపాయి. వివరాలకి:దర్పణం త్రైమాసిక, నల్లగొండ, (అం. ప్ర.)

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press: 6 & 7. Thambu Chetty Street, Madras-1; and at Andhra Patrika Press, Mallikarjuna Rao Street, Gandhinagar, Vijayawada 3.
Editor : S. Sambhu Prasad.



నటి ఆరతి


అవును, యిది నిజం!
డస్ట్ టీలలోకెల్లా త్వరితంగా ప్రగతి చెందేలా
లిప్టన్
రూబీ డస్ట్ ను
తయారుచేసింది వీరే
RUBY DUST
Superb Teas
SELECTED FOR STRENGTH AND FLAVOUR
RUBY DUST
రూబీ డస్ట్. విలువయిన రుచి, యింపైన రంగు, వెనువెంటనే యిచ్చే ఆహ్లాదము, ఇతర డస్ట్ టీలలోకల్లా ఎన్నో ఎక్కువ కప్పుల టీ.
ఇండియాలో త్వరితంగా ప్రగతి సాధిస్తున్న డస్ట్ టీ
లిప్టన్స్ అంటే మంచి టీ
LIPTON
ప్యాకెట్లలోవున్న టీ మాత్రమే తాజాతనము, సువాసన నిలిచివుండును
LRDC-6 R/72TEL